

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



సహజీవనం చేసి.. అత్యాచారమంటూ పిటిషనా?

ఆప్ ఎంపిల విలీనానికి ఆమోదం

11 ఏళ్ళుగా ఆయుధ వ్యయాల భారీ పెరుగుదల 05



సంపుటి 09, సంచిక: 148 | మంగళవారం | 28-04-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





# నో స్టాక్

- రాష్ట్రంలో మరోసారి పెట్రోల్, డీజిల్ కొరత!
- స్టాక్ ఉన్న బంకుల వద్ద బారులుతీరిన వాహనదారులు
- బాటిళ్లు, క్యాన్లు లైన్‌లో పెట్టిన వైనం
- ఎలాంటి కొరత లేదు : స్టీఫెన్ రవీంద్ర

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మరోసారి పెట్రోల్, డీజిల్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఎపిలోనూ తీవ్ర కొరత ఏర్పడింది. కాగా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. రాత్రి నుంచి పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ కొరత వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల్లో పెద్ద సంఖ్యలో బారులు తీరారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో కొన్నాళ్లుగా సిఎన్‌జి కొరత కొనసాగుతోంది. బంకుల ముందు



తరువాయి 2లో



# కవిత ప్రశ్నలకు కెసిఆర్ జవాబివ్వాలి

- మరమనిషి వ్యాఖ్యలపై కెసిఆర్ మాట్లాడితేనే ప్రజలు హర్షిస్తారు
- భవిష్యత్తులో బిజెపితో కలిసి పోటీ చేయబోమని చెప్పగలరా
- కెసిఆర్ కుటుంబమంతా ఒకేతాను ముక్కలే
- బిఆర్‌ఎస్‌కు గతం తప్ప భవిష్యత్ లేదు
- కాళేశ్వరంపై విచారణ చేపట్టాలని త్వరలోనే సిబిఐ డైరెక్టర్‌ను కలుస్తాం
- జర్నలిస్టుల ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

> ‘బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపిలు చామల కిరణ్, మల్లు రవి, కడియం కావ్య లోక్‌సభలో మాట్లాడితే బిఆర్‌ఎస్‌కు కనిపించలేదా... వినిపించలేదా.. చామల కిరణ్ పార్లమెంటు ద్వారం వద్ద కూడా నిరసన తెలిపారు. ఇదీ బిఆర్‌ఎస్ వాళ్ళకు కనిపించదు.. వినిపించదు..’
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

## వచ్చే ఎన్నికల్లో రెండు కూటముల మధ్యే పోటీ

వచ్చే ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్‌లు కలిసి కూటమిగా ఉంటాయని, కాంగ్రెస్‌తో పాటు సిపిఐ, సిపిఐ(ఎం), కోదండరామ్ పార్టీలు కూటమిగా ఉంటాయని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వారిది భూస్వాములు ఒక్కటైన కూటమి అయితే, తమది కర్షకలు, కార్మికులు ఒక్కటైన కూటమి అని అన్నారు. తాము ఇప్పటికే కెసిఆర్‌ను నాలుగు సార్లు ఓడించామని, పిసిసి అధ్యక్షుడి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో తాను ఓడించానని, తరువాత గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో ఓడించారని తెలిపారు.

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే, నూతన రాజకీయ పార్టీ పెట్టిన కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నలకు ఆయన సమాజానికి సమాధానమివ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనం గురించి స్వయంగా కవితనే చెప్పిందని, ముందు కవిత మాటలకు జవాబు చెప్పాలని అన్నారు. అలాగే కెసిఆర్ మరమనిషిగా మారాడని, ఆయన చుట్టూ పంది కొక్కులు రాబందులు ఉన్నాయని కూడా ఆమె అన్నారని, వాటిపై కెసిఆర్ మాట్లాడితే ప్రజలు హర్షిస్తారని చెప్పారు. భవిష్యత్తులో బిజెపితో కలిసి పోటీ చేయబోమని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ తన ఇష్టదైవంపై ఒట్టేసి చెబుతారా అని సవాలు విసిరారు. వచ్చే ఎన్నికల నాటికి ఆ రెండు పార్టీలు కలిసి పోతాయన్నారు. టిఆర్‌ఎస్ వారసత్వం కోసం కవిత, బిఆర్‌ఎస్‌లు పోటీ పడుతున్నాయని, వారిలో ఎవరు మిగులుతారో చూద్దామన్నారు. బిఆర్‌ఎస్ పార్టీకి గతం ఉంది తప్ప భవిష్యత్తు లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పార్టీ చనిపోయిన శవంతో సమానమని, చనిపోయిన శవానికి ఎంత అలంకారం చేసినా లేచి వచ్చేది కాదన్నారు. టిఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఉద్దేశ్యం అయిపోయిందని, కాబట్టి ఆ పార్టీ ముగిసినట్లేనని చెప్పారు. నూతన ఎంఎల్‌సిల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన సిఎం రేవంత్ రెడ్డి అనంతరం మండలి ప్రాంగణంలో జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటు గురించి ప్రస్తావించగా, రాష్ట్రంలో కొత్త పార్టీ సంగతి పక్కనపెట్టండి, ఉన్న బిఆర్‌ఎస్ ఉంటుందా, ఉండదా అనేది ఆలోచించాలని, కెసిఆర్ పార్టీ పర్పస్ పూర్తయింది.. మనుగడ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అహంభావం, అహంకారం వంటి ఎన్ని అవ లక్షణాలు ఉన్నప్పటికీ ఉద్యమం కారణంగా ప్రజలు పట్టించుకోలేదన్నారు. పదేళ్ల అధికారంలో అహంభావం, అహంకారం భరించారని,అవినీతి, కుటుంబ పాలనను సహించారని, కానీ ఇక సహించలేక 2023 లో కెసిఆర్ ను ఓడించారని గుర్తు చేశారు.

**పంపకాలలో తేడాతోనే మరో కుంపటి...**

కెసిఆర్ కుటుంబానికి, బిఆర్‌ఎస్‌కు కాలం చెల్లిందని, ఆ కుటుంబానికి,

తరువాయి 2లో




# ఏం జరుగుతోంది?

- తెలంగాణపై బిజెపి ఎంపి వ్యాఖ్యలు చేస్తే ఎవరూ స్పందించరా ?
- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా రాష్ట్ర ఎంపిలు ఎందుకు మౌనంగా ఉన్నారు?
- బిఆర్‌ఎస్ చీఫ్ కెసిఆర్ నిలదీత
- సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా ఎందుకు ఓడిపోయిందో ఆత్మవిమర్శలు చేసుకోవాలని బిఆర్‌ఎస్ నేతలకు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంలో బిజెపి ఎంపి తేజస్వి చేసిన వ్యాఖ్యలపైన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా తెలంగాణ రాష్ట్ర ఎంపిలు పార్లమెంట్‌లో ఎందుకు మౌనంగా ఉన్నారని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. పార్లమెంట్‌లో బిఆర్‌ఎస్ ఎంపిలు ఉండి ఉంటే రణరంగం చేసేవాళ్లమన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినప్పటికీ, ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయామో ఆత్మ విమర్శ చేసుకోవాలని కెసిఆర్ చెప్పినట్టు తెలిసింది. బిఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాల ముగింపు సందర్భంగా కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు కెసిఆర్ మాట్లాడుతూ ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని, కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భూముల కబ్జాల్లో, కూల గొట్టడంలో రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను చూస్తే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందన్నారు. కాగా ఇటీవల కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్‌లో

తరువాయి 2లో

# ‘సంక్షేమం’కు తూట్లు

- లక్షలాది కార్మికుల ఉపాధికి గండి
- మహిళా బిల్లు పేరిట రాజ్యాంగాన్ని మార్చే కుట్ర
- మోదీ సర్కారుపై నిప్పులు చెరిగిన అమర్‌జిత్ కౌర్



**తిరుపతి:** దేశంలో అట్టడుగు వర్గాలు లబ్ధి పొందుతున్న సంక్షేమ పథకాలకు క్రమంగా కేంద్ర ప్రభుత్వం కోత పెడుతోందని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. సంక్షేమ కార్యక్రమాల అమలు నుంచి కేంద్రం తప్పుకోవాలని భావిస్తోందని చెప్పారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశావర్కర్ల విధులు, మధ్యాహ్న భోజన పథకం అమలులో తన వాటాను కేంద్రం తగ్గించుకుంటూ వస్తోందని, భవిష్యత్తులో ఈ పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి ఏమిటో మనకు తెలుసు అని చెబుతూ భవిష్యత్తులో ఈ పథకాలు ఉండవని హెచ్చరించారు. దీంతో ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్‌వాడీ ఉద్యోగులు తమ ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐటియుసి 18వ రాష్ట్ర మహాసభలలో భాగంగా సోమవారం ఉదయం ప్రతినిధుల మహాసభలు తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ముందుగా ఎఐటియుసి జెండాను రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు నివాళులు అర్పించారు. ప్రతినిధుల మహాసభకు అధ్యక్ష వర్గంగా ఆర్.రవీంద్రనాథ్, కె.రాధాకృష్ణ, ప్రేమ, దామోదర రావు, సాంబశివరావు వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగ సుబ్బారెడ్డి గత మహాసభల నుండి ఈ మహాసభల వరకు మృతి చెందిన వారికి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు పి.హరినాథరెడ్డి అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, రంగు, వేసుకునే దుస్తులు ఆధారంగా ప్రజలను విభజించే నాయకులకు అధికారం దూరం చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక

తరువాయి 2లో




# కలెక్టర్‌లకు మరిన్ని అధికారాలు

- ఇందిరమ్మ ఇండ్ల వేగవంతానికి అధికార వికేంద్రీకరణ
- ఇళ్లు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు
- కట్టుకోలేని వారు స్వచ్ఛందంగా తెలియజేస్తే ఇతరులకు కేటాయింపు
- గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత వేగవంతంగా అమలు చేయడానికి అధికార వికేంద్రీకరణ చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. జిల్లా కలెక్టర్‌లకు మరిన్ని అధికారాలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. గతంలో దరఖాస్తు చేయని వారు కూడా అర్హత ఉంటే ఎప్పుడైనా దరఖాస్తు చేసుకుని ఇల్లు పొందవచ్చు అన్నారు. వివిధ కారణాలతో ఇల్లు నిర్మించుకోలేని వారు స్వచ్ఛందంగా తెలియజేస్తే, వారి స్థానంలో ఇతరులకు కేటాయించాలని అధికారులకు ఆదేశించారు. ఇంటి బేస్‌మెంట్ పూర్తి చేసిన తర్వాత విడుదల కావాల్సిన రూ.1 లక్ష సహాయాన్ని ఆలస్యం లేకుండా

తరువాయి 12లో

# యుద్ధం ముగించేందుకు 3 దశల చర్చలు

- అమెరికాకు చేరిన మూడు అంశాల ఇరాన్ కొత్త ప్రణాళిక
- తొలిదశలో అణు ఒప్పందం లేకుండా హోర్ముజ్ తెరవాలి
- దురాక్రమణ దాడుల నిలిపివేత–భద్రత హామీ
- ఇరాన్–ఒమన్ ఉమ్మడిగా హోర్ముజ్ నిర్వహణ
- చివరి దశలోనే అణుపదార్థంపై చర్చ
- ఒప్పుకుంటే వెంటనే చర్చలు షురూ : ఇరాన్ ప్రకటన



**టెహ్రాన్:** పశ్చిమాసియాలో యుద్ధం ముగించి ఉద్రిక్తతలకు తెర దించేందుకు మూడు దశలలో చర్చించే విధంగా ఒక కొత్త ప్రణాళికను ఇరాన్ నాయకులు ప్రతిపాదించారు. “అణుఒప్పందం అంశాన్ని తుదిదశ (మూడోదశ) చర్చల ప్రాధాన్యతగా భావించి, అంతర్జాతీయ వాణిజ్యం కోసం హోర్ముజ్ జలసంధిని తక్షణం తెరిపించడమే ఈ ప్రతిపాదనల్లో అతిముఖ్యమైన అంశం. ఈ ప్రతిపాదనకు అమెరికా ఇష్టపడి అంగీకరిస్తే వెంటనే చర్చలు ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పాలకులు ప్రకటించారు. మొదటి దశ చర్చల్లో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దురాక్రమణను నిలిపివేయడం, భవిష్యత్తులో ఇక దాడులు జరగకుండా ఆ రెండు దేశాల నుండీ ఇరాన్ ఒక భద్రతాహామీ పొందడం, రెండవ దశ చర్చల్లో ఇరాన్–ఒమన్ దేశాలు రెండూ సమన్వయ భాగస్వామ్యంతో హోర్ముజ్ జలసంధిని నిర్వహించేందుకు వీలుగా సమస్య పరిష్కరించడం, జలసంధిని రాకపోకలకు తెరిపించడం, ఈ రెండు దేశాలు కలిసి హోర్ముజ్ జలసంధిని నిర్వహించడానికి ఒక న్యాయపరమైన నిబంధనల చట్రాన్ని రూపొందించడం. ఈ రెండు దశల చర్చల్లో ఈ అంశాలన్నీ పరిష్కారమైన తర్వాత ఇక చివరి మూడోదశ చర్చల్లో మాత్రమే ఇరాన్‌కు సంబంధించిన అణు పదార్థం,అణ్వాయుధ సమస్యపై చర్చలు కొనసాగాలని, ఈ రెండుదశల చర్చలు పూర్తయ్యేవరకూ ఇరాన్‌కు ఉన్న అణు హక్కు లు, అణుపదార్థం అంశాన్ని చర్చకు

తరువాయి 2లో

# ఆధునిక వ్యవసాయంతో ఆదాయం

- రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/రఘునాథపాలెం



ఆధునిక వ్యవసాయంతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మంజిల్లా రఘునాథపాలెం రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు ఆధునీక వ్యవసాయ పద్దతుల ప్రయోజనం అందించేందుకు శాస్త్రవేత్తలు గ్రామస్థాయికి వెళ్లేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఏ పంట సాగు చేయాలి, ఎంత ఎరువు వాడాలి, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఎలా సాధించాలి వంటి ఆధునీక వ్యవసాయ సాంకేతికతలను తెలుసుకోవాలని సూచించారు. మే నెలలో గోద్రెజ్ ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని గోద్రెజ్ సంస్థ ఖమ్మంజిల్లాలో ఆయిల్ పాం నర్సరీని కూడా స్థాపించనుందన్నారు. గత పదేళ్లలో యాంత్రీకరణకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు కేటాయించనుందన్నారు. రైతులు ఆయిల్‌పాం సాగు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ.51వేలు సబ్సిడీ అందిస్తుందని ఈ పంట 40 ఏళ్ల పాటు ఆదాయాన్ని అందిస్తుందన్నారు. అంతర పంటలుగా మిర్చి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు, వక్క, జాజి, కోకో వంటి పంటలు కూడా సాగు చేసుకోవచ్చునని తెలిపారు. శాస్త్రవేత్తలు అందించిన సలహాలు, సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితి ఉందని దానికి అనుగుణంగా పంటల సాగు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా

తరువాయి 12లో

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం అన్నదాతల గొంతు కోయడమే

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవమంటే దేశంలోని అన్నదాతల గొంతు కోయడమేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందంలో అంశాలు బయటికి రావడంతోనే మొక్కజొన్న, సోయాబీన్ ధరలు పతనమయ్యాయన్నారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తుల ధరలన్ని మరింత

తరువాయి 12లో

# డిసెంబరు నాటికి న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్యం

- ఎఫ్‌టిఎపై వాణిజ్యమంత్రుల సంతకాలు
- రైతులు, యువకులు, మహిళలు, స్టార్టప్‌లకు గొప్ప లాభం: మోదీ
- పెట్టుబడులు, నైపుణ్యవృద్ధి, ఉపాధి అవకాశాలు: గోయల్
- ద్వైపాక్షిక వస్తుసేవల వాణిజ్య ఐదేళ్ళలో ఐదు బిలియన్ డాలర్లు
- వస్త్రాలు, రత్నాలు, అభరణాలు, తోలు వస్తువులుసహ
- సుంకాలు లేకుండా నూటికి నూరుశాతం భారత్ ఎగుమతులు



**న్యూఢిల్లీ :** స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్.టి.ఎ)పై భారత్–న్యూజిలాండ్ సంతకాలు చేశాయి. ఈ ఏడాది డిసెంబరునాటికి ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది. ఈ మేరకు న్యూజిలాండ్ ద్వీప దేశానికి సుంకాలు

తరువాయి 12లో

# శాంతి చర్చల వైఫల్యానికి కారణం అమెరికానే

### హోర్ముజ్‌పై ఇరాన్–ఒమన్ దేశాలు సమన్వయ కృషి
### రష్యా పర్యటనలో ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వెల్లడి

**సెయింట్‌పీటర్స్‌బర్గ్ :** పశ్చిమాసియా యుద్ధ నివారణకు ఇస్లామాబాద్ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలు విఫలం కావడానికి అమెరికాయే కారణమని ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి విమర్శించారు. హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్,ఒమన్ దేశాలు సమన్వయంతో వ్యవహరిస్తాయని చెప్పారు. పాకిస్థాన్,ఒమన్ పర్యటనల తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ముఖాముఖీ సమావేశం నిమిత్తం అబ్బాస్ అరాఘ్చి సోమవారం సెయింట్ పీటర్స్ బర్గ్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత టెలిగ్రామ్ ఛానల్‌లో ఆయన ఒక వీడియో పోస్టు చేశారు. అదేవిధంగా ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఒక ప్రకటన చేస్తూ, గతంలో జరిగిన చర్చల్లో కొంత పురోగతి సాధించినప్పటికీ అమెరికా అనుసరించిన మొండి వైఖరి, మితిమీరిన డిమాండ్ల కారణంగా శాంతి చర్చలకు విఘాతం కలిగిందని అరాఘ్చి చెప్పారని పేర్కొంది. శత్రుదేశాలు అమెరికా,ఇజ్రాయెల్ రెండూ జలమార్గాల ద్వారా తీవ్ర దిగ్బంధన చర్యలు కొనసాగిస్తున్నాయని, ఈ దిగ్బంధనం ఉన్నంతకాలం చర్చలకు అవకాశం లేదని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి కొనసాగడానికి హోర్ముజ్ జలసంధి కీలక జలమార్గమనే విషయం అందరికీ తెలుసునని, ఈ జలమార్గంలో నౌకల సురక్షిత ప్రయాణం కూడా శాంతి చర్చల్లో ఒక ముఖ్యమైన అంశమని ఆయన చెప్పారు.

రష్యా–ఇరాన్ దేశాలమధ్య సత్సంబంధాల గురించి ప్రస్తావిస్తూ, అనేక ప్రపంచ ముఖ్య విషయాలపై రెండు దేశాలూ ఉమ్మడిగా స్పందిస్తూ, సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉన్నాయన్నారు. ''మీరు చూస్తున్నవిధంగా అనేక ప్రాంతీయ సమస్యలపై సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం, నిరంతర ద్వైపాక్షిక చర్చలు జరుపుతూనే ఉన్నాం'' అని టెలిగ్రామ్‌లో పోస్టు చేసిన వీడియోలో పేర్కొన్నారు. అదేవిధంగా శనివారం ఉదయం మా మిత్రదేశం పాకిస్థాన్‌తో జరిపిన ద్వైపాక్షిక సంప్రదింపులు కూడా చాలా విజయవంతంగా జరిగాయని చెప్పారు. ఇటీవలి సమావేశాల సారాంశాన్ని సమీక్షించామని, ఇక చర్చలు ఏ దిశలో, ఏ షరతులపై ముందుకు వెళ్ళాలన్న విషయంపై సంప్రదింపులు జరిపామని చెప్పారు. అమెరికాతో చర్చల్లో ఇరాన్ షరతులు చాలా ముఖ్యమైనవని అన్నారు. 40 రోజులు యుద్ధంలో శత్రుదేశాలను ప్రతిఘటించిన తర్వాత ఇరాన్ ప్రజల హక్కులను కాపాడాలని, దేశ ప్రయోజనాలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. ఆదివారంనాడు ఒమన్‌దేశ రాజు సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్‌తో జరిపిన ముఖాముఖీ సమావేశంలో సంప్రదింపుల సారాంశాన్ని అరాఘ్చి ప్రస్తావించారు.

''ఒమన్ మాకు చాలా సన్నిహిత మిత్రదేశం, యుద్ధ సమయంలో ఆ దేశం చాలా మంచి వైఖరి అవలంబించింది, ఇరాన్–ఒమన్ రెండూ హోర్ముజ్ జలసంధికి సంబంధించిన తీరప్రాంత దేశాలు కాబట్టి, ఈ యుద్ధం విషయంలో వారితో మేం చర్చలు జరపాల్సి వచ్చింది, జలసంధి మీదుగా నౌకల సురక్షిత ప్రయాణం ఒక అతిముఖ్యమైన ప్రాపంచిక సమస్య, ఈ జలసంధిని నియంత్రించే దేశాలుగా ఇరాన్–ఒమన్ రెండూ పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది, అందువల్ల మా రెండు దేశాలు సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది'' అని అరాఘ్చి ఈ వీడియో ద్వారా తెలియజేశారు.

# ట్రంప్ రేపిస్ట్, ద్రోహి

## నిందితుడు అలెన్ విమర్శలు

### ఎవరెవర్ని చంపాలో ముందే చిట్టా రాసుకున్న గన్‌మన్



**వాషింగ్టన్ :** వైట్‌హౌస్ హిల్టన్ హోటల్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై శక్తిమంతమైన ఆయుధాలతో దాడికి ప్రయత్నం చేసిన కంప్యూటర్ సైంటిస్టు, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుడు కోల్ థామస్ అలెన్ (31) ముందుగా ఒక పథకం ప్రకారమే సిద్ధమై వచ్చాడని ప్రాథమిక సాక్ష్యాధారాలు చెబుతున్నాయి. ట్రంప్ సహా ఆయన పాలనాధికారులలో ఎవరెవర్ని చంపాలో పేర్ల జాబితాను అలెన్ ముందుగానే సిద్ధం చేసుకున్నాడు. ట్రంప్‌ను ద్రోహి, జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ బాగోతం నేపథ్యంలో పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి, రేపిస్ట్ అని తన చిట్టాలో అలెన్ రాసుకున్నాడు. ఇరాన్‌లో స్కూలు పిల్లలపై దాడి మరణాలను కూడా పరోక్షంగా తన చిట్టాలో ప్రస్తావించాడు. ఇలాంటి వ్యక్తిని తాను క్షమించబోనని రాసుకున్నాడు. నేను బాంబుదాడిలో మరణించిన స్కూలు విద్యార్థిని కాదు, ఎంతోమంది చేతుల్లో అత్యాచారానికి గురైన బాలికనుకాదు, ఇతరులు అణచివేతకు గురవుతుంటే మరో చెంప చూపించే క్రైస్తవుణ్ణి కాదు నేను, అలా చూపించడమంటే దాడులు చేసే వాళ్ళని ప్రోత్సహించడమే అని తన చిట్టాలో నిందితుడు అలెన్ రాసుకున్నాడు. ఈ వ్యవహారాలపై ఎఫ్‌బిఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అతడిని పార్ట్‌టైమ్ టీచర్‌గా గుర్తించారు. వాస్తవానికి అలెన్ విద్యాధికుడు, కంప్యూటర్ సైంటిస్టు. వీడియో గేమ్ ఇండిపెండెన్సీని అతడు అభివృద్ధి చేశాడు. అతడొక ఇంజనీరు, ఎడ్యుకేటర్. కానీ ట్రంప్ చేష్టలతో విసిగిపోయి అతడిపై ఆగ్రహం పెంచుకుని ఇంతటి సాహసానికి పూనుకున్నాడని, అతడివెనుక ఏ అదృశ్య శక్తీ లేదని ప్రాథమికంగా తెలుస్తోంది. కాలిఫోర్నియాలో అతడి సొంత నగరం టోరెన్స్‌కు వెళ్ళి అతడి ఇంటి చుట్టుపక్కలవారిని ఆరా తీస్తున్నారు. అతడి ఇంటి చుట్టుపక్కలవారు కూడా ఈ ఘటన విని ఆశ్చర్యపోతున్నారు. ఐతే అలెన్ ముందుగానే బయట నుండి తన కుటుంబాన్ని అప్రమత్తం చేశాడు. ఐతే ట్రంప్ సోమవారం ఈ విషయంపై మళ్ళీ స్పందిస్తూ, మీడియా డిన్నర్‌లో తనపై దాడి చేసిన వ్యక్తిని వికృత మనస్తత్వంగల వ్యక్తిగా అభివర్ణించారు. అలెన్ రాసుకున్న పదజాలంలో రేపిస్టు, ద్రోహి, పిల్లలను లైంగిక వేధింపులకు గురిచేసేవ్యక్తి అనే పదాలన్నీ తనకు సంబంధించినవి కాదని ఆయన ఖండించారు. అతడు క్రైస్థవ మత వ్యతిరేకి అని అభివర్ణించారు. ముందుగానే అతడు క్రైస్థవ మత వ్యతిరేక మానిఫెస్టో తయారు చేసుకున్నాడని విమర్శించారు. రాజకీయ హింస అమెరికాకు కొత్త విషయం కాదని, కానీ ప్రస్తుత పద్ధతులలో జరుగుతున్న హింసనుచూస్తుంటే గతంకంటే చాలా తీవ్రమైన ఆందోళన కలుగుతోందని ట్రంప్ అన్నారు. వైట్‌హౌస్ హిల్టన్ హోటల్‌లో శనివారం రాత్రి ''వైట్‌హౌస్ మీడియా సిబ్బంది''తో తనకున్న బలమైన అనుబంధాన్ని చాటి చెప్పడానికి వారి కోసం మొట్టమొదటిసారి ట్రంప్ ఏర్పాటు చేసిన వార్షిక విందు కార్యక్రమంలో ఈ కాల్పులు జరిగాయి.

# ఇజ్రాయెల్‌లో రాజకీయ పునరేకీకరణ

### నెతన్యాహూకు అక్టోబర్ ఎన్నికలొక పెద్ద సవాల్



**టెల్‌అవీవ్ :** పశ్చిమాసియాలో దీర్ఘకాలిక అశాంతికి తక్షణ కారకుడిగా మారిన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూకు స్వదేశంలో అతిపెద్ద అగ్నిపరీక్ష ఎదురుకాబోతోంది. నిర్ణీత ప్రకారం ఈ ఏడాది అక్టోబరు 27న ఆ దేశ పార్లమెంటు (ఇజ్రాయెల్ లెజిస్లేటివ్ ఎలక్షన్) ''క్నెస్సెట్''కు జరిగే ఎన్నికల్లో నెతన్యాహూను పదవి నుండి తొలగించి ఇంటికి సాగనంపేందుకు రాజకీయ పునరేకీకరణలు జరుగుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ (63) నాయకత్వానగల 'యెష్ అటిడ్' పార్టీతో మాజీ ప్రధానమంత్రి నఫ్తాలీ బెన్నెట్ (54) ఏకమయ్యారు. రాబోయే ఎన్నికల్లో నెతన్యాహూకు గట్టి గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపాలని నిర్ణయించుకున్నారు. ప్రతిపక్ష కూటమి బలపరిచేందుకు యైర్ లాపిడ్ చేసిన కృషికి ఈ సరికొత్త పునరేకీకరణ స్పష్టమైన సంకేతం. మితవాద,మధ్యేవాద,వామపక్ష భావజాల పార్టీలు చాలా స్వల్పకాలం ఒక కూటమిగా కొనసాగి 2021లో నెతన్యాహూను పదవీభ్రష్టుణ్ణి చేశాయి. ఇప్పుడు ఈ కొత్త పునరేకీకరణ ఆనాటి పాత శక్తి పునరుద్ధరణకు సంకేతం. వనరుల సమీకరణలు ఈ పునరేకీకరణలో కనిపిస్తున్నప్పటికీ,వ్యూహాత్మకంగా సీట్లను పటిష్టం చేసుకోవడం, దీనిని ఇజ్రాయెల్ రాజకీయాలలో కొత్త మలుపుగా భావిస్తున్నారు. ఐ.డి.ఎఫ్ మాజీ చీఫ్ గాడి ఐసెన్‌కోట్ (66) గత ఏడాది ఏర్పాటు చేసిన యాషెర్ (లిబరల్–సెంట్రిస్ట్ పార్టీ) ఈ కూటమిలో చేరితే ఇది మహాశక్తిగా బలపడుతుంది. ఇజ్రాయెల్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. ఐసెన్‌కోట్ ఈ కూటమిలో చేరే విషయం కూటమి భవిష్యత్ వ్యూహాలు,ఎత్తుగడలు,కదలికలపైనే ఆధారపడి ఉంటుంది. 2023 నుండి ప్రతిపక్ష నాయకుడుగా ఉంటున్న యైర్ లాపిడ్ ఇజ్రాయెల్ భవిష్యత్ ప్రధానమంత్రిగా ప్రజల్లో పేరు సంపాదించుకున్నారు. ఆయన గతంలో పాత్రికేయుడు. ఆయన తండ్రి కూడా రాజకీయ నాయకుడే. నెతన్యాహూ ప్రధానమంత్రిగా ఉండగా 2014లో యైర్ లాపిడ్ ఆర్థికమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2022లో ఆరునెలలు దేశ ప్రధానమంత్రిగా, బెన్నెట్ మంత్రివర్గంలో కూడా రెండవ ప్రత్యామ్నాయ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భ్రష్టుపట్టి వ్యతిరేకత ఎదుర్కొంటున్న నెతన్యాహూ, రక్షణకోసం ప్రధానమంత్రి పదవిలో దీర్ఘకాలం కొనసాగడంకోసమే యుద్ధ దాడులు ఆపకుండా ముందుకు తీసుకువెళుతున్నారని స్వదేశంలో ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటినుండీ ఈనాటి వరకూ ఇజ్రాయెల్ చరిత్రలో లేనివిధంగా భారీస్థాయిలో నిరసన ప్రదర్శనలు ఎదుర్కొన్న ప్రధానమంత్రిగా ఆయన పేరు సంపాదించుకున్నారు. సరిహద్దు భద్రతావైఫల్యం కారణంగా హమాస్ ఉగ్రవాదులు 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై దాడులు చేసి సామూహిక హత్యాకాండ సాగించడంతో నెతన్యాహూ కొత్త ఆట ప్రారంభించి ఈనాటి వరకూ దానిని కొనసాగిస్తూనే ఉన్నారు. రాజీనామా చేయాలని ప్రజలు లక్షలమంది ఆయనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు తరచు చేస్తూనే వచ్చారు.

# లెబనాన్‌లో ఉల్లంఘనలు : 38కి పెరిగిన మృతులు

### ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు

**బీరూట్ :** లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల ఉల్లంఘన చర్యలు కొనసాగిస్తూ దానవకృత్యాలకు పాల్పడుతోంది. ఈ దశలో సోమవారం ఇజ్రాయెల్ దాడుల్లో మరో ముగ్గురు హెజ్బొల్లా సైనికులు మరణించారు. దీంతో లెబనాన్‌లో ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి. పేలుళ్ళు,డ్రోన్ దాడులు,సరిహద్దు ఘర్షణలు కొనసాగుతున్నాయి. దీంతో లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రారంభమైన తర్వాత దాడుల్లో మరణించినవారి సంఖ్య 38కి చేరుకుంది. కాగా హెజ్బొల్లా సైన్యం ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం కురిపించింది. లెబనాన్‌లో ముందురోజు ఒక ఐడిఎఫ్ సైనికుడు మరణించాడు. భారీ త్యాగాలు చేసినాగానీ ఇరాన్‌కు లొంగిపోయేదిలేదని హెజ్బొల్లా నాయకుడు ప్రకటించారు. కాల్పుల ఉల్లంఘనకు కారణం మీరంటే మీరంటూ రెండు దేశాలూ తీవ్ర వాగ్వాదం, దాడులు కొనసాగిస్తున్నాయి. ఏప్రిల్ 11వ తేదీన పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో లాంఛనంగా లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా లాంఛనంగా చేర్చకపోవడంతో ఈ అంశమే శాంతి సాధనకు ప్రధాన విఘాతంగా మారింది. ఐతే అధికారికంగా మధ్యవర్తిగా వ్యవహరించిన పాకిస్థాన్ మాత్రం అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిగిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ప్రకటించింది. ఆ ఒప్పందంతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ ప్రకటించగా, లెబనాన్‌ను కూడా కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి తీసుకురానందుకు ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఏప్రిల్ 23న ట్రంప్ స్వయంగా మధ్యవర్తిత్వం చేసి హెజ్బొల్లా నుండి బీరూట్‌ను కాపాడతానని వాగ్దానం చేశారు. ఈ యుద్ధంతో తమకు సంబంధం లేకపోయినాగానీ, ఇరాన్ అనుకూల హెజ్బొల్లా సైన్యం లెబనాన్‌ను ఈ యుద్ధంలోకి లాగిందని ఆ దేశ అధ్యక్ష ప్రధానమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. హెజ్బొల్లాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికై ఇజ్రాయెల్ సైన్యం బీరూట్‌లో ప్రవేశించి విధ్వంసం సృష్టించడం ప్రారంభించడంతో పరిస్థితులు చేయిదాటిపోయాయి.

లెబనాన్‌లో మరో మూడువారాలపాటు కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 24వ తేదీన ప్రకటించారు.

అమెరికామధ్యవర్తిత్వంలో గడచిన గురువారం ఇజ్రాయెల్–లెబనాన్ ప్రతినిధులమధ్య వాషింగ్టన్‌లో ముఖాముఖీ సమావేశం తర్వాత ఈ ప్రకటన వెలువడినప్పటినుండీ కాల్పుల విరమణ ఉల్లంఘనలు, మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఒప్పందానికి అస్సలు అర్థమేలేదని హెజ్బొల్లా సైనిక నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దక్షిణ లెబనాన్‌లో అటవీ ప్రాంతాలను ఆక్రమించి 10 కి.మీ లోపలికి ప్రవేశించి ఎల్లోలైన్‌ను విస్తరించి సరికొత్త బఫర్‌జోన్ ఏర్పాటు చేసేందుకు కాల్పుల విరమణ పేరుతో ఇజ్రాయెల్ అరాచకాలు కొనసాగిస్తోంది.

# లేని పార్టీకి పాతికేళ్ళ ఆవిర్భావ దినోత్సవమా?

### ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో కెసిఆర్ పెట్టిన పార్టీ ఇప్పుడు మనుగడలో లేదని, లేని పార్టీకి పాతికేళ్ళ ఆవిర్భావ దినోత్సవం ఎలా చేస్తారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీకి వర్ధంతులే తప్ప జయంతులు లేవని చెప్పారు. సిఎల్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారని, బైట తిరగడం లేదని, ఆయనకు రాష్ట్రంలో, దేశంలో ఏం జరుగుతుందో తెలియదన్నారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ నుంచి ఒక్క ఎంపి కూడా మాట్లాడలేదని కెసిఆర్ అంటున్నారని, పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపిలు నిరసన తెలిపామని, మా గళం వినిపించామన్నా రు. కెసిఆర్ అప్‌డేట్ కావాలని అన్నా రు. తమ పార్టీ ఎంపిలు ఉంటే ఏదో చేసేవారని అంటున్నారనండి, అసలు బిఆర్ఎస్ ఓడిపోయి కావాలని బిజెపి ఎంపిలను రాష్ట్రంలో గెలిపించిందే కెసిఆర్ అని అన్నారు. కెసిఆర్ కూతురు చేసిన వ్యాఖ్యలపై కెసిఆర్ స్పందించ లేదని, అంటే మౌనం అంగీకారమేనా అని ప్రశ్నించారు.

# కవిత ప్రశ్నలకు జవాబివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకీ ప్రజలతో సంబంధాలు తెగిపోయాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంత తాపత్రాయ పడినా, మరోసారి అధికారం కోసం తెచ్చి పెట్టుకున్న వినయంతో నటించినా మళ్ళీ ముసుగుతో వచ్చినా ప్రజలు నమ్మబోరని స్పష్టం చేశారు. పంపకాలలో తేడా వచ్చి ఇంకో కుంపటి వచ్చిందని, పంకా లతో తేడా వచ్చి ఆ కుటుంబం నుంచి మరో అనుబంధ సంఘమో, సంఘమో ప్రజలపై రుద్దితే ఎట్లాగని పరోక్షంగా కవిత పార్టీ గురించి వ్యాఖ్యానించారు. వాళ్ళంతా ఒక్కటేనని, ఒకేతాను ముక్కలేని, ఆ చెరువు నీళ్ళేనని విమర్శించారు. అయినా వారి కుటుంబానికి కా లం చెల్లిందన్నారు. గతం లో ఔరంరజేబు నుంచి ఇటీవల నేపాల్ రాచకుటుంబం వరకు రాజ్యం కోసం కుటుంబ సభ్యులే కొట్టుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాజకీయ వారసత్వం కోసం లేదా ఆస్తిలో వాటాల కోసమో కుటుంబ సభ్యులు కొట్లాడుకున్నారని, చంపుకున్నారని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో కూడా జరుగుతున్నది అదేనన్నారు.

**కెసిఆర్ బాగుండాలనేకోరుకుంటాన్నా..**

కొందరు తన చావు కోరుకుంటున్నారని, వెయ్యి జన్మలెత్తినా నాకు ఏమీ కాదని కెసిఆర్ అన్న మాటలను జర్నలిస్టులు ప్రస్తావించగా, తనకు కెసిఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే తప్ప శత్రువు కాదన్నారు. ఆయన బాగుండాలనే కోరుకుంటానని, ఫామ్‌హౌజ్‌లో జారిపడితే ఆసుపత్రి వరకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశామని, తాను స్వయం గా ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించానని, ఆయన అసెంబ్లీకి వస్తే దగ్గరకు వెళ్ళి పలకరించానని చెఅప్పరు. కెసిఆర్‌కు ఏదైనా చెడు జరగాలని కోరకుంటే ఆయన కుటుంబసభ్యులే కోరుకుంటారని, కాంగ్రెస్ పార్టీ కాదన్నారు. అయినా శాసనసభకు రాకుం టా విశ్రాంతి తీసుకుంటున్న ప్రజాప్రతినిధి కెసిఆర్ అని, ఆయనను తామేమి అంటామని ఎద్దేవా చేశారు. వాస్తవానికి కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కడియం తదితరులంతా వారి పార్టీ కార్యాలయంలోనే కెటిఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. కెటిఆర్ ఆరోగ్యం కోసం.. పాదయాత్ర చేసుకోనివ్వండి అని అన్నారు.

# కాళేశ్వరంపై త్వరలో సిబిఐ డైరెక్టర్‌ను కలుస్తాం..

కాళేశ్వరంపై విచారణ చేపట్టమని కోరేందుకు త్వరలోనే సిబిఐ డైరెక్టర్‌ను కలిసి కోరతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు లేఖరాసిందని, మరోసారి ఆయననకు కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరతామని, తానూ, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెళ్ళి అన్ని వివరాలు అందజేస్తామన్నారు. ఒకవేళ స్పందన లేకపోతే అటు కాంగ్రెస్ పార్టీ తరుపున, ఇటు రాష్ట్ర ప్రభుత్వం తరుపున అవసరమైన కార్యాచరణను చేపడతామన్నారు. కాళేశ్వరంపై వేసిన ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని, అందులో నిందితుడిగా నోటీసు ఇవ్వకపోవడంపైనే ఆక్షేపణ వ్యక్తం చేసిందే తప్ప అసలు కమిషన్ నియామకాన్ని తప్పుబట్టలేదన్నారు. కానీ, హరీశ్‌రావు, బిఆర్ఎస్ నేతలు తాము గెలిచినట్లు సంబరం చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై సిబిఐకి అప్పజెప్తే 48 గంటల్లో తేల్చేస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారని, ఇప్పుడు అందుకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ కిషన్‌రెడ్డి ఆ పని ఎందుకు చేయడం లేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఘోష్ కమిషన్ కేవలం మూడు బ్యారేజీలకే పరిమితమయ్యాయని అంటున్నారని, ముందు మీరు సిబిఐ విచారణ మొదలుపెడితే అన్ని విషయాలు తెలుస్తాయి కదా అని అన్నారు. కాళేశ్వరం వద్ద సమీక్ష సమావేశానికి నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ ఏజెన్సీ చైర్మన్ హాజరవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనను సస్పెండ్ చేస్తామనడంపై సిఎం స్పందించారు. బండి సంజయ్‌కు పరిమితమైన పరిజ్ఞానం ఉన్నట్లు అర్థమవుతుందన్నారు. కేంద్ర మంత్రులు సమీక్షకు రాష్ట్ర అధికారులు హాజరైతే వారిని సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్, సీట్ల పెంపకం, డీలిమిటేషన్, జమిలీ ఎన్నికలు నాలుగు వేర్వేరు అంశాలని సిఎం స్పష్టం చేశారు. యాభై శాతం సీట్లు ప్రోరేటా పద్ధతిలో లోక్‌సభ స్థానాలు పెంచాలని మోదీకి ఏ దేవుడైనా కలలోకి వచ్చి చెప్పారా అని అన్నారు. వారు నిర్మించిన రామాలయం ఉన్న అయోధ్య నుంచే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని ఓడించి సమాజ్‌వాదీపార్టీ అభ్యర్థిని ఎంపిగా గెలిపించారని అన్నారు.

# 'సంక్షేమం'కు తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

సవరణ కార్యక్రమం వెనుక పౌరసత్వం రద్దు కుట్ర ఉందని హెచ్చరించారు. మహిళా బిల్లు పేరిట నియోజకవర్గాలను పునర్ విభజించి, అత్యధిక సీట్లు పొందడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ యత్నిస్తున్నారని హెచ్చరించారు. అమెరికాలో ట్రంప్ మీద కాల్పుల ఘటన హత్యాయత్నం కాదని... అది ఒక నాటకమని పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు కూడా ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నాన్ని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలే మన దేశంలో కూడా ఎన్నికల ముందు జరుగుతుంటాయని... తద్వారా సానుభూతితో అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసుకుంటారని విమర్శించారు. మధ్య ఆసియా దేశాలపై పెత్తనాన్ని నెతన్యాహుకు అప్పగించేందుకు ఇరాన్‌పై ట్రంప్ దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇరాన్‌పై యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిసినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉండిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో నాలుగు రోజులగా పెట్రోల్, డీజిల్ లేక ప్రజలు అల్లాడుతుంటే...చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతరులపై నెట్టివేస్తున్నారని చెప్పారు. ఎఐటియుసి ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు 126 సంవత్సరాల్లో కార్మికులు, రైతులు, రైతు కూలీలు, అసంఘటిత రంగంలోని ఉద్యోగులు తదితరుల హక్కుల సాధనకు ఎన్నో ఉద్యమాలు చేసిందని వివరించారు. హిట్లర్ జాతీయవాదంతో జరిగిన దారుణాలు చరిత్రలో చూశామని చెబుతూ... ప్రస్తుతం మనదేశంలో కూడా ఆర్ఎస్ఎస్, మోదీ ఆర్య సిద్ధాంతాన్ని తలకెత్తుకున్నారని విమర్శించారు. విదేశీ చొరబాటు దారుల పేరిట ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ధోరణి దేశానికి చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రజెండా పార్టీ పతాకం మాత్రమే కాదని చెబుతూ అదొక భావోద్వేగమని చరిత్ర వివరించారు. సంఘటిత పోరాటాలతో కార్పొరేట్ వర్గాల కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలను గద్దె దింపాలని... ఇందుకు కార్మిక వర్గం ఏకతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు.

# 3 దశల చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురాకూడదని ఇరాన్ తన కొత్త ప్రణాళికలో ప్రతిపాదించింది. అమెరికా–ఇరాన్ మధ్య చర్చల్లో అధికారిక మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఏకైకదేశం పాకిస్థాన్ నాయకుల ద్వారా ఈ ప్రతిపాదనలను అమెరికాకు ఇరాన్ చేరవేసింది. బీరూట్ కేంద్రంగా పనిచేసే పాన్–అరబిస్ట్ న్యూస్ టెలివిజన్ ఛానల్ సోమవారం ఈ విషయం ప్రకటించింది. ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఒమన్‌దేశ రాజు సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్‌తో చర్చల అనంతరం ఆదివారం సాయంత్రం హుటాహుటిన పాకిస్థాన్ వెళ్ళి ఈ మూడు అంశాల ప్రణాళికను అమెరికాకు పంపడానికి వారికి అందించి మళ్ళీ తక్షణం రష్యా పర్యటనకు వెళ్ళారని భావిస్తున్నారు. అరాఘ్చి శనివారం నుండి సోమవారం వరకూ పాకిస్థాన్, ఒమన్, రష్యా దేశాల పర్యటన చేస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని ఉమ్మడి సమన్వయంతో నిర్వహించే విషయంపై ఒమన్ రాజుతో చర్చలు జరిపి సమ్మతం తీసుకున్న వెంటనే ఆయన మళ్ళీ పాకిస్థాన్‌కు వెళ్ళి ప్రతిపాదనలు వారికి ఇచ్చారని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పుతిన్‌తో రష్యాలో సంభాషణలు జరిపారు. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు స్తంభించిన తర్వాత చమురు సర్వత్రా ఆందోళనతోపాటు చమురు ధరల పెరుగుదల, చమురు కొరత సంక్షోభం కొనసాగుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య నిర్ణీత ప్రకారం శనివారం చర్చలు జరగలేదు. ఈ కొత్త ప్రతిపాదనలు ఇప్పుడు తెరమీదకు రావడంతో ట్రంప్ ఎలా స్పందిస్తారని ఇరాన్, పాకిస్థాన్ ఎదురుచూస్తున్నాయి. ఇదిలా ఉండగా, అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ సోమవారం ఒక ప్రకటన చేస్తూ, హోర్ముజ్ జలసంధిలో దిగ్బంధన చర్యల్లో భాగంగా ఇప్పటివరకూ 38 నౌకలను జలసంధి దాటనీయకుండా వెనక్కు తరిమి కొట్టామని పేర్కొంది. అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ ఇంతకుముందే ఒక ప్రకటన చేస్తూ, తాము తొందరపడి ఏదో ఒక నష్టపోయే ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా లేమని, మంచి ఒప్పందం కుదిరేవరకూ ఎన్ని రోజులైన హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం కొనసాగుతుందని ప్రపంచంలో ఏ సముద్ర జలాల్లోనైనాగానీ ఇరాన్ చమురు, ఆయుధ సంబంధమైన నౌకలను తాము అడ్డుకుని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. చర్చలు అవసరమైతే వారే మనకు ఫోన్ చేస్తారని, పాకిస్థాన్ వెళ్ళాల్సిన అవసరం లేదని శనివారం ట్రంప్ ప్రకటించారు. ఆయన తన దూతలను పాకిస్థాన్ వెళ్ళకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ నుండి మూడుదశల చర్చలతో కొత్త ప్రణాళిక తెరమీదకు వచ్చింది.

# నో స్టాక్

(మొదటి పేజీ తరువాయి)

ఆటోలు బారులు తీరాయి. పెట్రోల్ కొరత ఉందం టూ హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పెట్రోల్ బంకుల వద్దకు చేరుకుంటున్నారు. ఇక పెట్రోల్ సమస్య తీవ్ర రూపం దాలుస్తుందనే ఆందోళనతో పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. అల్వాల్, మెహిదీపట్నం, షేక్‌పేట్, రాజేంద్రనగర్, ఓల్డ్‌సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి, మలక్‌పేట్, హస్తినాపురం, ఎల్‌బినగర్, ఉప్పల్, రామాంతపూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటైన బంకుల వద్ద పెద్ద సంఖ్యలో వాహనదారులు క్యూకట్టారు. శివారు ప్రాంతాల్లో రైతులు పెద్ద ఎత్తున డీజిల్ కొనుగోళ్ల కోసం సమీప పెట్రోల్ బంకుల వద్దకు చేరుకుంటున్నారు. పలు జిల్లాల్లోనూ పెట్రోల్, డీజిల్ దొరకటం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాల్లోనూ పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పెట్రోల్ లభ్యత ఉండగా, డీజిల్‌కు కొరత ఉంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆదివారం రాత్రి నుంచి అనేక పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో లేకపోవడంతో బంకులు మూసివేశారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా డీజి ల్, పెట్రోల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ పట్టణంలో 12 పెట్రోల్ బంక్‌లు ఉండగా ఉదయం నుంచి అన్ని బంక్‌లలో నో స్టాక్ అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో లారీలు, ట్రాక్టర్లు, రైతులు, వ్యాపారు లు, క్రషర్ మిల్లులు, వరి కోత, మొక్క జొన్న నూర్పిడి యంత్రా లదారులు ఇబ్బందులు పడుతున్నారు. భూపాలపల్లి జిల్లాలో పెట్రోల్ డిజల్ కొరత ఉన్నదనే సమాచారం సోషల్ మీడియాలో దావనంలా వ్యాపించడంతో వాహనదారులు ఒక్కసారిగా క్యాన్లు, డబ్బాలతో వచ్చి విక్రయాలు జరపడంతో ఉన్న పెట్రోల్ స్టాక్ అయిపోవండతో పెంట్రోల్ బంకుల వద్ద వాహన దారులు క్యూకడుతున్నారు. అదే విధంగా చిట్యాల, మొగుళ్లపల్లి టేగుళ్లపల్లి మండలాల్లో వివిధ పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్న సంఘటనలు జిల్లాలో కనబడుతున్నాయి. గ్రేటర్ వరంగల్ నగరంలోని బంకుల్లో పెట్రోల్, డీజిల్ లేక బంద్ పెట్టి నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

పెట్రోల్‌డీజిల్ కొరత ఏర్పడుతుందని పుకార్లు రావడంతో సోమవారం హనుమకొండ జిల్లాలో హనుమకొండ, కాజీపేటతో పాటు జిల్లాలోని మాందారిపేట, పరకాల, గూడెప్పాడు బంకు ల్లో వాహనదారులు క్యూ కట్టారు.పలు బంకుల్లో పెట్రోల్‌డీజిల్ లేదని నిర్వాహకులు నో స్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**పెట్రోల్ కొరత లేదు: స్టీఫెన్ రవీంద్ర**

పెట్రోల్, డీజిల్ కొరతపై తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషన్ స్టీఫెన్ రవీంద్ర ప్రకటించారు. తెలంగాణలో డీజిల్, పెట్రోల్ కొరత లేదని.. పూర్తి నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. పక్క రాష్ట్రంలో సమస్య కారణంగా సరిహద్దు జిల్లాల్లో కొనుగోళ్లు పెరిగాయని వివరించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ.. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇంధన సరఫరాకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు లేదా అనుమానాలు ఉంటే వినియోగదారులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. వాహనదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని స్పీఫెన్ భరోసా ఇచ్చారు.

# ఏం జరుగుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

చేరిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బిఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు.

**బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ మినహా అన్ని కమిటీలు రద్దు...**

బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ మినహా మిగిలిన అన్ని కమిటీలనూ రద్దు చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. త్వరలోనే వీటిని పునర్ నియమించాలని, త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమన్ని (ఆన్‌లైన్,ఆఫ్‌లైన్) నిర్వహించాలని, పార్టీ శ్రేణులకు త్వరలో శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయాలని, లేదంటే గ్రామ గ్రామాన పోరాటం నిర్వహించాలని నిర్ణయించింది. బిఆర్ఎస్ రజతోత్సవ సంబురాల ముగింపు సందర్భంగా కెసిఆర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను ఆపార్టీ వర్కిం గ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మీడియాకు వెల్లడించారు. ఎస్ఐఆర్ 'ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ) పట్ల పార్టీ శ్రేణులు క్రియాశీలంగా ఉండాలన్నారు. మహిళా రిజర్వేషన్ల సాధన కోసం బిఆర్ఎస్ తరపున పోరాడాలని నిర్ణయించామని, సిఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం తప్ప ఆయనకు ఇంకోటి రాదన్నారు. బిఆర్ఎస్ కాలం చెల్లిందని సిఎం అనడం పట్ల కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రాంతీయ స్థాయికి పడిపోయిందన్నారు. కవిత టిఆర్ఎస్ పేరుతో పెట్టిన కొత్త పార్టీ పేరుపై స్పందిస్తూ చాలా పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి వాటిని పట్టించుకోనవసరం లేదన్నారు.

**బిజెపి ఎంపి తేజస్వీ సూర్య ఫోన్ చేశారు...**

తెలంగాణ ఏర్పాటు విషయంలో పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి తేజస్వీ సూర్య తనకు ఫోన్ చేశారని, తాను చెప్పిన దానిని తప్పుగా అర్థం చేసుకున్నారని తనతో చెప్పారని కెటిఆర్ అన్నారు. 'మీరు మాట్లాడింది తప్పు' అని తాను తీవ్రంగా ఆయనకు (తేజస్వీ)చెప్పానని అన్నారు. ఈ సమావేశంలో శాసనసభలో ప్రతిపక్ష నేత మదుసూదనాచారి, మాజీ ఎంపి కె.ఆర్.సురేష్ రెడ్డి, బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకులు తన్నీరు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్,మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.ఎస్. ప్రవీన్‌కుమార్, టి.జీవన్ రెడ్డి, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, పొన్నాల లక్ష్మయ్యతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మాజీ మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ తరహాలో శాసనసభ ప్రాంగణం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఢిల్లీలోని పార్లమెంట్ తరహాలో తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శాసనసభ ప్రాంగణం పనులకు సంబంధించి అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు.
గతంలో నిర్ణయించిన మేరకు పార్లమెంట్ తరహాలో సభ్యులకు సెంట్రల్ హాల్‌ను వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. శాసనసభ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్‌లతో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఉభయ సభల సభ్యుల గౌరవం పెంచేదిగా శాసనసభ ప్రాంగణంలో అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. సమావేశాలు జరుగుతున్న సమయంలో సభ్యులకు ప్రైవసీ ఉండాలని చెప్పారు.
సభ్యుల కోసం ప్రత్యేకంగా మెంబర్స్ క్లబ్ ఒకటి ఏర్పాటు చేయాలని, ప్రస్తుత శాసన సభ, పాత శాసనమండలి భవనాల వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సభ్యుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, క్రీడల కోసం అవసరమైన ఏర్పాట్లు ఉండాలని సిఎం సూచించారు. శాసనసభ ప్రాంగణంలో భద్రతను కూడా మరింత పటిష్టం చేయాలని పలు సూచనలు చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైనపరిహారాన్నిపొందే హక్కు చట్టం- 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్ 19 సబ్ రూల్ (1) ను అనుసరించి.

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నెంబర్. G3/1523/2016 తేది: 24/04/2026
రెవెన్యూ డివిజనల్ అధికారిఫైల్ నెంబర్. H/17/2026 తేది: 07/04/2026
గెజిట్ నెంబరు: 37/2026 తేది: 24/04/2026

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరచిన సిద్దిపేట జిల్లాలోని నారాయణరావుపేట మండలములోని గుర్రాలగొంది గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.6-07 గుంటలు, జక్కాపూర్ గ్రామములోఉన్న భూమి విస్తీర్ణం ఎ.0-15 గుంటలు మరియు చిన్నకోడూర్ మండలములోని గంగాపూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.2.09 గుంటలు మరియు పెద్దకోడూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.0.12 గుంటలు మొత్తం విస్తీర్ణం ఎ.9.03 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా మనోహరాబాద్ నుండి కొత్తపల్లి వరకు రైల్వే లైన్ నిర్మాణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పన పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 86 Transport, Roads and Buildings (Tr., S & V) Department, Dt: 24.11.2017 ద్వారా సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.
కావున సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలములోని గుర్రాలగొంది గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.6-07 గుంటలు, జక్కాపూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.0-15 గుంటలు మరియు చిన్నకోడూర్ మండలములోని గంగాపూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.2.09 గుంటలు మరియు పెద్దకోడూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.0.12 గుంటలు మొత్తం విస్తీర్ణం ఎ.9.03 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం భూమియొక్క వివరములు, ఈ క్రింద చూపిన భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

షెడ్యూల్-I
గ్రామము: గుర్రాలగొంది మండలము: నారాయణరావుపేట జిల్లా: సిద్దిపేట

| క్రమ సంఖ్య | సర్వే నం. | భూమి స్వభావం | భూమి రకం | సేకరించవలసిన విస్తీర్ణం | భూమి పట్టాదారు/ అనుభవదారు / ఆసక్తిదారు పేరు మరియు చిరునామా/ తండ్రి/ భర్త పేరు | సరిహద్దులు తూర్పు(E) | పడమర(W) | ఉత్తరం(N) | దక్షిణం(S) | నిర్మాణాలు / చెట్లు / బావి/ బోర్ వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.27 1/4 | శిర్లపల్లి రాములు తండ్రి మల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | మట్టి తొవ్వ | చుక్క పోచయ్య తండ్రి ఎల్లయ్య | నమిలి నార - 01 |
| 2 | 126/ 15/3 /2 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.20 | చుక్క రాములు తండ్రి ఎల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | శిర్లపల్లి రాములు తండ్రి మల్లయ్య | బుస్సవేణి నర్సవ్వ భర్త పర్శరాములు | |
| 3 | 126/ 15/3 /1 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.20 | చుక్క పోచయ్య తండ్రి ఎల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | శిర్లపల్లి రాములు తండ్రి మల్లయ్య | బుస్సవేణి నర్సవ్వ భర్త పర్శరాములు | రాళ్ల చెట్టు |
| 4 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.18 | చుక్క పోచయ్య తండ్రి ఎల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | చర్లపల్లి రాములు తండ్రి మల్లయ్య | బుస్సవేణి నర్సవ్వ భర్త పర్శరాములు | |
| 5 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 1.00 | బుస్సవేణి లక్ష్మి భర్త ఎల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | చుక్క పోచయ్య తండ్రి ఎల్లయ్య | పిట్ట ఎల్లవ్వ భర్త మల్లయ్య | [illegible] |
| 6 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.11 | బుస్సవేణి లక్ష్మి భర్త ఎల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | చుక్క పోచయ్య తండ్రి ఎల్లయ్య | పిట్ట ఎల్లవ్వ భర్త మల్లయ్య | |
| 7 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 2.00 | బుస్సవేణి నర్సవ్వ భర్త కనకయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | చర్లపల్లి రాములు తండ్రి మల్లయ్య | ప్రభుత్వ భూమి | బోర్‌వెల్-01, నర్రెంగ-2, వేప-2 |
| 8 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.28 3/4 | పిట్ట ఎల్లవ్వ భర్త మల్లయ్య | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | బుస్సవేణి నర్సవ్వ భర్త పర్శరాములు | ప్రభుత్వ భూమి | వేప-3, నమిలి నార - 3 |
| 9 | 126 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.02 | పెండ్యాల కనకయ్య తండ్రి నారాయణ | మట్టి తొవ్వ | ప్రభుత్వ భూమి | బుస్సవేణి నర్సవ్వ భర్త పర్శరాములు | చర్లపల్లి రాములు తండ్రి మల్లయ్య | |
| | మొత్తం | | | 6-07 | | | | | | |

షెడ్యూల్-II
గ్రామము: జక్కాపూర్ మండలము: నారాయణరావుపేట జిల్లా: సిద్దిపేట

| క్రమ సంఖ్య | సర్వే నం. | భూమి స్వభావం | భూమి రకం | సేకరించవలసిన విస్తీర్ణం | భూమి పట్టాదారు/ అనుభవదారు / ఆసక్తిదారు పేరు మరియు చిరునామా/ తండ్రి/ భర్త పేరు | సరిహద్దులు తూర్పు(E) | పడమర(W) | ఉత్తరం(N) | దక్షిణం(S) | నిర్మాణాలు / చెట్లు / బావి/ బోర్ వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 305 /7 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.07 1/2 | చుక్క బాలయ్య తండ్రి రంగయ్య | ప్రభుత్వ భూమి | ప్రభుత్వ భూమి | చుక్క బాలయ్య తండ్రి రంగయ్య | మట్టి తొవ్వ | |
| 2 | 305/ 8 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.07 1/2 | చుక్క ఎల్లయ్య తండ్రి రంగయ్య చుక్క సతవ్వ భర్త ఎల్లయ్య | ప్రభుత్వ భూమి | ప్రభుత్వ భూమి | చుక్క బాలయ్య తండ్రి రంగయ్య | మట్టి తొవ్వ | |
| | మొత్తం | | | 0.15 | | | | | | |

షెడ్యూల్-III
గ్రామము: గంగాపూర్ మండలము: చిన్నకోడూరు జిల్లా: సిద్దిపేట

| క్రమ సంఖ్య | సర్వే నం. | భూమి స్వభావం | భూమి రకం | సేకరించవలసిన విస్తీర్ణం | భూమి పట్టాదారు/ అనుభవదారు / ఆసక్తిదారు పేరు మరియు చిరునామా/ తండ్రి/ భర్త పేరు | సరిహద్దులు తూర్పు(E) | పడమర(W) | ఉత్తరం(N) | దక్షిణం(S) | నిర్మాణాలు / చెట్లు / బావి/ బోర్ వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 114 | ప్రభుత్వ భూమి | మెట్ట | 1.10 | బుస్స నర్సయ్య తండ్రి పెద్ద | తాటి వెంకటయ్య | చెరువు కుంట | రైల్వేలైన్ | తాటి వెంకటయ్య | |
| 2 | 114 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.39 | బాలయ్య నీలి బాలవ్వ భర్త ఐలయ్య | పిరేల్లీ కనకయ్య | ఎండి శాదుల్ | శేరా పురం వెంకట్ రెడ్డి | ఎండి శాదుల్ | బోరు-2, పైప్‌లైన్-2, పశువు లకొట్టం-1, రాళ్లగోడ-1, మామిడి చెట్లు-3 |
| | మొత్తం | | | 2.09 | | | | | | |

షెడ్యూల్-IV
గ్రామము: పెద్దకోడూర్ మండలము: చిన్నకోడూరు జిల్లా: సిద్దిపేట

| క్రమ సంఖ్య | సర్వే నం. | భూమి స్వభావం | భూమి రకం | సేకరించవలసిన విస్తీర్ణం | భూమి పట్టాదారు/ అనుభవదారు / ఆసక్తిదారు పేరు మరియు చిరునామా/ తండ్రి/ భర్త పేరు | సరిహద్దులు తూర్పు(E) | పడమర(W) | ఉత్తరం(N) | దక్షిణం(S) | నిర్మాణాలు / చెట్లు / బావి/ బోర్ వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 37 | పట్టా | మెట్ట | 0.12 | పల్లె నల్లపోచవ్వ భర్త నర్సయ్య పల్లెచంద్రం తండ్రి పోచయ్య పల్లె అరుణవ్వ భర్త కనుకయ్య పల్లె కనుకవ్వ భర్త కనుకయ్య పల్లె శ్రీనివాస్ తండ్రి చంద్రయ్య | బిటి రోడ్ | బిటి రోడ్ | పల్లె పోచవ్వ | రైల్వే లైన్ | |
| | మొత్తం | | | 0.12 | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు చట్టప్రకారం దూనష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సిద్దిపేట మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు దూసేకరణ అధికారి, సిద్దిపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయాల పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు భూసేకరణ అధికారి, సిద్దిపేట గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా ప్రాదమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/ అమ్మకాలు/ తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.
ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15 (1) ప్రకారం అభ్యంతరములు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- తహశీల్దారు నారాయణరావుపేట మండలము
సం/- తహశీల్దారు చిన్నకోడూరు మండలము
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి సిద్దిపేట డివిజన్
సం/- అదనపు కలెక్టర్ సిద్దిపేట జిల్లా
DIPR RO NO. 129/LA/PP/Advt/Pub/2026-27


# ఎఎన్‌ఎంలు ఇంకెంత కాలం వేచి చూడాలి?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాల కోసం సెకండ్ ఎఎన్‌ఎంలు ఇంకేంత కాలం వేచి చూడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం సెకండ్ ఎఎన్ఎంలు కోఠిలోని డిఎంఇ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అభ్యర్థులు 2023లో పరీక్ష రాస్తే 2026వ సంవత్సరం వరకు కూడా ఫలితాలు వెల్లడించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో గత ప్రభుత్వ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వీరంతా రెగ్యులర్ కొరకు ఎన్నో వ్యయప్రయాసలు పడి పోటీ పరీక్షలు రాయగా, గడిచిన మూడేళ్లుగా ఫలితాలు వెల్లడించకపోవడంతో వారు ఎంతో విలువైన కాలంతో పాటు ఆర్థికంగా కూడా నష్టపోయారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఫలితాలను విడుదల చేసి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎఎన్‌ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీ, రూ.10లక్షల చొప్పున హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ అందించాలన్నారు.
ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ దాదాపు 22సార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, ఫలితాల ప్రకటన వెలువడేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సెకండ్ ఎఎన్ఎంల చిరకాల కోరిక రెగ్యులర్ ఉద్యోగమని, ఇందు కోసం అనేక ఏళ్లుగా పోరాడుతున్నా నెరవేరడంలేదన్నారు. 2023లో సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చటానికి కమిటీని ఏర్పాటు చేశారని, ఆ కమిటీ రిపోర్టును కూడా అమలుచేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఇదేవిధంగా మొండిగా వ్యవహరిస్తే ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, కౌన్సిల్ సభ్యులు రాజమౌళి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బోయిని శ్యామల, కార్యదర్శులు పి.జయమ్మ, హారతి, అశ్విని, రాణి, లత సంతోషిని, ఉపాధ్యక్షులు టి జయమ్మ, ఝాన్సీ రాణి, యాదలక్ష్మి, దేవి, రాణి , కవిత తదితరులు పాల్గొన్నారు.

**10 రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తాం : బోర్డు చైర్మన్ హామీ**

ఎంపిహెచ్ఎ (ఫిమేల్) ప్రొవిజనల్ లిస్ట్‌ను 10 రోజుల్లో వెల్లడిస్తామని ఎంహెచ్ఎస్ఆర్‌బి బోర్డు చైర్మన్ గోపికాంత్ రెడ్డి ఎఐటియుసి నాయకులకు లిఖితపూర్వక హామీ ఇచ్చారు. ధర్నా అనంతరం ఎఐటియుసి ప్రతినిధుల బృందం చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఇందుకు గోపికాంత్ స్పందిస్తూ అధికారిక మెయిల్ నుంచి ఎఐటియుసికి మెయిల్ చేశారు. దీంతో సెకండ్ ఎఎన్ఎంలు, ఎఐటియుసి నాయకులు బోర్డు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం



ప్రజాపక్షం/హైదరాబాద్ : గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలోని శాసనమండలి చైర్మన్ చాంబర్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, శాసన సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ఎంఎల్‌ఎలు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌లను గవర్నర్ కోటాలో ఎంఎల్‌సిలుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

**మైనార్టీల సంక్షేమానికి కృషి : అజారుద్దీన్**

తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని, రాజకీయాలు, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ చెప్పారు. ఇప్పుడు తాను కెప్టెన్‌ను కాదని, తమ కెప్టెన్ రేవంత్ రెడ్డి అని ఆయన స్పష్టం చేశారు. తమకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి, సిఎం రేవంత్ రెడ్డికి, ఎంఎల్‌సిగా ప్రతిపాదించిన మంత్రిమండలి, టిపిసిసి, ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే తనకు మంత్రి పదవి ఇచ్చారని ప్రతిపక్షాల ప్రచారం చేశాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మొదటి నుంచి మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

**ఎమ్మెల్సీ పదవి ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగం : కోదండరామ్**

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఎంఎల్‌సి' పదవి ఉపయోపడుతుందని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. మంత్రి పదవిపై తనకు ఆశ, ఆలోచన కూడా లేదన్నారు. మే 12న జరగనున్న టిజెఎస్ ప్లీనరీ సమావేశంలో నిరుద్యోగం, ఆదివాసి, కార్మికులు, ఫీజు రియంబర్స్‌మెంట్ తదితర సమస్యలపై చర్చించి, తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. యూనివర్శిటీల పునరుద్ధరణ, బిసి రిజర్వేషన్ల సాధన వంటి అనేక అంశాలపై పనిచేస్తూనే ఉన్నామన్నారు. ఇదివరకు ప్రజా సమస్యలపై పోరాడినట్టుగానే భవిష్యత్తులో కూడా పోరాడుతామని ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. రాజకీయాల్లో సరళమైన జీవనశైలి చాలా అవసరమని, తమకు ఏ అవకాశం దొరికినప్పటికీ ప్రజల కోసమే ఉపయోగిస్తామన్నారు.

# అడ్డదారుల్లో ఓట్లు తొలగించేందుకు బిజెపి కుట్ర



టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అడ్డదారుల్లో ఓట్లు తొలగించేందుకు బిజెపి కుట్ర చేస్తున్నదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి చేస్తున్న కుటిల ప్రయత్నంలో భాగంగా సెక్యులర్ ఓట్లు తొలగించేందుకు పన్నాగం పన్నుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు (డిసిసి), నియోజక వర్గ కోఆర్డినేటర్ల సమావేశం సోమవారం గాంధీభవన్‌లో జరిగింది. సమావేశాన్ని మహేష్‌కుమార్ గౌడ్ ప్రారంభించగా ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్, పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్‌ఎ) నియామకం, మండల, జిల్లా కమిటీల ఏర్పాటుపై వారు సమీక్షించారు. సమావేశాన్ని ఉద్దేశించి మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే లక్ష్యంగా అందరూ నిరంతరం పనిచేయాలన్నారు. తెలంగాణలో అత్యధిక పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు గెలవాలని, 2023 అసెంబ్లీ ఎన్నికల సీన్ రిపీట్ కావాలన్నారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన కొనసాగుతున్నదని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ఆషామాషీ విషయం కాదన్నారు. త్వరలోనే ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ల పదవులు భర్తీ చేయనున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ పునరుద్ఘాటించారు. బిఎల్ఎల విషయంలో ఎక్కడ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బిఎల్ఎలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉండాలని, వెంటనే బిఎల్ఎ నియామకం మొదలు కావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరంతరం పార్టీ కోసం పనిచేయాలని, 80 శాతం సమయాన్ని పార్టీకి కేటాయించేలా చూసుకోవాలని,పార్టీ నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

# శాస్త్రీయంగా డీలిమిటేషన్

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి డిమాండ్


వరిధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకం పేరుతో దోపిడీని ఆపాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మేడే కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి





ప్రజాపక్షం/నల్లగొండ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ కుట్రలు, కుతంత్రాలతోనే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి విమర్శించారు. సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ డీలిమిటేషన్‌కు 2031 సంవత్సరం వరకు గడువు ఉన్నప్పటికీ, 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావుడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలతో డీలిమిటేషన్ బిల్లును తీసుకువచ్చిందని మండిపడ్డారు. అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా, శాస్త్రీయ పద్ధతిలో డీలిమిటేషన్ జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు వడ్లను పూర్తిగా ఎండబెట్టి, తేమ లేకుండా తీసుకువచ్చినప్పటికీ తాలు పేరుతో క్వింటాలుకు 5 నుంచి 6 కిలోల వరకు కోత విధించడం అన్యాయమని మండిపడ్డారు. అదనపు తూకం, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడులతో ఇబ్బందులు పడుతూ పెద్దఎత్తున వరి ధాన్యాన్ని పండించి రైతులు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నప్పటికీ, కొనుగోలు ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతుల శ్రమను దోపిడీ చేసే ఈ చర్యలను ప్రభుత్వం తక్షణమే అరికట్టి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా మే1వ తేదీన అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్మిక అడ్డాల్లో ఎర్ర జెండాలు ఎగురవేసి ర్యాలీలు, సభలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
ఈ సమావేశానికి గురిజ రామచంద్రం అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆది రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీర స్వామి,ఉజ్జిని యాదగిరి రావు, ఆర్.అంజయ్యచారి,బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, తుమ్మ బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

# గుండెపోటుతో డిప్యూటీ సిఎం సిపిఆర్‌ఒ మధుసూదన్ మృతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (సిపిఆర్‌ఒ)గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ జర్నలిస్టు మారబోయిన మధుసూదన్ (50) గుండెపోటుతో మరణించారు. సోమవారం మధ్యాహ్నం ఛాతి నొప్పి రాగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆ సమయంలోనే కార్డియాక్ అరెస్టు కావడంతో సమీపంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స నిర్వహిస్తున్న సమయంలో మరో మారు కార్డియాక్ అరెస్ట్ కావడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థలలో సీనియర్ జర్నలిస్టుగా మధుసూదన్ కీలక బాధ్యతలు నిర్వహించారు. విధి నిర్వహణలో నికార్సైన పాత్రికేయుడిగా పనిచేశారు. మారబోయిన మధుసూదన్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత నిజాయితీ గల పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మధుసూదన్ ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.ఉత్తంకుమార్ రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మధుసూదన్ భౌతికకాయాన్ని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

# రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అకక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. సోమ, మంగళవారం కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల వరకు క్రమంగా పెరుగుతాయని అంచనా ఉందన్నారు. ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశామన్నారు. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 30–40 కి.మీ వేగంతో) వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మంగళ, బుధవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందన్నారు. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గురువారం నుంచి మే 1 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని, పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు ఉండే అవకాశముందన్నారు. మే 1 నుంచి 4 వరకు కూడా రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు అకక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక ఉష్ణోగ్రతల విషయానికి వస్తే, ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ ఉత్తర జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో 36 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపారు.


పురపాలక సంఘ కార్యాలయము : ఆలేరు,
జిల్లా : యదాద్రి భువనగిరి
బహిరంగ వేలము ప్రకటన
ఫైల్ నెం. సి1/45/2026 తేది : 27.04.2026
ఇందుమూలముగా పట్టణ ప్రజలకు మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా, పురపాలక సంఘ పరిధిలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న 5 మడిగెలకు నెలసరి అద్దె ప్రాతిపదికపైన కేటాయించుటకు బహిరంగ వేలము నిర్వహించటకు తేది: 28.04.2026 నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. దరఖాస్తులకు చివరి తేది: 02.05.2026 మరియు బహిరంగ వేలము పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో తేది: 04-05-2026 రోజున మ 3.00 గం.లకు నిర్ణయించనైనది.

| క్ర.సం. | వేలము నిర్ణయించే షాపుల వివరములు | షాపు నెంబర్లు | పురపాలక సంఘం నిర్ణయించిన నెలసరి అద్దె | ధరావత్తు సొమ్ము (డి.డి రూపంలో) |
|---|---|---|---|---|
| 1 | పురపాలక సంఘం మడిగెలు | 1 | రూ. 12,000/- | రూ. 50000/- |
| 2 | | 2 | రూ. 12,000/- | రూ. 50000/- |
| 3 | | 3 | రూ. 12,000/- | రూ. 50000/- |
| 4 | | 4 - పై అంతస్తు ఉత్తర భాగం | రూ. 16,000/- | రూ. 50000/- |
| 5 | | 5 -పై అంతస్తు దక్షిణ భాగం | రూ. 16,000/- | రూ. 50000/- |

గమనిక: వేలం, నియమ నిబంధనల కొరకు పురపాలక సంఘ కార్యాలయము నందు కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.
సం/- కమిషనర్
పురపాలక సంఘం, ఆలేరు
DIPR R.O. No. : 1540-PP/CL/ADVT/2026-27, Date: 27-04-2026



## పేస్‌రీడింగ్‌తో ఉపాధి కూలీల ఇబ్బంది

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న పేస్ రీడింగ్ పెట్టడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన యాద్గార్‌పల్లిలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఉపాధి కూలీలకుఉపాధి హామీ పని చేస్తున్నకూలీలకు ఐదు కిలోమీటర్లు దాటితే వారికి ట్రావెలింగ్ ఖర్చు కూడా ఏర్పాటు చేయాల్సినప్పటి చేయకపోవడంతో కిలోమీటర్లు నడిచి వెళ్లి పనిచేస్తుంటే వారికి కేవలం రూ.180 నుంచి రూ.200 వరకే వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.307 ఇవ్వకుండా కొలతల పేరుతో వాటిని కట్ చేస్తున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం కేఎంఎంఎస్ యాప్‌ను తొలగించి గతంలో ఏ విధంగా అయితే హాజరు పట్టిక వేసేవో ఆ పద్ధతులను అనుసరించి కూలీలను ఆదుకోవాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. కూలీలకు మంచినీటి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, రైతులు బంటు నరసింహ, గ్రామ కార్యదర్శి విజయ్‌కుమార్, అప్పనబోయిన రామకృష్ణ, వెంకమ్మ, గువ్వల గురవయ్య, ఖాజా, బిక్షన్, రజియా, పగిళ్ల పద్మ, దుండిగాల సరిత, పద్మ, జయమ్మ, సాలమ్మ, ఈశ్వరమ్మ, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలి





ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని సూర్యాపేట సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంధన కొరత లేదని పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలియజేసినప్పటికి జిల్లాలో, పట్టణంలో డీజిల్, పెట్రోల్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల నుండి డీజిల్ లేకపోవడంతో వ్యవసాయ యంత్రాలు, వడ్లను తరలించేందుకు వాహనాలు లేకపోవడంతో అన్నదాతల పాలిట శాపంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృత్రిమ గ్యాస్ కొరతను నివారించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు పెండ్ర కృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బుక్కుడు శౌరి, అధ్యక్షులు బూర సైదులు, నాయకులు రెడ్డిమల్ల శ్రీను, జెనిగల సతీష్ పాల్గొన్నారు.

## మైక్రో ఫైనాన్స్ మాయలో ప్రాణనష్టం

వడ్డీ ఆశలు... కుటుంబాన్ని చీకటిలోకి నెట్టిన విషాదం

ఇచ్చిన నగదు కోసం ఎదురుచూసి...గుండెపోటుతో మృతి



ప్రజాపక్షం/నందికొండ: అధిక వడ్డీ ఆశ చూపి మోసం చేయడంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నాగార్జునసాగర్ పరిధిలోని పాల్తీ తండ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాల్తీ రమేష్ (38)ఆర్థిక మోసానికి గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న బాలాజీ అనే వ్యక్తి మాటలు నమ్మి రమేష్ నెలకు రూ.10 వడ్డీకి ఆశపడి సుమారు రూ.60 లక్షలను అతడికి అప్పగించాడు. మొదట్లో కొంతకాలం వడ్డీ చెల్లించిన బాలాజీ, ఆ తర్వాత చెల్లింపులు పూర్తిగా నిలిపివేశాడు.తన డబ్బును తిరిగి ఇవ్వాలని రమేష్ పలుమార్లు సంప్రదించినా బాలాజీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి,ఆందోళనకు గురైన రమేష్ సోమవారం అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనతో ఆగ్రహించిన బంధువులు,గ్రామస్తులు మృతదేహంతో విజయపురి నార్త్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.రమేష్‌లాగే తమ గ్రామంలో అనేకమంది బాలాజీకి కోట్ల రూపాయలు ఇచ్చారని, అతడు ఈ మైక్రో ఫైనాన్స్ పేరుతో దాదాపు రూ.1100 కోట్ల వరకు వసూలు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతికి కారణమైన బాలాజీపై కఠిన చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు,గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పిల్లలకు అవసరమైన అన్ని వసతులు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పిల్లలకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలసదనం, అనాధాశ్రమాలలో నివసిస్తున్న అనాథ, సంరక్షణ అవసరమున్న పిల్లలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో స్వయంగా మాట్లాడి, వారి అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. పిల్లల భవిష్యత్ విద్య, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి ఈ ధృవీకరణ పత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనాథ, సంరక్షణ అవసరమున్న పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, డిసిపిఓ రవికుమార్, బాల సంక్షేమ సమితి చైర్మన్ బి. రమణరావు, సభ్యులు బిక్షం, ధనమ్మ, డిసిపియు పిఓలు విద్యాసాగర్, మీరా, చిల్డ్రన్ హోమ్స్ సిబ్బంది కవిత, సఫియా, ధనపాల్ పాల్గొన్నారు.




# నల్లగొండ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత

జాతీయ రహదారిపై వాహనదారుల అవస్థలు

యాజమాన్యాలు 'నో స్టాక్' బోర్డులు ఏర్పాటు



ప్రజాపక్షం/నల్లగొండ : నల్లగొండలో జిల్లాలో పెట్రోల్,డీజిల్ కొరత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65పై జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు భారీగా బారులు తీరడంతో ప్రయాణికులు గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం పూర్తిగా అయిపోవడంతో యాజమాన్యాలు నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశాయి. దీంతో అత్యవసర ప్రయాణాల్లో ఉన్న వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా లారీలు,కార్లు,ద్విచక్ర వాహనదారులు ఇంధనం కోసం ఒక బంక్ నుంచి మరో బంక్‌కు తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి కావడంతో సమస్య తీవ్రత మరింతగా కనిపిస్తోంది. ఇంధనం అందుబాటులో ఉన్న కొద్ది బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు క్యూ కట్టడంతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోంది. గంటల తరబడి వేచి చూసినప్పటికీ ఇంధనం లభించక కొందరు నిరాశతో వెనుదిరుగుతున్నారు.ఇంధన సరఫరాలో అంతరాయం ఎందుకు ఏర్పడిందనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి పెట్రోల్,డీజిల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారిపై ఇలాంటి పరిస్థితులు కొనసాగితే రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాలో పెట్రోల్,డీజిల్‌కు కొరత లేదు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



జిల్లాలో పెట్రోల్,డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు.ప్రజలు భయాందోళనలతో అధిక మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయవద్దని సూచించారు. సోమవారం తన ఛాంబర్‌లో పౌరసరఫరాల అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, బంకుల అసోసియేషన్ నాయకులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నప్పటికీ జిల్లాలో అవసరమైన నిల్వలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.భయంతో ఎక్కువగా కొనుగోలు చేస్తేనే కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ బంకుల వద్ద "నో స్టాక్ బోర్డులు" పెట్టవద్దని ఆదేశించారు. క్యాన్లలో పెట్రోల్, డీజిల్ విక్రయించవద్దని స్పష్టం చేశారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వరి కోతలు,ధాన్యం రవాణా లారీలు,ట్రాక్టర్లు, రేషన్ బియ్యం పంపిణీ వాహనాలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. హార్వెస్టర్లకు డీజిల్ అవసరమైతే వ్యవసాయ అధికారి ద్వారా వివరాలు ధ్రువీకరించుకుని ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పనుల కోసం కనీస స్టాక్ ఉంచాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్డీవో లావణ్య,డీఎస్ఓ వెంకటేష్,పౌరసరఫరాల డీఎం రామ్‌పతి నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ రెడ్డి,ఆయిల్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.




## ఎక్స్‌ప్రెస్ కంటే ఆర్డినరీ చార్జీలే ఎక్కువ

ప్రజాపక్షం/అడ్డగూడూరు : ఆర్‌టిసి బస్సులో చార్జీలు ఎక్స్ ప్రెస్ కంటే ఆర్డినరీ బస్సు చార్జీలు ఎక్కువగా ఉన్నాయని ప్రయాణికులు తెలిపారు. ఏ డిపో అయినా ఒకటే చార్జీలు వసూలు చేయాలి కాని మహబూబాబాద్ డిపో బస్సు ఒకరేటు, యాదగిరిగుట్ట డిపో బస్సు ఒకరేటు తీసుకుంటున్నారు. మహబూబాబాద్ డిపో ఎక్స్ ప్రెస్ బస్సు పాటిమట్ల ఎక్స్ రోడ్ నుండి భువనగిరి వరకు రూ.80 తీసుకుంటే, తిరుగు ప్రయానంలో యాదగిరిగుట్ట డిపో బస్సు ఆర్డినరి పల్లెవెలుగు బస్సులో చార్జీ రూ.90 తీసుకున్నారు. ఇదేంటయ్యా అని అడుగుతే చార్జీలు ఆన్‌లైన్ ఫీడింగ్ చేశారు. మాచేతుల్లో లేదని కండక్టర్ తెలిపారు. ఆర్‌టిసి సంస్థ డిపోకో రేటు ఎట్లా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరి బస్సులు తేడాలు ఉండవా బోర్డు ఒక్కటే మారిస్తే సరిపోతుందా ఈ దోపిడీని పరిశీలించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# సంక్షేమ వారోత్సవంపై ప్రజలకు అవగాహన



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జనగణనలో భాగంగా ప్రతి ఒక్కరు స్వీయ జన గణనను వెంటనే పూర్తి చేయాలని,ఈ విషయం పై అందరికి అవగాహన జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కల్పించాలన్నారు.ప్రజా పాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 27 నుండి మే 2 వరకు నిర్వహించనున్న బాలల భద్రత రక్షణ,మత్తు పదార్థాలకు నో చెప్పండి సంక్షేమ వారోత్సవం పై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో సమీక్షిస్తూ ప్రజాపాలప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ వారం పైన పేర్కొన్న అంశంపై వారోత్సవాలను నిర్వహించాలని ఆదేశించడం జరిగిందని,మండలాల ప్రత్యేక అధికారులు,మున్సిపల్ కమిషనర్లు మండల స్థాయిలో ఈకార్యక్రమాలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని, అందువల్ల ఆయా శాఖల వారీగా ఖాళీలను ఈ నెల 30లోగా జిల్లా క్రీడలు,యువజన సర్వీసుల శాఖ అధికారికి పంపించాలని ఆదేశించారు. అలాగే జిల్లా అధికారులందరూ క్షేత్రస్థాయి పర్యటనకు సంబంధించిన టూర్ డైరీ లను శనివారంలోగా సమర్పించాలని ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఆర్‌డిఓలు రమణారెడ్డి,శ్రీదేవి, జిల్లాకు నూతనంగా కేటాయించిన ట్రైనీ ఐఏఎస్ అసిస్టెంట్ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సాగర్ ప్రాజెక్టు భద్రతా వైఫల్యం

60 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల బదిలీ


డ్యామ్‌పై చేపల వేట.. విశాఖకు జవాన్ల తరలింపు



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ డ్యామ్‌పై భద్రతా విధుల్లో ఉండగానే చేపల వేటకు పాల్పడిన ఘటనపై అధికార యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది.నిబంధనలు ఉల్లంఘించిన సుమారు 60 మంది సీఆర్‌పిఎఫ్ జవాన్లను తక్షణమే విశాఖపట్నంకు బదిలీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. భద్రతాపరంగా అత్యంత సున్నితమైన సాగర్ ప్రాజెక్టు రక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న సీఆర్‌పిఎఫ్ సిబ్బంది డ్యామ్ రక్షణ గోడలపై నుంచి గాలాలు వేసి చేపలు పడుతున్న దృశ్యాలు ఇటీవల బయటకు రావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ప్రాజెక్టు పరిధిలో ఐదు కిలోమీటర్ల మేర చేపల వేట నిషేధితమైనప్పటికీ,భద్రతా బాధ్యతలు నిర్వహించే సిబ్బందే నిబంధనలు ఉల్లంఘించడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు.ఇప్పటికే ప్రాజెక్టు భద్రతపై ఇంటెలిజెన్స్ హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ఈ ఘటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.భద్రతా వైఫల్యంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుండటంతో,బాధ్యులైన జవాన్లను బదిలీ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

మానవత్వం చాటిన పోలీసులు



ప్రజాపక్షం/నల్లగొండ :నార్కట్‌పల్లి అద్దంకి జాతీయ రహదారి నల్లగొండలోని పానగల్ ఫ్లైఓవర్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీకొనడంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. నుజ్జునుజ్జయిన కారులో మృతదేహం ఇరుక్కుపోగా,ఎవరూ ముందుకు రాని వేళ టూ టౌన్ సీఐ రాఘవులు,ఎస్ఐ సైదులు స్వయంగా రంగంలోకి దిగి మానవత్వం చాటుకున్నారు.టూ టౌన్ ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గంగసాని సాయి సందీప్ స్వగ్రామం నుంచి కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు.ఉదయం 6:10 గంటల సమయంలో పానగల్ బైపాస్ ఫ్లైఓవర్‌పై నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై సందీప్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.స్థానికుల సమాచారంతో టూ టౌన్ సీఐ రాఘవులు,ఎస్ఐ సైదులు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు అధికారులే స్వయంగా అతికష్టంమీద మృతదేహాన్ని బయటకు తీసి,ప్రైవేట్ అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అదే సమయంలో మృతుడు సాయి సందీప్ సెల్‌ఫోన్‌కు కాల్ రావడంతో సీఐ రాఘవులు ఫోన్ లిఫ్ట్ చేసి బంధువులకు ప్రమాద విషయం తెలియజేశారు. విషాద వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన నల్లగొండకు బయలుదేరారు.

## కార్పోరేట్‌ల కోసం కార్మికుల హక్కులపై దాడి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ సంస్థల లాభాల కోసం కార్మికుల హక్కులపై దాడి చేసి వారి హక్కులను కాలరాస్తుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో మామిడి వెంకయ్య అధ్యక్షతన జరిగిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలను అందరూ ఐక్యంగా ఖండించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను మేడే స్ఫూర్తితో వ్యతిరేకించాలన్నారు. సిపిఐ పార్టీ కనీస వేతనం, నిర్ణీత పని గంటలు, కార్మికుల ఉద్యోగ భద్రత అంశాలపై రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పబ్లిక్ సెక్టార్‌ను కాపాడేందుకు సామాజిక న్యాయం కోసం కార్మిక ఉద్యమాలే మార్గమన్నారు. మేడే వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కోప్పోజు సూర్యానారాయణ, యల్లావుల రమేష్, చెనగాని సైదులు, జడ శ్రీనివాస్, సోమగాని కృష్ణ, కందుల వెంకటేశ్వర్లు, ఇందిరాల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, జడ వెంకన్న, మామిడి నర్సయ్య, జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆర్‌టిఐ కమిషన్ జిల్లాల పర్యటన

రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కేసులను త్వరగా పరిష్కరించేందుకే జిల్లాల పర్యటనలు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) 2005 అవగాహన సదస్సుకు ఆయన సమాచార కమీషనర్లు పివి శ్రీనివాస్ రావు, మోహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి నరసింహాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని సామాన్య ప్రజలకు పారదర్శకంగా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సమాచారం సమయానికి అందితేనే దానికి విలువ ఉంటుందన్నారు. పౌరులకు సమయానికి సమాచారం అందించాలన్న లక్ష్యంతో కమీషన్ చొరవ తీసుకొని జిల్లాల పర్యటన చేపట్టడం జరుగుతుందని చెప్పారు. పౌరులు అడిగిన సమాచారాన్ని గడువులోగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రెండేళ్ల క్రితం వరకు కమీషన్ లేకపోవడంతో కమిషన్ లెవెల్‌లో దాదాపు 28వేల కేసుల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. వాటిలో 18వేల కేసుల హియరింగ్ పూర్తి చేసుకొని 16వేల కేసులలో ప్రజలకు సమాచారం అందించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 1.20లక్షల మంది ప్రజలు ఆర్‌టిఐ ద్వారా సమాచారం తీసుకుంటున్నారన్నారు. వీటిలో 20వేల వరకు ఫిటిషన్లు సమాచారం ఇవ్వలేని పరిస్థితుల్లో ఫస్ట్ అప్లికెంట్ అథారిటి వద్దకు వెళ్తున్నాయన్నారు. వీటిలో దాదాపు 10వేల ఫిటిషన్లు ఫస్ట్ అప్లికెంట్ అథారిటి లెవల్‌లోని పౌరులకు సమాచారం ఇస్తున్నట్లు చెప్పారు. స్టేట్ లెవల్ దాదాపు 12 వేల ఫిటిషన్లు సెకండ్ అప్పీల్ రూపంలో కమీషన్ వద్దకు వస్తున్నట్లు తెలిపారు. 10 నెలల్లో దాదాపు 15వేల పెండిం గ్ కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజలకు సమాచార హక్కు చట్టంపై ఎక్కువ అవగాహన కలిగి ఉన్నారని అందుకే సూర్యాపేట జిల్లా నుండి భారీగా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నా రు. ఎక్కువగా పెండింగ్ ఆర్‌టిఐలలో మొదటి దశలో 50 శాతం కేసులను జిల్లాల పర్యటనలో పరిష్కారం చూపామని మరో 50 శాతం కేసులను త్వరలో పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

ప్రజాపక్షం/యాదాద్రి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 57 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 39, జిల్లా పంచాయతీ 5, చేనేత మరియు జౌళి 4, మున్సిపాలిటీ 2, శిశు సంక్షేమ 2, జిల్లా వ్యవసాయ 2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్, సర్వే ల్యాండ్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## రైతులను ఇబ్బంది పెట్టొద్దు : ఆర్‌డిఒ

ప్రజాపక్షం/బొమ్మలరామారం : మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆర్డిఓ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని రైతులను ఎవ్వరు ఇబ్బందులుకు గురి చేయకూడదని తేమశాతాన్ని పరిశీలించి కొనుగోలు చేసిన వడ్లను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని వారికి సూచన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్. ఆర్ఐ వెంకట్ రెడ్డి, ఆర్ఐ నరేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సహజీవనం చేసి..
# అత్యాచారమంటూ పిటిషనా?

### సహజీవనంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** సహజీవనం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేనప్పుడు సహజీవన భాగస్వామి నుంచి విడిపోవడం నేరం కాదని స్పష్టం చేసింది. పెళ్లి పేరుతో నమ్మించి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తనకు 18 ఏళ్ల వయసు అప్పుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని, అప్పటికే అతనికి నలుగురు భార్యలున్నా ఆ విషయం దాచిపెట్టాడని బాధితురాలు తెలిపారు. అయితే కోర్టు కేవలం పిటిషనర్ పెట్టిన కేసుపైనే దృష్టి పెడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. వివాహం లేకుండా కలిసి ఉండాలనుకుంటే, అలాంటి సంబంధాల్లో సహజంగానే కొన్ని ముప్పులు ఉంటాయని జస్టిస్ నాగరత్న ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఏకాభిప్రాయంతో కలిసి ఉండి, బిడ్డను కూడా కన్న తర్వాత ఆ బంధం విచ్ఛిన్నం కాగానే అత్యాచారం వంటి క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ బంధం వల్ల పుట్టిన బిడ్డ కోసం మాత్రం మహిళ పోషణ ఖర్చులను కోరవచ్చని సూచించింది. ఒకవేళ వివాహం జరిగి ఉంటే, ఆమె హక్కులు మరింత మెరుగ్గా ఉండేవని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఇరుపక్షాలకు సూచించారు. 'ఈ కేసు సహజీవన బంధానికి సంబంధించినది. వివాహం కాకుండానే ఆ మహిళ ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోంది. ఇదంతా ఏంటి? సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారింది? కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్నారు. పెళ్లి ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవి' అని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తంచేశారు.



**కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించారు?**


అయితే, పిటిషనర్ తరఫున న్యాయవాది తన వాదనలు వినిపించారు. నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయసు 18 ఏళ్లు అని పేర్కొన్నారు. అప్పుడు ఆమె ఒక వితంతువని, అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిందని తెలియజేశారు. అయితే, ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని, ఇతర మహిళలను ఇలాగే మోసగించాడని తెలిపారు. అయితే, ఈ వాదనలు విన్న న్యాయమూర్తి, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులుగా కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించారంటూ ప్రశ్నించారు. అలాగే బాధిత మహిళ పరిస్థితిపై సానుభూతి వ్యక్తంచేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని ఆయన సూచించారు. వివాహేతర సంబంధాలు ఉండొచ్చు, కానీ అలాంటి బంధాల వల్ల జన్మించిన పిల్లలు వివాహేతర సంతానం కాదని స్పష్టం చేశారు. పెళ్లి జరిగిఉంటే చట్టపరంగా ఆమె పరిస్థితి మెరుగ్గా ఉండేదని వ్యాఖ్యానించారు. ఇరువర్గాలు ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

**పరస్పర అంగీకారంతో సహజీవనం చేయడం చట్టప్రకారం నేరం కాదు!**

గతంలోనూ సహజీవన సంబంధాలపై అలహాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. వివాహితుడైన పురుషుడు వయోజనురాలైన మహిళతో పరస్పర అంగీకారంతో సహజీవనం చేయడం చట్టప్రకారం నేరం కాదని స్పష్టం చేసింది. ఎలాంటి నేరం జరగనప్పుడు పౌరుల హక్కులను పరిరక్షించే కోర్టు చర్యలకు సామాజిక అభిప్రాయాలు, నైతికత మార్గదర్శకం కావని జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. తాను ఇష్టపూర్వకంగా, స్వేచ్ఛతోనే ఆ వ్యక్తితో కలిసి జీవిస్తున్నానని ఆ మహిళ పోలీసు సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని సమర్పించినట్లు గుర్తు చేసింది. తన కుటుంబ సభ్యులు ఈ సంబంధాన్ని వ్యతిరేకించారని, తనను చంపేస్తామని బెదిరించారని కూడా బాధిత మహిళ ఆరోపించినట్లు తెలిపింది.

# ఆప్ ఎంపిల విలీనానికి ఆమోదం

### రాజ్యసభలో తగ్గిన ఆప్ బలం, 113కు పెరిగిన బిజెపి సభ్యుల సంఖ్య



**న్యూఢిల్లీ :** బిజెపిలోకి ఏడుగురు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపిల విలీనానికి రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ అధికారికంగా అనుమతించారు. దీంతో పెద్దల సభలో బిజెపి సంఖ్యాబలం 106 నుంచి 113కు పెరిగింది. ఇక ఇదే సమయంలో రాజ్యసభలో ఆప్ ఎంపిల సంఖ్యాబలం 3కు తగ్గిపోయింది. రాజ్యసభ చైర్మన్ తాజా నిర్ణయం అనంతరం విడుదల చేసిన ఒక నోటిఫికేషన్‌లో ఈ వివరాలను ప్రస్తావించారు. రాజ్యసభ అధికారిక వెబ్‌సైట్‌లోనూ బిజెపి ఎంపిల జాబితాలో ఈ ఏడుగురు ఆప్ ఎంపిల పేర్లను పొందుపరిచారు. బిజెపిలో విలీనమైన ఏడుగురు ఆప్ ఎంపిల్లో రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ కుమార్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలీవాల్, రాజీందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీ ఉన్నారు. ఇప్పుడు రాజ్యసభలో మిగిలిన ఆప్ ఎంపిల్లో సంజయ్ సింగ్ (ఢిల్లీ), ఎన్‌డి గుప్తా (ఢిల్లీ), బల్బీర్ సింగ్ సీచేవాల్ (పంజాబ్) ఉన్నారు.

**ఇక ఆ ఏడుగురు మావాళ్లే :** కేంద్ర మంత్రి రిజిజు బిజెపిలో ఏడుగురు ఆప్ ఎంపిల విలీనాన్ని రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఆమోదించారంటూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేశారు. ఇక నుంచి వారందరూ బిజెపి పార్లమెంటరీ పార్టీ సభ్యులని ఆయన వెల్లడించారు.

**ఫిరాయింపు ఎంపిలు వర్సెస్ ఆప్**

రాఘవ్ చద్దా సారథ్యంలో ఆప్ ఎంపిలు కలిసి శుక్రవారం బిజెపిలో చేరారు. తామంతా ఆప్ పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు వారు వెల్లడించారు. ఏడుగురు ఆప్ ఎంపిలతో కూడిన తమ వర్గాన్ని బిజెపిలో విలీనం చేయాలని అదే రోజున రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్‌కు వినతి పత్రాన్ని అందించారు. రాజ్యసభలోని ఆప్‌నకు చెందిన మొత్తం 10 మంది ఎంపిల్లో మూడింట రెండోవంతు మంది (ఏడుగురు) కలిసికట్టుగా ఉన్నందున ఈ విలీనం రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందని వారు వాదించారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు అనేది తమ ఏడుగురికి వర్తించదని రాజ్యసభ చైర్మన్‌కు తెలిపారు. ఇక తమ పార్టీ నుంచి ఫిరాయించిన ఏడుగురు ఎంపీల రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం రోజు రాజ్యసభ చైర్మన్‌కు ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ఒక పిటిషన్‌ను సమర్పించారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం ఆ ఏడుగురు ఎంపిలపై అనర్హత వేటు వేయాలని ఆయన కోరారు. పార్టీ ఫిరాయించే లోక్‌సభ, రాజ్యసభ ఎంపిల సంఖ్య మూడింట రెండో వంతు ఉన్నా, ఆ సమూహానికి చట్టపరమైన గుర్తింపు దక్కదన్నారు. అయితే ఏడుగురు ఆప్ ఎంపిల విలీన విన్నపానికే రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఆమోదం తెలపడం గమనార్హం.

# అందులో ఆశ్చర్యమేమీ లేదు!

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** బిజెపిలో ఏడుగురు ఆప్ ఎంపిల విలీనానికి రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఆమోదం తెలపడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించలేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇటీవలి వరకు ఇడి వారిలో కొందరిని లక్ష్యంగా చేసుకున్నందున, ఈ శాసనసభ్యుల ఫిరాయింపు ఒక 'సర్జికల్ స్ట్రైక్, ముందస్తు చర్య' అని కూడా కాంగ్రెస్ తెలిపింది. విలీనాన్ని అంగీకరించాలన్న రాజ్యసభ చైర్మన్ నిర్ణయం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించలేదని, నిజానికి ఇంత సమయం పట్టడం, వారాంతంలో దీనిని లాంఛనంగా ఆమోదించకపోవడమే ఆశ్చర్యకరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు.'ఇప్పుడు భారత ప్రజాస్వామ్యంలో చిన్న చిన్న దయలే ఇమిడిపోయాయి అని రమేష్ ఎక్స్ ఛానెల్‌లో అన్నారు. 'ఈ ఎంపిలు తమ కొత్త గూడును ఆప్యాయంగా స్వీకరించింది. అదే విధంగా బిజెపికూడా వారిని ప్రశంసించింది. ఇటీవలి వరకు, వారి నిజాయితీపై బిజెపికి తీవ్రమైన సందేహాలు ఉండేవి. వారిపై తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని కూడా చెప్పుకుంది, కానీ ఇప్పుడు అదంతా సౌకర్యవంతంగా మరిచిపోయింది. ఇటీవలి వరకు ఈ ఎంపిలలో కొందరిపై ఇడి దాడులు చేస్తూనే ఉంది, కానీ ఇప్పుడు అవి కూడా ఆగిపోతాయి. ఈ అంశంపై పందెం కాయవచ్చు' అని ఆయన అన్నారు. ఇతరులపై జరగాల్సిన ఇడి దాడులు ఇకపై జరగవు. అందువల్ల ఇది ఒక సర్జికల్ స్ట్రైక్, ముందుజాగ్రత్త చర్య కూడా అని అన్నారు. కమలం ఇప్పుడు దోపిడీగా మారిందని రమేష్ మండిపడ్డారు.

# లద్ధాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు

### కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌కు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం



**లేహ్/జమ్ము :** కేంద్రపాలిత ప్రాంతమైన లద్ధాఖ్‌లో పరిపాలనా సంస్కరణల దిశగా కీలక అడుగు పడింది. ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ లద్ధాఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం తెలిపారు. వీటి ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇదొక చరిత్రాత్మక రోజు అని అభివర్ణించారు. ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు లద్ధాఖ్‌లో లేహ్, కార్గిల్ అనే రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో లద్ధాఖ్‌లో మొత్తం జిల్లాల సంఖ్య రెండు నుంచి ఏడుకు పెరగనుంది. లేహ్ జిల్లా నుంచి నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్ అనే మూడు జిల్లాలను ఏర్పాటు చేయగా, కార్గిల్ జిల్లా నుంచి జాన్స్కార్, ద్రాస్ అనే రెండు జిల్లాలను ఏర్పాటు చేశారు. విస్తీర్ణం పరంగా అతిపెద్ద కేంద్రపాలిత ప్రాంతమైనప్పటికీ, జనాభాలో రెండో అతి తక్కువ స్థానంలో ఉన్న లద్ధాఖ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం దీని విస్తీర్ణం 86,904 చదరపు కిలోమీటర్లు ఉండగా జనాభా 2.74 లక్షలుగా ఉంది. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్లు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరగడంతో పాటు వృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయని సక్సేనా తెలిపారు. ఈ నిర్ణయంతో లద్ధాఖ్‌లోని మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. లద్ధాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, 2024 ఆగస్టులో వెల్లడించారు. త్వరలోనే హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో తాజాగా ఆ ఐదు జిల్లాలను ఏర్పాటు చేస్తూ లద్ధాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదముద్ర వేశారు. 'లద్ధాఖ్ ప్రజల ఆకాంక్షలను, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌ను నెరవేరుస్తూ ఐదు కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆమోదించాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి చెందిన, సంపన్న లద్ధాఖ్ దార్శనికతకు అనుగుణంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో 2024 ఆగస్టులోనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఈ నిర్ణయం క్షేత్రస్థాయి పాలనను బలోపేతం చేస్తుంది. పరిపాలనను వికేంద్రీకరించి లద్ధాఖ్ ప్రజలకు, ముఖ్యంగా మారుమూల, సుదూర ప్రాంతాల వారికి ప్రజా సేవలను వేగంగా అందించేలా చూస్తుంది. కొత్త జిల్లాల ఏర్పాటు, పాలనను పౌరులకు చేరువ చేయడమే కాకుండా, అభివృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలను సృష్టిస్తుంది. మనం కలిసికట్టుగా ఉజ్వలమైన, బలమైన, సుసంపన్నమైన భవిష్యత్తు వైపు పయనిస్తున్నాం. ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల లద్ధాఖ్ లోని ప్రతి పౌరుడు ప్రయోజనం పొందేలా చూస్తాను' అని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా పేర్కొన్నారు.

# మే 4 తరువాత మళ్లీ వస్తా

### బెంగాల్‌లో రానున్నది బిజెపి ప్రభుత్వమే : ప్రధాని మోదీ

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వ్యక్తం చేశారు. మే 4న ఫలితాలు వెలువడిన తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తాను రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల రెండవ, చివరి దశ ప్రచారంలో భాగంగా చివరి రోజున సోమవారం ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ పాల్గొని ప్రసంగించారు. అధికార టిఎంసిపై మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'సిండికేట్ రాజ్', రాజకీయ హింస, ఆర్థిక పతనానికి ఆ పార్టీయే కారణమని ఆరోపించారు. 'పశ్చిమ బెంగాల్‌లో నేను గమనించిన వాతావరణాన్ని బట్టి, మే 4 తర్వాత జరిగే బిజెపి ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నేను తిరిగి వస్తానని చెప్పగలను' అని మోదీ అనగా, సభికుల నుండి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వినిపించాయి.



బ్యారక్‌పూర్ చారిత్రక ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, 1857లో జరిగిన భారతదేశ మొదటి స్వాతంత్ర్య యుద్ధంలో ఈ ప్రాంతం కీలక పాత్ర పోషించిందని, ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ మార్పుకు రంగం సిద్ధం చేస్తోందని ప్రధాని అన్నారు. భారతదేశ సమగ్ర అభివృద్ధికి పశ్చిమ బెంగాల్ ప్రగతి అత్యంత ఆవశ్యకమని, దేశ భవిష్యత్తుకు ఈ తూర్పు ప్రాంత ఎదుగుదల కీలకమని మోదీ నొక్కి చెప్పారు. 'పశ్చిమ బెంగాల్‌కు సేవ చేయడం, దానికి భద్రత కల్పించడం, దానిని కాపాడటమే నా కర్తవ్యం, బాధ్యత' అని ఆయన అన్నారు. 'మా, మట్టి, మానుష్' (అమ్మ, మట్టి, మనిషి) అనే నినాదాన్ని టిఎంసి మోసం చేసిందని, రాష్ట్ర అభివృద్ధిపై దానికి ఎలాంటి దార్శనికత లేదని ఆయన ఆరోపించారు. పరిశ్రమలు మూతపడుతుండగా, నేరపూరిత నెట్‌వర్క్‌లు విజృంభిస్తున్నాయని పేర్కొంటూ, 'ఒకవైపు మిల్లులు మూతపడుతుంటే, మరోవైపు గూండాలకు ఉపాధి కల్పిస్తూ ముడి బాంబుల కర్మాగారాలు వెలుస్తున్నాయి, టిఎంసి సిండికేట్ విస్తరిస్తోంది' అని మోదీ అన్నారు. పాలనకు బదులుగా అధికార పార్టీ దుర్భాష, బెదిరింపులకు పాల్పడుతోందని ప్రధాని ఆరోపించారు. వారు తమ అవమానకరమైన వ్యాఖ్యలతో నన్ను, రాజ్యాంగ సంస్థలను, చివరికి సాయుధ దళాలను కూడా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. దక్షిణ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ప్రభావవంతమైన, శరణార్థుల మూలాలకు చెందిన మతువా వర్గాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, అర్హులైన వారందరికీ బిజెపి ప్రభుత్వం పౌరసత్వం, పత్రాలు అందేలా చూస్తుందని మోదీ వారికి హామీ ఇచ్చారు. అక్రమ చొరబాట్లపై స్పందిస్తూ నిజమైన భారత పౌరులకు రక్షణ కల్పిస్తామని, అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కుల, మత భేదం లేకుండా ఏ భారతీయుడూ ఎలాంటి సమస్యను ఎదుర్కోడు, కానీ చొరబాటుదారులను వదిలిపెట్టం అని హెచ్చరించారు. ఉద్యోగాలు లేకపోవడంతో పశ్చిమ బెంగాల్ దశాబ్దాలుగా వలసల బాధను అనుభవించిందని, రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడమే బిజెపి ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉంటుందన్నారు.


# బెంగాల్‌లో రూ. 500 కోట్లు దాటిన స్వాధీనాలు : ఇసి




**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ భారీగా నగదు, ఇతరాలు పట్టుబడ్డాయి. సోమవారం నాటికి అక్రమ ప్రలోభాలకు సంబంధించిన మొత్తం స్వాధీనాలు రూ. 510 కోట్లను అధిగమించాయని ఎన్నికల సంఘం తెలిపింది. 2021లో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన స్వాధీనాల (అప్పట్లో మొత్తం రూ. 339 కోట్లు) కంటే ప్రస్తుత స్వాధీనాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నమోదైన స్వాధీనాల కంటే కూడా తాజా రికవరీలు అధికంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల మొదటి దశ ఏప్రిల్ 23న జరగగా, రెండవ దశ బుధవారం నాడు జరగనుంది. ఈ స్వాధీనాల్లో రూ. 30 కోట్ల నగదు, రూ. 126.85 కోట్ల విలువైన 48,000 లీటర్లకు పైగా మద్యం, రూ. 110.12 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ. 58.28 కోట్ల విలువైన విలువైన లోహాలు ఉన్నాయి. ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశంతో వినియోగించ తలపెట్టిన బంగారం, వెండి వంటి విలువైన లోహాలు ఈ జాబితాలో ఉన్నాయి. అంతేకాకుండా, ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు రూ. 184.85 కోట్ల విలువైన ఉచిత వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో గృహోపకరణాలు, దుస్తులు, సెల్‌ఫోన్‌లు ఉండనునట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ మార్చి 15న ప్రకటించబడినప్పటికీ, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# అంతర్రాష్ట్ర మద్యం స్మగ్లింగ్ : అరుణాచల్‌లో 9 చోట్ల ఇడి సోదాలు

**ఇటానగర్ :** అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రదేశాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం సోదాలు నిర్వహించింది. భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్రాష్ట్ర మద్యం స్మగ్లింగ్, మనీలాండరింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించి తొమ్మిది ప్రాంతాల్లో సమన్వయంతో ఇడి సోదాలు నిర్వహించిందని అధికారులు తెలిపారు. రాష్ట్రాల మధ్య పన్ను వ్యత్యాసాలను దుర్వినియోగం చేస్తున్న ఒక సిండికేట్‌ను సూచిస్తున్న విస్తృత దర్యాప్తులో భాగంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఈ చర్య తీసుకున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో అమ్మకానికి ఉద్దేశించిన మద్యాన్ని, అసోం, ఇతర రాష్ట్రాల్లోని మార్కెట్లకు అక్రమంగా మళ్లించి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న హోల్‌సేల్ మద్యం వ్యాపారాలను లక్ష్యంగా చేసుకుని, ఈ వారం ప్రారంభంలో ఇటానగర్, నహర్‌లగన్, సెప్పా, జిరో, దపోరిజో, నమ్సాయి, రోయింగ్ వంటి పలు పట్టణాల్లో ఈ సోదాలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్ నుండి అసోంంకు అక్రమంగా మద్యం రవాణా చేయడంపై అసోం పోలీసులు నమోదు చేసిన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ దర్యాప్తు ప్రారంభమైందని అధికారులు తెలిపారు. అసోం ఎక్సైజ్ శాఖ నుండి అందిన సమాచారం కేసును మరింత బలోపేతం చేసింది. అక్టోబర్ 17, 2024న ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక (ఇసిఐఆర్) నమోదు చేసింది. ప్రధాన మద్యం తయారీదారులుగా భావిస్తున్న ముగ్గురు కీలక ఆపరేటర్లకు సంబంధించిన ప్రాంగణాలలో గత ఏడాది ఫిబ్రవరి 4న నిర్వహించిన సోదాలు, ఇది ఒక పకడ్బందీగా సమన్వయం చేయబడిన కార్యకలాపం అన్న సూచనలను వెల్లడించాయి. తయారీదారులు, బాండెడ్ గిడ్డంగులు, టోకు వ్యాపారుల గొలుసు ద్వారా ఈ నెట్‌వర్క్ పని చేస్తూ, గిరిజన భాగస్వామ్యాలు, బూటకపు లైసెన్స్ హోల్డర్ల వంటి ప్రాక్సీ ఏర్పాట్లను ఉపయోగించి అసలు యాజమాన్యాన్ని మరుగుపరిచిందని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కాగా, సోదాల సమయంలో లెక్కల్లో చూపని సుమారు రూ. 40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇడి తెలిపింది. సోదాలు నిర్వహించిన ప్రదేశాలలో ఒక దాని నుండి 14 ముద్రలు లభించాయి; వీటిలో కొన్ని అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఎక్సైజ్ శాఖకు చెందినవిగా భావిస్తున్నారు. మద్యం అక్రమ రవాణాను సులభతరం చేసేందుకు, నకిలీ రవాణా అనుమతి పత్రాలను సృష్టించడానికి వీటిని ఉపయోగించి ఉంటారని అనుమానిస్తున్నారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.




# 11 ఏళ్ళుగా ఆయుధ వ్యయాల భారీ పెరుగుదల

- గత ఏడాది 2.90 ట్రిలియన్ డాలర్లు ఖర్చు
- 1.48 ట్రిలియన్ డాలర్లు ఖర్చుచేసిన అమెరికా,రష్యా,చైనా
- ప్రపంచ నివేదిక వెల్లడి



**స్టాక్‌హోం:** ప్రపంచవ్యాప్తంగా ఆయుధపోటీ నానాటికీ పెరిగిపోతోంది. ప్రత్యేకించి గడచిన 11 సంవత్సరాలుగా ప్రపంచదేశాల్లో రక్షణ వ్యయం భారీగా పెరుగుతూ వస్తోంది.గత ఏడాది ఆయుధ ఈ వ్యయం 2.90 ట్రిలియన్ డాలర్లుగా లెక్కతేల్చారు. అభద్రత, పునరాయుధీకరణ వంటి పరిస్థితులవల్ల ప్రపంచవ్యాప్తంగా ఆయుధాల తయారీ,రక్షణ బడ్జెట్ భారీగా పెరుగుతోందని పరిశోధకులు తమ నివేదిక–2025 లో తెలియజేశారు. వరుసగా 2025లో కూడా ఆయుధాల తయారీ వృద్ధి కొనసాగిందని పేర్కొన్నారు. అమెరికా,రష్యా,చైనా మూడు దేశాల ఆయుధ వ్యయాన్ని కలిపిచూస్తే 1.48 ట్రిలియన్ డాలర్లుగా లెక్క తేలిందని వారు చెప్పారు. ఇది ప్రపంచ వ్యయంలో సగానికి పైగా ఉందని నివేదిక తెలిపింది. అణ్వస్త్రాలు కాదు, ప్రజలకు అన్న–వస్త్రాలు, వాతావరణ పరిరక్షణ కావాలని నివేదిక ఉద్ఘాటించింది. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) నివేదిక ప్రకారం, ఆయుధాలపై ప్రపంచంలో అందరి కంటే అత్యధికంగా ఖర్చుచేసే అమెరికాలో కొంత వ్యయం తగ్గినప్పటికీ, 2024 నివేదికతో పోలిస్తే ఈ వ్యయం 2.9 శాతం పెరిగింది. ''ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరిగాయి, పరస్పర బెదిరింపు చర్యలు, దాడులు పెరిగాయి, గడచిన మూడు సంవత్సరాలుగా ప్రాంతీయస్థాయిల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి, కొత్త సంవత్సరంలో ఈ ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయని ప్రపంచం గమనిస్తున్నందువల్ల అమెరికా నుండి గతంకంటే కొంత వ్యయం స్వల్పంగా తగ్గినప్పటికీ, ఆసియా, యూరప్ దేశాల్లో పెరుగుతున్న ఆయుధ ఉత్పత్తి వ్యయాలు అంతకు సమానమయ్యాయని నివేదికకు సంబంధించిన పరిశోధకుడు లోరెంజో స్కరాజోటో ఎఎఫ్‌పి వార్తాసంస్థకు చెప్పారు. పశ్చిమాసియాకు, యూరప్‌కు ఆయుధాల సరఫరా విపరీతంగా పెరిగిందని, ప్రపంచ జి.డి.పిలో సైనికపరంగా కేటాయించిన వాటా 2009 తర్వాత ఈనాడు అన్యూహ్యంగా పెరిగిందని ఆయన అన్నారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 274 of 2025**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., AKKALAGUTTA CAO Branch, R/o. WARANGAL.**

**.... Disputant**

AND

**Mr. GANGADHAR MULASAPU & others**

**... Opponents**

3. MR.THIRUPATHI BOGU, S/O. MALLAIAH, AGED ABOUT : 34 YEARS,OCC: BUSINESS,. R/O: 1-97/2, THIPPANNAPET, JAGTIAL, TELANGANA, INDIA – 505529.
6. MR.SUMAN GUJJERI,S/O. GANGADHAR,AGED ABOUT : 36 YEARS, OCC: POLICE CONSTABLE O/o.POLICE STATION JAGITYAL,. R/O:5-114, ERDANDI, IBRAHIMPATNAM, KARIMNAGAR, TELANGANA, INDIA – 505450.
7. MR.KALEEM MOHAMMED, S/O. SALEEM, AGED ABOUT : 48 YEARS, OCC: ATTENDER O/o. GOVT JR COLLEGE JAGITYAL,. R/O: 5-5-102, GUNJ ROAD, JAGTIAL, TELANGANA, INDIA – 505327.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, WARANGAL,**

**ARB.NO. 282 of 2025**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o. WARANGAL.**

**.... Disputant**

AND

**Mrs. THAJUN MOHAMMED & others**

**... Opponents**

1. MRS.THAJUN MOHAMMED,W/O. MAHABOOB ALI, AGED ABOUT : 57 YEARS,OCC:PENSIONER,.R/O:1-4-28 ANGADI ROAD, NARSAMPET, WARANGAL, WARANGAL (RURAL), TELANGANA, INDIA – 506132
2. MRS.JAVEED MOHAMMED,S/O. MAHABOOB ALI, AGED ABOUT : 36 YEARS, OCC: OFFICE SUBORDINATE O/o. IRRIGATION DEPARTMENT, MULUGU, R/O: H.NO. 18-3-53/C, SHAMALKUNTA MIL COLONY OPPPOLICE STATION, WARANGAL, TELANGANA, INDIA – 506001
4. MRS. PERALA RAMU,S/O. VENKATESHWARLU,AGED ABOUT : 40 YEARS, OCC: JUNIOR ASST, O/o. IRRIGATION DEPARTMENT, MULUGU,. R/O: H.NO. 2-10-743, TEACHERS COLONY HANAMKONDA, WARANGAL, WARANGAL, TELANGANA, INDIA – 506001
5. MR.NAGARJUNA GARIGA,S/O. SAMBAIAH, AGED ABOUT : 41 YEARS, OCC: SENIOR ASST, O/o. IRRIGATION DEPARTMENT, MULUGU, R/O: H.NO. 12-73, GANESH NAGAR NEAR VIJAYA GARDENS, HASANPARTHY HANAMKONDA, WARANGAL, TELANGANA, INDIA – 506371

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL.**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 287 of 2025**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr. VENKATA GOPINATH BATTI & others**

**... Opponents**

1. MRS. VENKATA GOPINATH BATTI, S/O. KRISHNASWAMY, AGED ABOUT: 48 YEARS,OCC:LECTURER, KAKATIYA UNIVERSITY, HANAMKONDA, R/O: 2-9- 764, NGOS COLONY, HANAMKONDA, WARANGAL, (URBAN), TELANGANA, INDIA – 506370
2. MRS.PRASAD PAIRALA,S/O. MALLAIAH,AGED ABOUT :48 YEARS,OCC: JUNIOR LECTURER, O/o. KAKATIYA UNIVERSITY, HANAMKONDA, R/O: H.NO. 2-8-333, NGOS COLONY HANAMKONDA, WARANGAL, TELANGANA, INDIA – 506001
3. MRS.SUDHAKAR THOTA, S/O. RAVINDER, AGED ABOUT :31 YEARS, OCC: JR ASSIST O/o. KAKATIYA UNIVERSITY, HANAMKONDA, R/O: H.NO. 55-1-190/1, RAMARAM NEAR SVS ENGINEERING COLLAGE HASANPARTHY, WARANGAL, TELANGANA, INDIA - 506001

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL.**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 524 of 2025**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALA GUTTA CAO Branch, R/o. WARANGAL.**

**.... Disputant**

AND

**Ms. MEKALA.KAVITHA & others**

**... Opponents**

1. Ms. MEKALA. KAVITHA, D/o. M.ANANDAM, Aged About:54 years, Occ: Kalasi Helper, O/o,South Central Railway, At Secunderabad Division, R/o. H.NO: 21-4-106,Bapuji Nagar, Kazipet, Hanamkonda, Telangana-506003, Cell: 9966237131.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL.**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 533 of 2025**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALA GUTTA CAO Branch, R/o. WARANGAL.**

**.... Disputant**

AND

**Ms. ASHOKREDDY KANKANALA & others**

**... Opponents**

1. MR. ASHOK REDDY KANKANALA, S/O. RAMREDDY, AGED ABOUT : 59 YEARS, OCC: AGRICULTURAL FARMER & REAL ESTATE BUSINESS, R/O: PLOT. NO.17- B BLOCK ASRAONAGAR ECIL, BESIDE OBC BANK KAPRA-SECUNDRABAD. 500062., HYDERABAD, TELANGANA, INDIA – 500062. MOBILE: 9440386443
2. MR.KANKANALA RAVINDER REDDY, S/O. ADIREDDY, AGED ABOUT : 55 YEARS, OCC: SCHOOL ASSISTANT, O/O: ZPHS ELAGANDAL. R/O:8-3-140, BHAGATHNAGAR, KARIMNAGAR, TELANGANA, INDIA - 505467 MOBILE: 9440062874.
4. MR.CHINTALA RAJI REDDY, S/O. MALLAREDDY, AGED ABOUT :58 YEARS, OCC: CONDUCTOR, TSRTC. R/O: 2-115/1, NAWABPET, CHIGURUMAMIDI, KARIMNAGAR, TELANGANA, INDIA - 505467. MOBILE: 7382847647

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **08-05-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL.**

# నేపాల్‌లో అప్పుడే ప్రజాగ్రహ వ్యక్తీకరణ

మన పొరుగున ఉన్న మూడు దేశాల్లో – శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లలో కొత్తతరహా ప్రజాతిరుగుబాట్లు సాంప్రదాయక రాజకీయ పార్టీలను కుప్పకూల్చి – ప్రజాస్వామ్యయుతమైన సార్వత్రిక ఎన్నికల ద్వారా కొత్త ప్రభుత్వాలను అధికారంలోకి తెచ్చాయి. 2024, 2025, 2026 సంవత్సరాలు ఈ కొత్త దశను ఆవిష్కరించాయి. అధికారంలో ఉన్న పార్టీల పాలనలో అవినీతి, అసమర్థత, బంధుప్రీతి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితర కారణాలతో ప్రజల్లో ముఖ్యంగా యువతరంలో గూడుకట్టుకున్న అసంతృప్తి కట్టలు తెంచుకుని వీధులకెక్కింది. పాతొకరోత–కొత్తొక వింత అనేరీతిగా స్థిరమైన రాజకీయ పార్టీల వెనకనున్న జనాలు సైతం ఈ కుర్రకారు వెంట నడిచారు. ఆ సందర్భాల్లో రెండువైపులా హింస చోటుచేసుకుంది. ఆందోళనకారులు ప్రభుత్వ ఆస్తులు, కొన్నిచోట్ల ప్రైవేటు ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. శాంతి–భద్రతల యంత్రాంగం ఆ హింసాత్మక సమూహాలపై కాల్పులు జరిపింది. అనేకమంది చనిపోయారు. ప్రజాగ్రహానికి తలొగ్గి ప్రభుత్వాలు రాజీనామా చేశాయి.

శ్రీలంకలో ఫ్యూడల్ శక్తుల పాలక వ్యవస్థ స్వచ్ఛందంగా అధికారం వదులుకోక తప్పలేదు. బంగ్లాదేశ్‌లో ప్రధాని హసీనా రాజీనామా సమర్పించి సైన్యం సలహాపై భారత్‌లో ఆశ్రయం పొందారు. నేపాల్‌లో కమ్యూనిస్టు నాయకుడు కె.పి.శర్మ ఓలి సంకీర్ణ ప్రభుత్వం రాజీనామా చేసింది. ఈ పరిణామాలన్నీ 'జన్–జడ్' అనే అయత్నకృత ఉద్యమం సాధించిన గుణాత్మక మార్పులు, విజయాలు. అయితే ఇది ఇంటర్నెట్ సహాయంతో స్మార్ట్‌ఫోన్‌ల సందేశాలు నిర్మించిన ఉద్యమం. ఆ కారణంగా ఆ ఉద్యమాలకు సంస్థాగత నిర్మాణం, నిర్మాణయుతమైన నాయకత్వం, అన్నిటికీ మించి ఒక సిద్ధాంత ప్రాతిపదిక లేదు. అయితే దేశాలు వేరైనా, ఈ ఉద్యమాల మధ్య సారూప్యత ఉంది, ప్రజాస్వామ్యం పట్ల అంకితభావం విశేషం. 1980–90 దశకాల్లో ఈజిప్టు తదితర అరబ్ దేశాల్లో వచ్చిన అయత్నకృత 'ఆరెంజ్ విప్లవం' వంటివి వీటికి మూలాలు అనవచ్చు. ఈ తిరుగుబాట్ల పర్యవసానాల్లో భిన్నత్వం ఉంది. ఉదాహరణకు శ్రీలంకలో ఓటర్లు వామపక్ష అభ్యర్థులను అందల మెక్కించారు. బంగ్లాదేశ్‌లో స్పష్టమైన దారి తెలియక మతోన్మాదులతో చేయి కలిపారు. ఓటర్లు మాత్రం సాంప్రదాయక పార్టీల్లో అవామీలీగ్‌కి ప్రత్యర్థి అయిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి)కి అధికారం కట్టబెట్టారు. అవామీలీగ్‌ను నిషేధించిన నేపథ్యంలో అక్కడ ఎన్నికలు జరిగాయి. కాగా నేపాల్ లో సుప్రీంకోర్టు మాజీ ఛీఫ్ జస్టిస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం నిర్వహించిన ఎన్నికల్లో సాంప్రదాయక పార్టీలు అంతర్గత వైషమ్యాలు, అస్థిరతకు మూల్యం చెల్లించుకున్నాయి. ప్రధాన కమ్యూనిస్టుపార్టీలు, జాతీయవాద నేపాలీ కాంగ్రెస్‌లను ఓటర్లు తిరస్కరించగా, గాయకుడు, కాఠ్మండు మాజీ మేయర్ నాయకత్వంలో జన్–జడ్ వేదికగా పుట్టుకొచ్చిన ఆర్‌ఎస్‌పి విజయం సాధించింది. మార్పుకోసం ఓటు వేసిన ప్రజలు విచారం వ్యక్తం చేయటం నెలరోజుల్లోనే మొదలుకావటం విచారకరం. ప్రధానమంత్రి బాలెన్ షాకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం బయలుదేరటానికి కారణం?

ప్రధాని బాలెన్‌షా ఆచరణ రహిత, ప్రజావ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ నేపాల్ పట్టణాల్లో వేలాదిమంది వీధుల్లోకి రావటం మొదలైంది. వారిలో అత్యధికులు యువకులు. గత సెప్టెంబర్‌లో పెద్ద ఎత్తున జన్–జడ్ ఉద్యమంలో పాల్గొన్న యువకులే. మార్చి నెలలో జరిగిన ఎన్నికల్లో పెద్ద మెజారిటీతో బాలెన్ షా పార్టీని గెలిపించిన యువకులే వీరంతా. ఈ నిరసనలు విద్యార్థులకే పరిమితం కాదు. సాధారణ పౌరులు, వ్యాపారులు, రాజకీయ పార్టీల కార్యకర్తలు వారిలో ఉన్నారు. కాఠ్మండు, ఇతర నగరాలతో పాటు దేశ ప్రధాన పరిపాలనా కేంద్రం సింఘా దర్బార్‌కు ఈ నిరసన ప్రదర్శనలు చేరా యి.

భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే రూ.100 దాటిన వస్తువులపై కస్టమ్స్ సుంకం విధించాలన్న నిర్ణయం ఈ నిరసనకు ఒక ప్రధాన కారణం. సరిహద్దు ప్రాంతాల ప్రజలు రోజూ భారత్ నుంచి కొనుగోళ్లు చేస్తుంటారు. అలాంటి మార్కెట్లలో దుకాణదారులు భారతీయులు, కొనుగోలుదారులు విధిగా నేపాలీయులు. అంతకుముందు రెండు దేశాల మధ్య వాహనాల రాకపోకలపై పన్ను లేదు. ఇప్పుడీ కొత్త ప్రభుత్వం రెండు, నాలుగు చక్రాల శకటాలు సహా అన్నిటిపై భారీ పన్ను విధించింది. ఇది సరిహద్దుకు ఇరువైపుల ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. ఇరుదేశాల మధ్య బాహాట సరిహద్దు ఉండటాన్ని గుర్తుంచుకోవాలి. అటు – ఇటు ప్రజల మధ్య 'రోటీ–భేటీ' సంబంధాలున్నాయి.

బాలెన్ షా విద్యార్థి రాజకీయాలను నిషేధించాడు. రాజకీయ పార్టీలకు చెందిన విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లో నిషేధించాడు. మాజీ ప్రధాని ఓలి, ఆయన హోంమంత్రి రమేశ్ లేఖక్‌లను అరెస్టు చేసి తప్పుడు కేసులు బనాయించాడు. 10మంది మాజీ ప్రధానులపై కేసులు బనాయించాడు. రాజకీయ ప్రత్యర్థులు లేకుండా చేసుకునే ఈ నియంతృత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. సుందరీకరణ పేరుతో పశుపతినాథ్ ఆలయం చుట్టూ, పట్టణాలలో రోడ్లవెంట చిన్నదుకాణాలను తొలగిస్తూ చిరువ్యాపారుల పొట్టగొడుతున్నాడు.

స్పష్టమైన వర్గ అవగాహన, స్థిరమైన అభివృద్ధి నమూనా లేని పార్టీలు కొన్ని సందర్భాల్లో ఆకస్మికంగా అధికారంలోకి రావచ్చు. అయితే ఆ అధికారం దీర్ఘకాలం సాగదని అనుభవం చెబుతున్నది. నేపాల్ ప్రజాస్వామ్యాన్ని పరీక్షిస్తున్న బాలెన్ షా ప్రభుత్వం తొందరపాటు చర్యలతో దానికి ముప్పు కలుగజేయదని ఆశించుదాం! ఆయన హోంమంత్రి, వ్యాపారవేత్త అవినీతి ఆరోపణలతో కొద్దిరోజుల క్రితం రాజీనామా చేశారు.

దాన్ని వేరువిషయంగా చూడపనిలేదు. రాచరికానికి వ్యతిరేకంగా దీర్ఘకాలం పోరాటాలు నిర్వహించిన నేపాల్ రాజకీయ వ్యవస్థ, ప్రజలలోని ప్రజాస్వామిక ఆకాంక్ష ను విస్మరించి నియంతృత్వ పోకడలుపోతే మొదటికే ముప్పు వస్తుందని ప్రధాని గ్రహించాలి.



## భారత్ మద్దతువల్లే 'బ్రిక్స్ ప్లస్' సమావేశంపై ప్రకటన రాలేదు

న్యూఢిల్లీలో గతవారం బ్రిక్స్–ప్లస్ దేశాలతో సమావేశం నిర్వహించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం సిగ్గుచేటు. ఇజ్రాయెల్–పాలస్తినా సమస్య విషయంలో వైఖరిని సడలించుకోవాలని భారత ప్రభుత్వం నిర్బంధించడాన్ని బ్రిక్స్ ప్లస్ దేశాల సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. పశ్చిమాసియాలో ముఖ్యమైన ఈ అంశంపై ప్రకటన చేసే విషయంలో భాషను సడలించి పలుచన చేసేందుకు సమ్మతించలేదు. బ్రిక్స్‌లో ఇజ్రాయెల్ పాలకులకు మద్దతు తెలియజేసిన ఒకేఒక్క పెద్ద దేశం బ్రిక్స్‌లో భారత్ మాత్రమే. ఇజ్రాయెల్–పాలస్తినా విషయంలో సడలించిన వైఖరి చైనా,బ్రెజిల్,రష్యా,దక్షిణ ఆఫ్రికా,ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాన్ దేశాలకు నచ్చలేదు. ఆ నాయకులు ఈ విషయంలో ప్రకటనకు సంబంధించి భాషను పలుచన చేయడాన్ని తిరస్కరించారు.

– కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్

## పని ప్రదేశంలో సానుకూల మానసిక సామాజిక వాతావరణం

ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణం పొందే కనీస ప్రాథమిక హక్కు ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 28 ఏప్రిల్ రోజున ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత మరియు ఆరోగ్యం దినోత్సవం (వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్) అనబడే కార్యక్రమాన్ని 2003 నుంచి ఐరాసకు చెందిన ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) నిర్వహిస్తోంది. వృత్తిపరమైన ప్రమాదాలు, వ్యాధుల నివారణను ప్రోత్సహించడానికి, పని ప్రదేశాల్లో భద్రతతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని పెంచడానికి అవసరమైన అవగాహనను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. కార్మికులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని పరిస్థితులను కల్పించడం యాజమాన్యాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి.

**పనిలో భద్రత, ఆరోగ్య కల్పనలో ఎఐ, డిజిటల్ టెక్నాలజీ పాత్ర:**

ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం వేదికగా ప్రభుత్వాలు, సంస్థలు, ట్రేడ్ యూనియన్లు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 2026 ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం ఇతివృత్తంగా పని ప్రదేశంలో మంచి మానసిక సామాజిక వాతావరణం అభివృద్ధిలో శ్రామికులు, సంస్థల సన్మార్గ ప్రయత్నాలు అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. దాదాపు 50% కార్మికులు పని ప్రదేశాల్లో అభద్రత, అనారోగ్యాలను ఎదుర్కొంటున్నారని తెలుస్తున్నది. ఆసియాలో కార్మికులు అత్యధికంగా వీటి బారినపడి ప్రాణాలు కోల్పోవడం లేదా అనారోగ్యాల కోరల్లో చిక్కడం ఆందోళనను కలిగిస్తున్నది.ఐరాస ఐఎల్‌ఒ వివరణ ప్రకారం పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యకర వాతావరణం పొందడం వారి కనీస హక్కు అని తెలుసుకోవాలి. గనుల్లో పనిచేసే కార్మికులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

**అత్యాధునిక టెక్నాలజీ వాడకంతో తగ్గిన ప్రమాదాలు:**

వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం పొందడానికి నేటి అత్యాధునిక ఎఐ, డిజిటల్ టెక్నాలజీలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ప్రమాదకరమైన పని ప్రదేశాలు, విష పదార్థాల నియంత్రణ, అతి ఉష్ణోగ్రతలు, ప్రమాదకర వాతావరణం లాంటి పరిస్థితుల్లో రోబోటిక్స్ వాడడం వల్ల పనులు త్వరగా, సులభంగా పూర్తి అవుతున్నాయి. రోబోలు, డ్రోన్లు లాంటి సాంకేతిక ఆవిష్కరణలతో ప్రమాదకరమైన పనులను తేలికగా చేయడం, ప్రమాద హెచ్చరికలకు డిజిటల్ సెన్సార్లు వాడడం సర్వసాధారణం అయిపోయింది. నేడు రోబోటిక్స్, ఎఐ ఎం ఎల్, ఎగ్జోస్కెలిటన్స్, మానవ రహిత వైమానిక వాహనాలు, ఐఒటి, రిమోట్ కంట్రోల్ వర్క్, వర్చువల్ అండ్ ఆగ్యుమెంటెడ్ రియాలిటీ లాంటి టెక్నాలజీలను ప్రమాదకర పనిప్రదేశాల్లో వినియోగించడం క్రమంగా పెరుగుతోంది. వృత్తిపరమైన ఆరోగ్యం, సురక్షిత వాతావరణమే ప్రాధాన్యంగా సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, వాతావరణ మార్పులను అడ్డుకోవడం వల్ల ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 2030 కూడా సుసాధ్యం అవుతాయని గమనించాలి. పని ప్రదేశాల్లో భద్రత కొరవడినపుడు కార్మికుల అనారోగ్యాలు పెరిగి వారితో ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతూ, దీర్ఘకాలిక వ్యాధుల బారినపడతారని గమనించాలి. ఈ విషయాలన్నీ గమని స్తూ పని ప్రదేశాల్లో సరైన భద్రత చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం వల్ల ఉత్పత్తి పెరిగి దేశాభివృద్ధి వేగం పుంజుకుంటుందని తెలుసుకుం దాం.

*(28 ఏప్రిల్ ప్రపంచ పని ప్రదేశ భద్రత, ఆరోగ్య దినోత్సవం సందర్భంగా)*

# యుపిఎ చివరి రోజులు తిరిగి వస్తున్నాయా?



ఎం. కోటేశ్వరరావు

వికసిత్ భారత్ పేరుతో దేశ జిడిపిని 2047లో మూడో, రెండో స్థానానికో తీసుకుపోతారని జనమంతా ఎదురు చూస్తున్నారు. అయితే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం ప్రపంచ జిడిపిలో భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. తలసరి జిడిపి మనది 2.81వేల డాలర్లు కాగా బంగ్లాదేశ్ 2.91వేలతో ఎగువన ఉంది. చైనా 14.87 వేలతో ఇంకా ముందుంది. బంగ్లాదేశ్‌తో పోలుస్తారా అంటూ కాషాయ దళాలు వీధుల్లో వీరంగం వేస్తే కుదరదు. చేదు నిజాలను అంగీకరించక తప్పదు మరి. ఇది ఐఎంఎఫ్ చెప్పిన సమాచారం. 1980 నుంచి 2000 వరకు రెండు దేశాల మధ్య స్వల్పతేడా ఉంది. మోదీ అధికారానికి వచ్చిన సమయంలో మనకంటే బంగ్లాదేశ్ వెనుకబడి ఉంది. పన్నెండేళ్ల మోడీనోమిక్స్ తో అభివృద్ధి పథంలో దేశం నడిచిందని చెప్పిన తరువాత ఇప్పుడు మనం వెనుకబడిపోయాం. ఎంత చెట్టుకు అంతగాలి అంటారు గానీ, బంగ్లాదేశ్ చిన్న చెట్టు నుంచి ఎక్కువగా గాలి వస్తోంది. మొత్తం జిడిపిని జనాభాతో భాగిస్తే వచ్చేదే తలసరి, ఇది వేదగణితంలో కూడా మారదు మరి. దీన్ని చూస్తుంటే ఒక సినిమాలో ఏమిరా బాలరాజూ నీవలన దేశానికి ఉపయోగం ఏమిటి అన్న మాట గుర్తుకు వస్తున్నది. ఇరాన్‌మీద జరుగుతున్న యుద్ధంతో మనకేం సంబంధం లేదు, మన మీద ఎలాంటి ప్రభావం పడదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్న తరుణంలో ఐఎంఎఫ్ నివేదిక వెలువడింది. ఒక్కసారిగా నాలుగో స్థానం నుంచి ఆరుకు దిగజారిందంటే మన వృద్ధి ఎంత బలహీనంగా ఉందో ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఆర్థిక స్థితి గురించి ఐఎంఎఫ్ ఏప్రిల్ నెలలో వేసిన అంచనాలు పరిస్థితిని వెల్లడించాయి. అయితే నాలుగు లేదా ఆరులో ఉన్నప్పటికీ సమీప దేశాలతో పోలిస్తే తేడాలు పెద్దగా లేవు. ఉదాహరణకు వంద నాలుగో స్థానం అనుకుంటే 101ఐదో స్థానం మాదిరిగా చెప్పుకోవచ్చు. తాజా ఐఎంఎఫ్ అంచనా ప్రకారం అమెరికా 32.38, చైనా 20.85, జర్మనీ 5.5, జపాన్ 4.38, బ్రిటన్ 4.26, భారత్ 4.15, ఫ్రాన్సు 3.27లక్షల కోట్ల డాలర్ల జిడిపి కలిగి ఉన్నాయి. అందువలన నాలుగు నుంచి ఆరు స్థానాల వరకు ఉన్న దేశాల్లో ఏ చిన్న మార్పు వచ్చినా వరుస మారుతున్నది. మన స్థానం ఎందుకు తగ్గుతున్నట్లు? పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు ఎన్ని స్టైరాయిడ్లు ఇచ్చినా ఫలితం ఎందుకు రావటం లేదు!

రూపాయి పతనం గురించి మోదీ, ఇతర బిజెపి నేతలు మన్మోహన్ హయాంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుకు తెచ్చుకుంటే ఆడపిల్లలకంటే ఎక్కువగా సిగ్గుపడిపోతారు గనుక ఇప్పుడు మాట్లాడటం లేదు, కిందపడినా గెలుపు మాదే అన్నట్లుగా ఉన్నారు. గతంలో రూపాయి పతనమైతే మన్మోహన్ సింగ్ చేతగాని తనం, అవినీతి అన్నారు. ఇప్పుడు మరోవిధంగా మాట్లాడుతున్నారు. నరంలేని నాలుకల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. వ్యవస్థ సంబంధిత సమస్యల కంటే రూపాయి మార్పులే జిడిపి స్థానం పడిపోవటానికి కారణమని, రానున్న సంవత్సరాలలో భారత్ పుంజుకుంటుందని ఐఎంఎఫ్ చెప్పింది. జోతిష్యాలన్నీ అలాగే ఉంటాయి.

ప్రపంచ జిడిపి లెక్కలన్నీ అమెరికా డాలర్లలోనే ఉంటాయి. అందువలన డాలర్‌తో ప్రతి దేశ కరెన్సీ విలువను బట్టి పరిస్థితి మారుతూ ఉంటుంది. మన దేశంలో ఉత్పత్తి ఉన్నది ఉన్నట్లుగానే ఉన్నప్పటికీ రూపాయి విలువ పతనమైతే విలువ పడిపోతుంది. గడిచిన ఏడాది కాలంలో రు.80లలో ఉన్న మారకం రు.90లోకి పతనమైంది.అందుకే డాలర్ల లెక్కలో మన జిడిపి తగ్గింది. ఇటీవల జరిగిన పరిణామాలన్నీ మన రూపాయి పాపాయి మీద వత్తిడిని మరింతగా పెంచాయి. దేశంలో ముడిచమురు ఉత్పత్తిలో మోదీ అధికారంలోకి వచ్చేనాటికి 37.4మిలియన్ టన్నుల నుంచి ప్రస్తుతం 25మి.టన్నులకు పడిపోయింది, సహజవాయు ఉత్పత్తి కూడా తగ్గింది. ఈ మేరకు విదేశీ దిగుమతుల మీద ఆధారపడాల్సి వస్తున్నది. దీనికిగాను డాలర్లు కావాలి, వాటిని కొనుగోలు చేయాలంటే మన రూపాయి విలువ పతనం అవుతున్నది. ఇటీవలి కాలంలో మన స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన వారు పెద్దమొత్తంలో లాభాలు దండుకొని వెనక్కు తీసుకోవటం కూడా డాలర్లు తరలిపోవటానికి ఒక కారణం. తన డాలరు పెత్తనాన్ని కాపాడుకొనేందుకు ఇరాన్ వంటి దేశాలనే తన గుప్పెట్లో పెట్టుకొనేందుకు చూస్తున్న అమెరికా తన కరెన్సీ విలువ పతనం కాకుండా చూస్తున్నది. భారత ఆర్థిక సంవత్సరం 2025–26లో మన వృద్ధి రేటు 6.5శాతం ఉన్నప్పటికీ కరెన్సీ విలువ పదకొండుశాతం పతనం కాగా జపాన్ ఎన్ 10, బ్రిటన్ పౌండ్ రెండు శాతాల చొప్పున పెరిగాయి. అందుకే స్వల్పంగానే అయినప్పటికీ అవి రెండు మనలను వెనక్కు నెట్టి పైకి వెళ్లాయి. మన జిడిపి లెక్కింపు ప్రాతిపదిక సంవత్సరాన్ని మార్చిన కారణంగా తగ్గిపోయినట్లు కొందరు చెబుతున్నారు, అదే వాస్తవం అయితే అంతకు ముందు పాత ప్రాతిపదిక సంవత్సరాన్ని తీసుకొని ఎక్కువగా చూపి జనాన్ని మభ్య పెట్టారని అనుకోవాల్సి ఉంది.

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం వలన మనకెలాంటి ఇబ్బంది లేదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భరోసా ఇస్తున్నారు. అలా జరగాలనే జనం కోరుకుంటున్నారు. అది నిజమా! ఇల్లు కట్టేటపుడు, పెళ్లి కుదిరిన తరువాత వాటిని పూర్తి చేసేందుకు అవసరమైతే ఎక్కడబడితే అక్కడ అప్పు తెచ్చి ముగించటం తెలిసిందే. తరువాతే అసలు కథ మొదలౌతుంది. యుద్ధ ప్రభావం కూడా అంతే. మనకు అవసరమైన ముడి చమురు దిగుమతులను తగ్గించటంలో మోదీ సర్కార్ విఫలమైంది. అవసరాలు పెరుగుతున్నపుడు దిగుమతులు కూడా పెరగాలి కదా అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఆత్మనిర్భరత నినాద కాలంలో మన స్వదేశీ ఉత్పత్తి 2014లో 38మిలియన్ టన్నులు ఉండగా ఇప్పుడు 25మి.టన్నులకు పడిపోయింది. అందువలన 88శాతం మేరకు దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. రోజుకు సగటున 50లక్షల పీపాలను కొనుగోలు చేస్తున్నాం. ఈ మొత్తంలో 40శాతం హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అవుతుంది. వంటగ్యాస్‌ను 91శాతం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు దీనికీ ఆటంకం ఏర్పడింది. విదేశాల్లో ఉన్న భారతీయులు వందమంది అనుకుంటే 50మంది గల్ఫ్ దేశాల్లోనే ఉన్నారు. వారు ప్రతిఏటా 15బిలియన్ డాలర్లు స్వదేశానికి పంపుతున్నారు. ఇప్పుడు ఎంత తగ్గిందో లెక్కలు తేలిన తరువాత మాత్రమే తెలుస్తుంది. యుద్ధానికి ముందు మనం సగటున 67డాలర్లకు ఒక పీపా దిగుమతి చేసుకుంటే అది 110 డాలర్లకు పెరిగింది. 2022 నుంచి దిగుమతి ధర తగ్గినప్పటికీ వినియోగదారులకు ఎలాంటి తగ్గుదల లేకుండా గోళ్లూడగొట్టి అధికమొత్తాలను వసూలు చేశారు. ఇప్పుడు పవర్ పెట్రోలు, పారిశ్రామిక అవసరాలకు వాడే డీజిల్ ధరలను మాత్రమే పెంచారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తరువాత మొత్తం చమురు, గ్యాస్ ధరలను పెంచుతారా లేదా అన్నది పెద్ద ప్రశ్న. ఎందుకంటే నరేంద్రమోదీ జిగినీదోస్తు డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడప్పుడే సంక్షోభాన్ని ముగించేట్లు లేదు. యుద్ధానికి ముందు రోజుకు 33.5కోట్ల డాలర్లను దిగుమతులకు ఖర్చు చేస్తుంటే ఆ మొత్తం ఇప్పుడు 55 కోట్ల డాలర్లకు పెరిగింది. నలభై ఐదు రోజుల యుద్ధ కాలంలో పెరిగిన అదనపు చమురు బిల్లు 970 కోట్ల డాలర్లు. ఇది మన కరెన్సీ 92వేలకోట్లకు సమానం. ముడి చమురు ధర ఒక పీపాకు పదిడాలర్లు పెరిగితే మన కరెంటు ఖాతా లోటు జిడిపిలో 0.4 నుంచి 0.5శాతం పెరుగుతుంది. గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతి చేసే టాంకర్ల బీమా ధరలు 400శాతం పెరిగాయి, రూపాయి విలువ నష్టం గురించి ముందే చెప్పుకున్నాం. చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో 40శాతం పెరిగాయి, మన రూపాయి విలువ 11శాతం తగ్గింది. దీంతో ప్రతి పీపాకు మనం చెల్లించాల్సిన మొత్తం 55శాతం పెరిగిందని అంచనా. మరింత సులభంగా చెప్పాలంటే యుద్ధానికి ముందు ఒక పీపాను మన రూపాయల్లో రు.5,695కు తెచ్చుకుంటే ఇప్పుడు రు.9,500 చెల్లించాల్సి వస్తోంది. ఈ మొత్తం జనాలు లేదా ప్రభుత్వం భరించాల్సిందే. మోదీ జనం మీద దయచూపుతారా? పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి వివిధ కారణాలతో మన విదేశీమారక ద్రవ్యం100 బిలియన్ డాలర్లు తగ్గింది. యుద్ధం కారణంగా వంటగ్యాస్ దిగుమతులు వెంటనే 30శాతం తగ్గాయి. దాంతో ఆందోళనకు గురైన ప్రభుత్వం చమురుశుద్ధి కేంద్రాలలో ఉప ఉత్పత్తులైన ప్రొపేన్, బుటేన్‌లను వంటగ్యాస్ తయారీకి మళ్లించాలని ఆదేశించింది, దాంతో 25శాతం మాత్రమే అదనంగా అందుబాటులోకి వచ్చింది. ఈ కారణంగా ఇప్పటికీ గ్యాస్ సరఫరా ఆలశ్యం అవుతున్నది. గ్యాస్ ధర రు.60 పెంచారు, సబ్సిడీ రు.40 రద్దు చేశారు, అంటే వంద రూపాయలు వడ్డించారు. మన భూగర్భ నిల్వల సామర్థ్యం 1.4లక్షల టన్నులే, రోజుకు 80వేల టన్నులు కావాలి గనుక రెండు రోజులకూ సరిపోదు. అందుకే వెంటనే కొరత ఏర్పడింది.

ఈ సంక్షోభం కారణంగా దాదాపు పన్నెండు బిలియన్ డాలర్ల మేర వ్యవసాయ ఉత్పత్తులు ముప్పులో పడినట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(జిటిఆర్ఐ) అంచనా వేసింది. నాలుగు లక్షల టన్నుల బాస్మతి బియ్యం రేవుల్లో నిలిచిపోయింది. కాండ్లా రేవులో అరటి పండ్లు పనికిరాకుండా పోయాయి. తేయాకు ఇరవైశాతం ఎగుమతులు ఆగిపోయాయి. ఇదే విధంగా మనం దిగుమతి చేసుకొనే ఆపిల్, ఇతర ఉత్పత్తులు కూడా ఆగిపోయాయి. దిగుమతి చేసుకొనే ఎరువులు నెల రోజులు ఆలశ్యం అవుతాయని, ఇప్పటికే 20 శాతం ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. పశ్చిమాసియా సంక్షోభంతో దేశ ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ఢోకా ఉండదని తొలిరోజుల్లో మాట్లాడిన అధికార పక్ష నేతలు ఇప్పుడు మౌనంగా ఉన్నారు. నీతి ఆయోగ్ తాజా నివేదికలో దేశ వాణిజ్యం, ఆర్థిక స్థిరత్వం గురించి చెబుతూ కరెంట్ ఖాతా లోటు పెరగనుందని చెప్పింది. దేశ ఎగుమతులు, దిగుమతుల్లో గల్ఫ్ ప్రాంత వాటా పన్నెండు శాతం ఉంది. యుఎఇ కి సరకులను పంపి అక్కడి నుంచి పశ్చిమాసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు తిరిగి ఎగుమతి చేస్తారు. ఇప్పుడు వాటికీ ముప్పు ఏర్పడింది. ఈ ప్రాంతం నుంచి మన ఎరువుల అవసరాల్లో 36శాతం, విలువైన రాళ్లు, లోహాలలో 32శాతం దిగుమతి చేసుకుంటున్నాము. మూడవ త్రైమాస కాలంలో యుద్ధంతో నిమిత్తంలేని సమయంలో మన వస్తు ఎగుమతులు కేవలం 1.6శాతం పెరగ్గా దిగుమతులు 7.9పెరిగాయి.

ముడి చమురు ధరలు పెరగటం, కొరతల కారణంగా వృద్ధి రేటు తగ్గి, ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు ఉందని ఏప్రిల్ ఎనిమిదిన ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా విధాన ప్రకటనలో పేర్కొన్నారు. ద్రవ్యోల్బణ లక్ష్యం నాలుగుశాతం కాగా 4.6శాతానికి పెరగవచ్చని ఆర్‌బిఐ పేర్కొన్నది. నెల రోజుల పాటు రష్యన్ చమురు కొనుగోలు చేసేందుకు అమెరికా " అనుమతి" ఇచ్చింది. అయితే గతంలో ట్రంప్ బెదిరించిన కారణంగా మనం దిగుమతులు తగ్గించిన కారణం కావచ్చు, మార్కెట్‌లో డిమాండ్ ఇతర కారణాలతో గతంలో రష్యా ఇచ్చిన రాయితీలు ఇప్పుడు లేకపోగా అదనంగా చెల్లించి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ప్రపంచ మార్కెట్ కంటే పీపాకు పదిహేను నుంచి ఇరవై డాలర్లు తక్కువగా రాయితీ ధరలకు రష్యా ముడిచమురును అందచేస్తే దాన్నుంచి ఉత్పత్తులు తయారు చేసి అంబానీ, నయారా కంపెనీలు విదేశాలకు లాభాలకు అమ్ముకున్నాయి తప్ప మన వినియోగదారులకు ఒక్క పైసా కూడా తగ్గించలేదు. ఇప్పుడు గతరాయితీలు పోగొట్టుకొని ప్రామాణిక బ్రెంట్ రకం కంటే రెండు నుంచి నాలుగు డాలర్లు ఎక్కువగా చెల్లించాల్సి వస్తోంది. అతి తెలివి ప్రదర్శిస్తే వ్రతమూ చెడుతుంది, ఫలితమూ దక్కదు! మొత్తంగా పన్నెండేళ్ల పాలన తీరు తెన్నులను చూస్తే మన్మోహన్ సింగ్ హయాంలో యుపిఎ ఎదుర్కొన్న తీవ్ర పరిస్థితులు తిరిగి వస్తున్నాయా? అనిపిస్తుంది.

# సమ్మె పోరాటంతో ఆర్టీసి కార్మిక విజయం!

సమ్మె చేస్తున్న ఆర్టీసి కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి మెజార్టీ డిమాండ్లను అంగీకరించటంతో, ఆర్టీసి సమ్మె సుఖాంతంగా ముగిసింది ఆర్టీసి విలీనానికి కమిటీ! జూన్ 2 వరకు ప్రభుత్వంలో ఆర్టీసి ఉద్యోగుల విలీన ప్రక్రియ పూర్తి .. ఇకపై ఆర్టీసిని ప్రజా రవాణా విభాగం క్రిందికి తీసుకొస్తున్నట్లు.. ప్రస్తుతం ఆర్టీసిలో పనిచేస్తున్న 38,300సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా మారుతారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించటాన్ని కార్మిక సంఘాలు హర్షిస్తున్నాయి.

బిఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసి ని ప్రభుత్వంలో విలీనం చేస్తూ వారితోపాటు ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ 53 రోజులపాటు సమ్మెచేశారు. ఆ సందర్భంగా ఆనాటి ప్రభుత్వం ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని వాగ్దానం చేసింది. దానికి సంబంధించిన విధి విధానాలు గజెట్ నోటిఫికేషన్ చేయలేదు. పోగా సమ్మె సందర్భంగా ఆర్టీసీలో ఉన్న సంఘాలను నిషేధించింది. 2013 నుండి రావలసిన ఇంక్రిమెంట్లు, 2017లో వేతన సవరణతో పాటు అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటూ వస్తున్నాయి.

**ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు :**

2023లో ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ, వారికి రావలసిన 2017, 2023 వేతన సవరణతో పాటు ఇంక్రిమెంట్లు ఇస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్టీసి కార్మికులు ఈ ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసుకుంటూ వస్తున్నారు.. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున కొంత టైం ఇస్తూ వస్తున్నారు. 2025మే లో వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసు కూడా ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ హామీతో ఇంకా కొంతకాలం ఓపిక పడుతూ.. తిరిగి 2026లో 6 సంఘాలతో ఏర్పడిన ఆర్టీసీ జెఎసి మార్చి 13న ఆర్టీసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వటం జరిగింది.

ప్రధానమైన డిమాండ్లలో 2021, 2025 వేతన సవరణతోపాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని డిమాండు ఉండటంతో.. ఈ డిమాండ్లు పరిష్కరించే దశలో ఆర్టీసి యాజమాన్యం లేదు. రాష్ట్ర లేబర్ కమిషన్ ముందు ఒకటి, రెండు సమావేశాలు జరిగినప్పటికీ.. ప్రభుత్వమే పరిష్కరించాలని యాజమాన్యం చేతులు ఎత్తేసింది. చివరికి రవాణా మంత్రి సమక్షంలో చర్చలు జరిపినప్పటికీ ఈ డిమాండ్ల పరిష్కారానికి 4 గురు ఐఎఎస్ అధికారులతో కమిటీ వేసి పరిష్కారానికి నాలుగు వారాలు గడువు కోరింది. దీంతో గత్యంతరంలేని పరిస్థితులలో ఆర్టీసిజెఎసి కార్మిక సంఘాలు ఈనెల 22 మొదటి షిఫ్ట్ నుండే సమ్మెలోనికి వెళ్లారు. యాజమాన్యం ప్రభుత్వం సమ్మెను విచ్చిన్నం చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను, హయ్యర్ బస్సులను, తాత్కాలిక డ్రైవర్లు కండక్టర్లను తీసుకొని నడపొచ్చనే ఏర్పాట్లుతోఉన్నారు.

ఆర్టీసి జెఎసి కార్మిక సంఘాలతో పాటు జెఎసిలో లేని సంఘాలు కూడా సమ్మెకు మద్దతునిచ్చాయి. 100% బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సమ్మె రెండో రోజు చేరుకునే వరకు వారి మద్దతుగా రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించారు. అన్ని డిపోల వద్ద ధర్నాలు, ప్రదర్శన లు ఒకవైపున నడుస్తుంటే.. పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి బస్సులు తీసే ప్రయత్నం యాజమాన్యం చేపట్టింది. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలతో ఉద్రేకపడిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినాడు. 80 శాతం కాలినగాయాలతో హాస్పిటల్స్ లో చికిత్స పొందుతూ తుదివిశ్వాస విడిచారు. దీంతో కోపోద్రిక్తులైన ఆర్టీసి కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల ముందు నిరస న ప్రదర్శనలతో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయికి చేరుకున్నది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను ఏప్రిల్ 24న చర్చలకు పిలిచి మొదటిదఫా అధికారులతోనూ, రెండో దఫా మంత్రుల కమిటీతో సుదీర్ఘంగా 12 గంటల పాటు చర్చలు జరిపి కోర్కెలు అమలు చేయుటకు ఒప్పుకున్నది.

**సమ్మె వివరణ – విజయోత్సవాలు :–** ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించటంతో మూడు రోజులుగా కొనసాగిన ఆర్టీసి కార్మికుల సమ్మె ప్రశాంతంగా ముగిసినట్టు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఈ మేరకు ఏప్రిల్ 24 న అర్ధరాత్రి సచివాలయంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్, లక్ష్మణ్ కుమారులతో కూడిన మంత్రుల బృందం మరియు ఆర్టీసీ కార్మిక సంఘాల జెఎసి నేతలమధ్య ప్రధానమైన డిమాండ్లయిన ప్రభుత్వంలో ఆర్టీసి ఉద్యోగుల విలీనం, 2021,2025 వేతన సవరణలతో పాటు ఒప్పందం కుదిరింది. ప్రభుత్వంపై దాదాపు రూ.వెయ్యి కోట్ల భారం పడనున్నదని తెలిపింది. అయినా ప్రభుత్వ ప్రయాణరంగ సంస్థ అయిన ఆర్టీసిని కాపాడుకుంటూ బలోపేతం చేస్తామని మంత్రులు ప్రకటించారు. ఏప్రిల్ 25 నుండి బస్సులు యధావిధిగా నడుస్తున్నాయి.. కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున విజయోత్సవ సభలు, ర్యాలీలు నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు.

**వేతన సవరణ రూ.370 కోట్లు:** ఆర్టీసి ఉద్యోగులకు తాజాగా ప్రభుత్వం ఆమోదించిన వేతన సవరణ ప్రభావం సంస్థపై సాలీనా రూ.378 కోట్లుగా ఉంటుందని అధికారులు తేల్చారు. దీనితోపాటు 2021 ఏప్రిల్ నుంచి దీన్ని వర్తింప చేయాల్సి ఉన్నందున అప్పటినుంచి ఇప్పటివరకు బకాయిల రూపం లో మరో రూ.1800 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో అంత మొత్తాన్ని భరించటం ఆర్టీసి వల్ల కాదని ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించాలని ఆర్టీసి అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 2017 వేతన సవరణకు సంబంధించిన బకాయిలు చెల్లించటం ఆర్టీసికి ఇబ్బందిగా మారింది. ఇప్పుడు వాటికి తాజా బకాయిలు తోడయ్యాయి. దీంతోపాటు మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి తక్కువ మొత్తమే రియంబర్స్ అవుతుంది. దీన్ని కూడా పెంచాలని ఆర్టీసీ కోరుతుంది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దాదాపు రూ.వెయ్యికోట్ల రీఇంబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయాయి.

**11 శాతాన్ని ఫిట్‌మెంటుగా ఖరారు:**

30 శాతాన్ని ఫిట్మెంట్ ఇవ్వాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు కోరుతూ వస్తున్నాయి. ఆర్టీసీ తొలుత 7 శాతం ప్రతిపాదించి, తరువాత 8 శాతం చివరకు 11 శాతాన్ని ఖరారు చేశారు. 2017 వేతన సవరణకు సంబంధించి గత ప్రభుత్వం 16% మధ్యంతర భృతి ఖరారు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దానికి మరో ఐదు శాతం చేర్చి 21 శాతం ఫిట్మెంట్ను ఖరారు చేసింది. ఇప్పటికే 2025 వేతన సవరణ కూడా పెండింగ్‌లో ఉంది.

తాజా సమ్మె మూడు రోజులపాటు కొనసాగగా ఆ రూపంలో ఆర్టీసికి రూ.65 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, బస్సులు నడవకపోవడంతో మహాలక్ష్మి పథకం కింద మహిళా ప్రయాణికుల ద్వారా వచ్చే టికెట్ రెయంబర్స్మెంట్ రాదు, ఇటు రెవిన్యూ రాక పోవడంతో 3 రోజులు భారీ మొత్తం నష్టం వాటిల్లిందని యాజమాన్యం ప్రకటించింది.

ప్రభుత్వంలో విలీనానికి సంబంధించి మంత్రులు సానుకూల నిర్ణయాన్ని ప్రకటించినప్పటికీ విలీన ప్రక్రియ కు సంబంధించి తుది నిర్ణయం తీసుకునేందుకు గాను అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కూడిన ఉమ్మడి కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కార్మిక సంఘాల ప్రతినిధులను.. కార్మిక సంఘాల కు ఎన్నికలు జరిపి గుర్తింపు సంఘాల ప్రతినిధులతోను.. ప్రభుత్వ అధికారులతోనూ కమిటీ వేసి.. కమిటీ ఎంతకాలంలో నివేదిక ఇవ్వాలనే విధివిధానాలను ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. కార్మిక సంఘాల పునరుద్ధరణకు కూడా మంత్రులు ఆమోదించారు. దానికి సంబంధించి కూడా విధివిధానాలు రావాల్సి ఉంది. అయితే 11% పిఆర్సి ప్రకటించటం, 2017 నుండి రావాల్సిన ఇంక్రిమెంట్స్, కార్మిక సంఘాలను గుర్తించి ఎన్నికలు నిర్వహించడం ఘనవిజయంగా కార్మికులు భావించుచున్నారు.

**ఉజ్జిని రత్నాకర్ రావు,** 9490952646,
ఎఐటియుసి సీనియర్ నాయకులు

## ప్రజావాణికి 128 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 128 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో పాటు జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్‌డీఓ సాయన్నలకు, డీపీఓ శ్రీనివాస్‌రావు, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్లతో మంత్రి భేటీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ సోమవారం ఉమ్మడి జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశంలో పాల్గొన్న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ తదితరులున్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్



**ప్రజాపక్షం / గజ్వేల్:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ పేర్కొన్నారు. సిఈఓ జి తేందర్ రెడ్డితో కలిసి సోమవారం మజీద్ పల్లి, అంబర్ పేట, వే లూరు, నాచారం, మైలారం, వర్గల్, తునికి ఖల్సా, నెంటూర్, పాములపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించే పంటలు దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 బోనస్ ఇస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. ధాన్యానికి రూ 2389/ రెండవ రకం ధాన్యానికి రూ రూ. 2369/ ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు చెప్పారు. రైతులను చైతన్యం చేస్తే హరీష్ ఆర్థికంగా తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం అని వివరించారు. సర్పంచ్లు, నేతలు చెన్నయ్య, కుమార్, యాదగిరి, రాజశేఖర్ రెడ్డి, కొండల్ రెడ్డి, సాయిగౌడ్ పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరం

మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్స రమేష్



**ప్రజాపక్షం / మందమర్రి :** యువత చెడు వ్యసనాలకు లోనవకుండా జాగ్రత్తగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్స రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం మందమర్రి ఐటిఐ కళాశాలలో నిర్వహించిన బాలల భద్రత మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు చీకటిమయమవుతాయని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, సామాజిక ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై కఠిన చట్టాలు ఉంటాయని స్పష్టం చేశారు. బాలల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను సంప్రదించాలని కోరారు. మందమర్రి ఎస్ఐ నరేష్, కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**ప్రజాపక్షం / తిర్యాని :** తిర్యాని మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మం డలంలో చేపట్టిన ప్రత్యేక తనిఖీలలో భాగంగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేసే వారిపైచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చే శారు. ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుకను తరలించాలన్నా తప్పనిసరిగా అనుమతి పత్రాలు, లబ్ధిదారుల వివరాలు ఉండాలని సూచించారు. కొందరు ప్రభుత్వ ఇళ్ల పేరు చెప్పి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని ఉపేక్షించబోమని తెలిపారు. తప్పుడు వివరాలతో ఇసుక తరలిస్తే వాహనాలను జప్తు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మే 10వ తేదీ లోపు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** మే 10వ తేదీ లోపు డబల్ బెడ్ రూం ఇండ్లను ఉమ్మడి జిల్లాలో పేదలకు అందించే విధంగా చూస్తామని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాకు హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ నుండి ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ళపై గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొని నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా నాగారంతో పాటు కొత్త కలెక్టరేట్ వద్ద ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని కోరారు. ఇప్పటికే పూర్తయిన ఇళ్లు మరమ్మతులకు గురవుతున్నాయని, గతంలోపలు వస్తువులు చోరీకి గురి కాగా వాటిని మరమ్మతులు చేసి కేటాయించకపోవడంతో మళ్ళీ అదే దుస్థితి నెలకొందన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒక ఇల్లు కూడా కేటాయించలేదని, అర్హులైన పేదలు ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారన్నారు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించి అర్బన్ నియోజకవర్గంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ళను మే 10వ తేదీ లోపు కేటాయిస్తామని అర్బన్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. నాగారంలోని బేస్మెంట్ లెవెల్‌లో ఉన్న వాటిని కూడా అతి త్వరలో పూర్తి చేసి అందజేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పిడి పాల్గొన్నారు.



## 'మేడే' పోస్టర్ల ఆవిష్కరణ




**ప్రజాపక్షం/బాల్కొండ :** పోరాడితే పోయేది ఏమి లేదు బానిస సంకెళ్లు తప్ప, రద్దు చేయాలి నాలుగు లేబర్ కోడ్లను, అమెరికా ఇరాన్‌పై చేస్తున్న దాడులను ఖండించాలనే నినాదాలతో టియుసిఐ ఆధ్వర్యంలు ముప్కాల్ పట్టణ కేంద్రంలోని సిజె బీడీ కంపెనీలో మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ముత్తెన్న మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకుని యుద్ధాన్ని శాశ్వతంగా ఆపివేసేలా చూడాలని డిమాండ్ చేశారు. నజీర్, నిఖిల్, రాజేశ్వర్, సునీల్, జ్ఞానేశ్వర్, ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కు అర్జీలను అందజేశారు.కలెక్టర్ స్వయంగా అర్జీదారుల నుండి పిర్యాదులను స్వీకరించి ఒక్కొక్కరి సమస్యను నేరుగా తెలుసుకున్నారు. తక్షణం పరిష్కరించ గలిగిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరంచేందుకు చర్యలు తీసుకున్నారు. మిగిలిన పిర్యాదులను సంబందిత శాఖల అధికారులకు అందజేసి వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదేశించారు.ప్రజల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



ప్రజల సమస్యల పరిష్కారంలో భాద్యత తో వ్యవహరించాలని అన్నారు. విద్యార్థుల భద్రత రక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటూ మండల ఆఫీసర్లు సంబందిత జిల్లా అధికారులు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను ప్రతి శుక్రవారం కనీసం రెండు సార్లు సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని , వారి సమస్యలను నేరుగా తెలుసుకుని వసతి సౌకర్యాలను ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రదానంగా రెవెన్యూ భూ సమస్యలు ,హౌసింగ్ ,పంచాయతీ రాజ్ ,డి డబ్ల్యు ఓ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ , డిఆర్డీ ,ఎక్సైజ్ ఉపాది కల్పన ,ఇరిగేషన్ ,విద్య, ఫీషరిస్, విద్యుత్ తదితర శాఖలకు సంబందించిన పిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు మాదురి, పాండు , వివిధ శాఖల జిల్లా అధికారులు ,మున్సిపల్ కమీషనర్లు ఆర్జిదారులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ రెసిడిన్షియల్ ఇన్స్‌ట్యూషన్ వార్షికోత్సవం

ముఖ్య అతిథిగా
మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండల బుదేరాలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఇన్సిట్యూషన్ వార్సికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్‌సి ఎస్‌టి లను ప్రవేశపెట్టామన్నారు. అందులో భాగంగా ఉమ్మడి రా ష్ట్రంలో తెలంగాణ ,ఆంధ్ర ,రాయలసీమ ప్రాం తాలలో మూడు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించామన్నారు. తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటి రెసిడెన్సియల్ స్కూల్ అందోల్ నియోజకవర్గంలోని బుదేరాలో ప్రారంభించడం జరిగిందన్నారు. బుదేరా రెసిడెన్సియల్ స్కూల్ లో డిజిటల్ విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం ఆదునిక బెడ్స్ వేర్స్ అందించమన్నారు. విద్యార్థినులకు అసరాల కోసం ఉజ్వల భవిష్యత్తు బలమైన పునాది కోసం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాదాన్యత ఇస్తున్నామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్లో క్రీడా సదుపాయాలు కల్పనకు డిజిటల్ లైబ్రరీ పుస్తకాలను సమకూర్చామని మంత్రి వెల్లడించారు. బుదేరా రెసిడెన్షియల్ స్కూల్ భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ రెసిడిన్షియల్ స్కూల్‌గా అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆకాంక్షించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో విద్యా,వైద్య రంగాల అభివృద్దికి ఎంతో ప్రాదాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య ,మెరుగైన విద్య సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అందోల్ నియోజకవర్గం విద్య, వైద్య రంగాల హబ్‌గా అబివృద్ది చెందుతున్నారన్నారు. ఆధునిక మౌళిక సదుపాయాలను కలిస్తున్నామన్నారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినిలతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థిని లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విద్యార్థినులకు మెడల్స్ ప్రశంస పత్రాలను అందజేశారు.



## శ్రామిక 'మేడే'ను జయప్రదం చేయాలి

టియూసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజన్న

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** దురాక్రమణ యుద్ధ భారాలకు వ్యతిరేకంగా మరియు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియూసిఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రాజన్న పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో 140వ మే డే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ 1986 సంవత్సరంలో చికాగో నగర వీదుల్లో కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినం అమలవుతోందని గుర్తు చేశారు. శ్రామిక వర్గ పోరాటాల ద్వారా సాధించుకున్న సుత్తికొడవలి జెండా కార్మికుల త్యాగాలకు ప్రతీక అని ఆయన కొనియాడారు. అయితే ప్రస్తుత పాలకులు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తు శ్రమ దోపిడిని తీవ్రం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఐటి రంగం, పరిశ్రమలు షాపింగ్‌మాల్స్ మరియు స్విగ్గి , జోమాటో వంటి డెలివరీ సంస్థల్లో పనిచేస్తున్న శ్రమజీవులతో 10 గంటల పాటు పని చేయించుకునేలా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణలు చేయడం మే డే స్ఫూర్తి విఘాతం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక డిపార్టుమెంట్ ట్రన్సుఫర్మార్ వాహనాలను అందుబాటులోకి తెచ్చినట్లు నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.ఈ. సుభాష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సర్కిల్ పరిధిలోని ప్రతి డివిజన్ మరియు సబ్ డివిజన్‌లో ఈ వాహనాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. జిపిఎస్ ద్వారా పర్యవేక్షణ ఈ ప్రత్యేక వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ సౌకర్యాన్ని కల్పించామని దీనివల్ల వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు సత్వర సేవలు అందించడం సాధ్యమవతుందని ఎస్.ఈ వివరించారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా లేదా సాంకేతిక సమస్య తలెత్తినా, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే 100 శాతం డిపార్టుమెంటు వాహనాల ద్వారానే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు మరియు అమరిక జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

వ్యవసాయ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సుభాష్ యాదవ్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్లర్ దెబ్బతిన్నా సందర్భాల్లో ఆలస్యం లేకుండా వెంటనే మరమ్మత్తులు చేయడం లేదా ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయడం కోసం ఈ వాహనాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. రైతులకు రవాణా ఇబ్బందులు తప్పడమే కాకుండా సమయానికి సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులు స్వయంగా ట్రాన్స్‌ఫార్లర్ లేదా విద్యుత్ పరికరాలను తాకరాదని, ఏదైనా సమస్య ఉంటే సమీప అధికారులకు లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# నిర్మల్ జిల్లాలో గాంజాపై ఉక్కుపాదం

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** జిల్లాలో మారక ద్రవ్యాల మహమ్మారిని పూర్తిగా అంతం చేయడమే లక్ష్యంగా నిర్మల్ పోలీసులు ప్రత్యేక కార్యచరణను ప్రారంభించారు. 99 రోజుల ప్రజా ప్రణాళిక భాగంగా గాంజా వినియోగం మరియు అక్రమ రవాణపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్‌పి డా.జి. జానకి షర్మిల, ఐపిఎస్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె గాంజా గస్తీ బ్యానర్‌ను ఆవిష్కరించి, జిల్లా పోలీసు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

యువత భవిష్యత్తు కోసం నిర్ణయాలు

ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, గాంజా వంటి వ్యసనాల వల్ల యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గాంజా విక్రయాలు, నిల్వలు మరియు రవాణాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని సరిహద్దు ప్రాంతాల్లో మరియు అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు.




అవగాహనతో కూడిన నివారణ

కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా, విద్యా సంస్థలు మరియు గ్రామాల్లో యువతకు మారకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. గాంజాను పూర్తిగా తరిమికొడదాం, జిల్లాలో మారకద్రవ్యాలకు చోటు లేకుండా చేస్తాం అని ఆమె ఈ సందర్భంగా గట్టిగా నొక్కి చెప్పారు.

ప్రజల భాగస్వామ్యం కీలకం

గాంజా రహిత జిల్లాగా నిర్మల్‌ను తీర్చిదిద్దడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని ఎస్‌పి పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమంగా గాంజా విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, నిర్భయంగా ముందుకు వచ్చి సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోలీసుల ఈ నిరంతర నిఘా మరియు తనిఖీల వల్ల జిల్లాలో మారకద్రవ్యాల సరఫరా గొలుసును తెంచేయడం సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు

# మహారాష్ట్రకు 'రేషన్ బియ్యం' తరలింపు

అధికారుల 'మామూలు' నిర్లక్ష్యం !

**ప్రజాపక్షం / నిర్మల్ సారంగాపూర్ :** ప్రభుత్వం నిరుపేదల ఆకలి తీర్చడం కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కుల పాలిట వరంగా మారుతోంది. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి పొరుగు రాష్ట్రమైన మహారష్ట్రకు రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలిపోతోంది. అక్రమ రవాణాను అరికట్టాల్సిన సంబంధిత పౌరసరఫరాల శాఖ పోలీస్ అధికారులు 'మామూళ్ళ' మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పల్లెల్లో నిరుపేదలకు అందాల్సిన అన్నం గింజలు, నల్లబజారులో కాసులు కురిపిస్తున్నాయి.

మూడు నెలల కోటా.. అక్రమార్కులు జోరు

ప్రభుత్వం ఇటీవల లబ్దిదారులకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో ఈ అక్రమ దందాకు మరింత రెక్కలు వచ్చాయి. నిరుపేదల నుంచి తక్కువ ధరకే బియ్యాన్ని సేకరిస్తున్న దళారులు, వాటిని భారీ వాహనాల్లో నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రం నుండి స్వర్ణ ప్రధాన రహదారి గుండా మహారాష్ట్రలోని శివుని కేంద్రంగా ఈ రవాణా నిరంతరం కొనసాగుతోంది. పట్టపగలే భారీ వాహనాల్లో లోడ్లు వెళ్తున్నా, ప్రధాన రహదారులపై గస్తీ ఉండాల్సిన అధికారులు కళ్ళు మూసుకోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సారంగాపూర్ మీదుగా సేఫ్ రూట్

నిర్మల్ జిల్లా కేంద్రానికి సరిహద్దులు కూతవేటు దూరంలో ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ముఖ్యంగా సారంగాపూర్‌మండల కేంద్రం మీదుగా వెళ్లే రహదారిని వీరు సేఫ్ రూట్‌గా మార్చుకున్నా రు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నామ మాత్రంగానే సాగుతుండటంతో మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఈ దందా విరాజిల్లుతోంది. రాత్రి సమయాల్లోనే కాకుండా, ఇప్పుడు పట్టపగలే యథేచ్ఛగా వాహనాలు సరిహద్దులు దాటుతున్నాయంటే, అధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రకటనలకే పరిమితమైన హెచ్చరికలు

అక్రమ బియ్యాన్ని అరికడతామని, రవాణా చేసే వాహనాలను సీజ్ చే సి కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ఇచ్చే ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అప్పుడప్పుడు జిల్లాలో ఎక్కడో ఒకచోట నామ మాత్రపు తనిఖీలు చేసి ఏదో ఒక చిన్న వాహనాన్ని పట్టుకుని చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కానీ, కోట్ల రూపాయల విలువైన బియ్యం, నల్ల బజారుకు తరలుతున్నా పెద్ద తిమింగతలాలను మాత్రం అదికారులు పట్టుకోవడం లేదన్నది బహిరంగ రహస్యం.

ఇకనైనా మేల్కొంటారా ?

జిల్లాలో జరుగుతున్న ఈ భారీ కుంభకోణంపై ఉన్నతాధికారులు ప్ర త్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా నిర్మల్ జిల్లా నుండి కోట్ల రూపాయల విలువైన ప్రజా ధనం పక్కదారి పడుతోంది. ఇప్పటికైనా అధికారులు మామూళ్ళ మత్తు వదిలి, క్షేత్రస్థాయిలో కఠిన తనిఖీలు నిర్వహించాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న కింగ్‌ఫిన్‌లను కటకటాల్లోకి నెట్టాలని జిల్లా ప్రజానికం కోరుతోంది. లేని పక్షంలో పేదల బియ్యం పేరు మార్చుకుని మహారాష్ట్ర మిల్లుల్లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.



## వేగవంతంగా ధాన్యంను కొనుగోలు

జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వహకులను వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండల కేంద్రంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను సోమవారం కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యనంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీశ్‌తో కలసి ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం కొనుగోలు వివరాలను అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్నీబ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 880 మంది రైతుల నుంచి 4270.040 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని 38 మంది రైతులకు 42లక్షల రూపాయలు అకౌంట్‌లో జమచేశామన్నారు. మూడు దశల్లో టోకెన్ పద్దతిని పెట్టడం జరిగిందని తెలిపారు.

## మోసపూరితంగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న కూతురు



ప్రజాపక్షం/ సిద్దిపేట : వృద్ధాప్య పింఛన్ కోసం సంతకం చేయాలని చెప్పి మోస పూరితంగా తన వ్యవసాయ భూమిని కన్న కూతురు రిజిస్ట్రేషన్ చేయించుకుందని ఒక వృద్ధుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితుడు ఎల్లంకి కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నంగునూరు మండల పాలమాకుల గ్రామంలోని సర్వేనెంబర్ 251లో 3ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తనకు 5గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. నాల్గవ కుమర్తె ఒంటరి మహిళ కావటంతో సదరు భూమిని కేటాయించినట్లు తెలిపారు. రెండవ కుమార్తె అరుణ వృద్ధాప్య పింఛన్ కోసం సంతకం చేయాలని చెప్పి సిద్దిపేటకు తీసుకెళ్లి సదరు భూమిని గిఫ్ట్ డిడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఆ విషయం నాకు తెలియకుండ సుమారు ఒక సంవత్సరం పాటు నన్ను వారితో ఉంచుకున్నట్లు తెలిపారు. విషయం తెలిసిన తర్వాత ప్రశ్నించగా స్వగ్రామంలో వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిపారు.గ్రామస్తులు పిలిచిన వారు స్పందించలేదన్నారు. తమ రెండవ కుమార్తె గ్రామం తుప్రాన్‌కు వెళ్లి అడగగా వారు మాపై కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి మోసపూరితంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తన భూమిని తిరిగి తన పేరిట మార్చాలని ఎల్లంకి కిష్టారెడ్డిని కోరారు.

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే విదంగా అధికారులు పని చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ లు, ఆర్డీఓ లతో కలిసి కలెక్టర్ స్వీకరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 63 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జనాభ లెక్కల స్వీయ గణన 2027 పై జిల్లా స్థాయి అధికారులకు డెమో క్లాస్ నిర్వహించారు. తదుపరి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ వారం బాలల పరిరక్షణ, డ్రగ్స్ రహిత సమాజం కార్యక్రమాలు ఉన్నందున జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీస్ శాఖను చేరువ చేయడమే లక్ష్యం: ఎస్పి



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడం ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పలు ఫిర్యాదులను పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై న్యాయపరంగా, పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.చట్ట పరిధిలోకి వచ్చే సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, విచారణలో ఎటువంటి లోపం ఉండకూడదని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులను స్వీకరించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించడం జరుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఉన్నారు.

## విలీన గ్రామాల డివిజన్ల అభివృద్ధే లక్ష్యం



ప్రజాపక్షం/కరీంనగర్ : విలీన గ్రామాల డివిజన్లను అభివృద్ధి చేయడమే లక్ష్యం గా మా పాలకవర్గం పని చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా సోమవారం రోజు 23 వ డివిజన్ లో మేయర్ పర్యటించారు. నగరపాలక సంస్థకు చెందిన 49.90 లక్షల సాధారణ నిధులతో సీతారాంపూర్ ప్రాంతంలోని పలు కాలనీల్లో 300 మీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం పనులకు స్థానిక కార్పోరేటర్ గుమ్మడి రాజ్ కుమార్ తో కలిసి భూమీ పూజ చేసి పనులు ప్రారంబించారు. చేపట్టిన పనుల వేగవంతం, నాణ్యత ప్రమాణాల పై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ముఖ్యంగా సీతారాంపూర్ తో పాటు విలీన గ్రామల డివిజన్ల లో సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో విలీనం చెందిన గ్రామాల డివిజన్ల తో పాటు ఇటీవల నగరపాలక సంస్థ లో కలిసిన గ్రామాల డివిజన్ల కు కూడ నిధులను కేటాయించి, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజలు, కార్పోరేటర్లు మా దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు ఓంటెల సత్యనారాయణ, భారీ అపర్ణ జితేందర్, ఇంజనీరింగ్ అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

**సన్నవడ్లకు బోనస్ చరిత్రాత్మకం**
**ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**



ప్రజాపక్షం/సుల్తానాబాద్: రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లి, గొల్లపల్లి,సాంబయ్య పల్లి, దుబ్బ పల్లి, ఐతరాజ్ పల్లి, గర్రెపల్లి, బొంతకుంటపల్లి గ్రామాలలో సోమవారం సాయంత్రం సింగిల్ విండో ద్వారా ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా పెద్దపల్లి నియోజకవర్గం లో రైతులెవరు నష్టపోవద్దని సంకల్పంతో ఎలాంటి కటింగులు లేకుండా కొనుగోల్లు చేపడుతున్నట్టు చెప్పారు. సుల్తానాబాద్ మండలంలోని 16 కోట్ల పైచిలుకు బోనస్ రైతులకు వచ్చిందని తెలిపారు. గత వర్షాకాలంలో 8 కోట్ల 71 లక్షలు వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. సన్న వడ్లకు బోనస్ అందిస్తున్న ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కింది అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కటింగ్ పేరుతో నిలువు దోపిడి చేశారని,10 కిలోల నుండి 15 కిలోల వరకు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. అలాంటివి ఏవి లేకుండా నేడు ఐదు పసళ్ళు గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేశామని తెలిపారు. రైతులు ప్రభుత్వం సూచించిన విధంగా వరి ధాన్యానికి 15% మ్యాచర్ వచ్చేలా చూడాలని కోరారు. జిల్లా కలెక్టర్, వ్యవసాయ, సింగల్ విండో తదితర అధికారులు అందుబాటులో ఉన్నారని రైతులు ఎవరు ధైర్యపడవద్దని, రైతులకు వడగళ్ల వానలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని సంచులు కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అలాగే రైతుల వివిధ రకాల ధాన్యానికి సంబంధిత రేట్లను సూచించే పట్టికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి దాన్యపు గింజ కొనుగోలు చేస్తామని ఆ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, ఆయా గ్రామాల సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జానీ,పడాల అజయ్ గౌడ్, పన్నాల రాములు,తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా.. సంక్షేమ వారం పటిష్టంగా నిర్వహించాలి




ప్రజాపక్షం/సిద్దిపేట: 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిలో భాగంగా ఎప్రిల్ 27 నుండి మే 2 వరకు బాలల భద్రత రక్షణ పట్ల మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సంక్షేమ వారం పటిష్టంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమివతి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),జిల్లా సంక్షేమ శాఖ అధికారులు,పోలీస్,వివిధ జిల్లా శాఖ అధికారులతో కలిసి దత్తత సహయ కేంద్రం (అడాప్షన్ హెల్ప్ డెస్క్),ఊయల కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ బాలల భద్రత రక్షణ పట్ల మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సంక్షేమ వారం పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి శారద,బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ మమత,జిల్లా బాలల రక్షణ అధికారి రాము,శాంతి మాసిక వైద్య నిపుణురాలు జిజిహెచ్ సిద్దిపేట,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు వేగవంతంగా చేయాలి

**సుగ్లంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రల్లో కలెక్టర్ ఆకస్మికగా తనిఖీ**



ప్రజాపక్షం/సుల్తానాబాద్: రైతుల నుండి ధాన్యం కొనుగోలు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు.సోమవారం సుల్తానాబాద్ మండలంలోని సుగ్లంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సుల్తానాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చే ధాన్యం తప్పనిసరిగా ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో తూకం,తేమ శాతం కొలతలు సక్రమంగా నిర్వహించాలని,ఎలాంటి ఆలస్యం లేకుండా రైతులకు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో డి. ఎం.శ్రీకాంత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

**ప్రజావాణి అర్జీదారులకు ఉచిత మజ్జిగ పంపిణీ**

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు, డీసీపీ రాంరెడ్డి తో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుండి తమ సమస్యల విన్నపం కోసం కలెక్టరేట్‌కు వచ్చే సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఉచిత మజ్జిగ పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకంటే ముందు, కలెక్టరేట్ ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిషన్ వాత్సల్య బాలల పరిరక్షణ సేవలు స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జి.కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## కోరుట్ల కాంగ్రెస్‌లో ముదురుతున్న అసంతృప్తి

**నామినేటెడ్ పదవులు సీనియర్లకే ఇవ్వాలి**
**నాయకత్వ లోపంపై సీనియర్ల ధ్వజం!**
**వలస నేతలకే అధిక ప్రాధాన్యతపై ఆగ్రహం**



ప్రజాపక్షం/మెట్‌పల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తోందని, పార్టీ పటిష్టత కోసం అధిష్టానం తక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక నేతలు డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా కోమిరెడ్డి జ్యోతి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇప్పటివరకు పార్టీకి గణనీయమైన విజయం దక్కకపోవడం ఆవేదనకరమని పేర్కొన్నారు. వరుస ఓటములకు స్పష్టమైన నాయకత్వ లోపమే ప్రధాన కారణమని విమర్శించారు.ఇటీవల మెట్‌పల్లి మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో పార్టీ వ్యవహరించిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థులకే కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్దతు ఇవ్వడం పార్టీ బలహీనతను బహిర్గతం చేసిందని మండిపడ్డారు. మొన్నటిదాకా బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోఆప్షన్ పదవి అనుభవించిన వ్యక్తికే మళ్లీ అదే పదవి దక్కడం వలస నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలకు తావిచ్చిందన్నారు. సొంత అభ్యర్థిని గెలిపించుకోలేని పరిస్థితి పార్టీ అంతర్గత విభేదాలకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు."పార్టీకి అధిష్టానం ఉన్నదా? ఉంటే ఇలాంటి పరిణామాలు ఎలా చోటుచేసుకుంటున్నాయి?" అంటూ నేతలు ప్రశ్నించారు.రాబోయే నామినేటెడ్ పదవులను నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న సీనియర్ నాయకులకే కేటాయించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 26 వార్డుల్లో కేవలం 6 స్థానాలకు మాత్రమే పరిమితమవడం పార్టీ బలహీనతను స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు.నలభై ఏళ్లుగా పార్టీ కోసం కృషి చేసిన సీనియర్ కార్యకర్తలు గుర్తింపు లేక ఇంటికే పరిమితమవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్. వెంటనే స్పందించి కోరుట్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యం ఇచ్చి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో జెట్టి లింగం, షాకీర్, గంగాధర్, హనుమాన్లు యాదవ్, బర్ల సాయన్న, యామ రాజయ్య, అందే మారుతి, మారంపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఏఐటియుసి ఆర్జీ–1 జనరల్ బాడీ సమావేశం

**ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను**

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), అర్జీ వన్ బ్రాంచి జనరల్ బాడీ సమావేశం ఎప్రిల్ 29న సాయంత్రం ఐదు గంటలకు గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో ఏర్పాటు చేయనైనదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఇట్టి సమావేశంలో ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి లు పాల్గొని సింగరేణి లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల పై ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు.కనుక ఏఐటియుసి అర్జీ వన్ బ్రాంచి డెలిగేట్ లు, ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు,మైన్స్,సేఫ్టీ కమిటీ సభ్యులు మరియు సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఒక ప్రకటన లో కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు రైతులను కోరారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్ష కొండ గ్రామంలో సోమవారం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కృష్ణారావు స్థానిక సర్పంచ్ ఫోన్ కంటి చిన్న వెంకట్, ఎఫ్ పి ఓ చైర్మన్ కుంభాల రాజరెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్, జిపిఓ రాజేష్,నాయకులు ఐలాపురం భూమారెడ్డి, నల్ల రామరాజు, రైతులు, పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య కాలేజీలో భారీ దొంగతనం: సిపి గౌష్ ఆలం

**రూ.5 లక్షల నగదు, 10 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం**




ప్రజాపక్షం/కరీంనగర్: జల్సాలకు అలవాటు పడి, కష్టం లేకుండా డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన రూ. 5 లక్షల నగదు సుమారు 10 గ్రాముల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె.సృజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుర్శేడ్ గ్రామానికి చెందిన బొద్దుల యుగేందర్ (32) అనే వ్యక్తి గతంలోనూ పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉండి, పీడీ యాక్ట్ (పిడి యాక్ట్) కింద జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుండి వచ్చిన తర్వాత కూడా తన ప్రవర్తన మారని యుగేందర్, ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున మంకమ్మతోటలోని శ్రీ చైతన్య కాలేజీ ఆఫీసు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన రూ. 5 లక్షల నగదును, ఒక బంగారు చైన్ దొంగిలించి తన ఇంటి వెనుక ఉన్న కట్టెల కుప్పలో దాచిపెట్టాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి నేతృత్వంలోని బృందం నిందితుడిని దుర్శెడ్ లోని అతని నివాసం వద్ద అదుపులోకి తీసుకున్నారు. నింధితుడు చూపిన గుర్తింపు మేరకు పంచుల సమక్షంలో కింది సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలోనే చింతకుంట ఆంజనేయస్వామి గుడిలో హుండీ దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో అంగీకరించాడు. నేర ప్రవృత్తి గల వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంటుందని, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. సకాలంలో నిందితుడిని పట్టుకుని సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని కరీంనగర్ సీపీ గౌష్ ఆలం అభినందించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. సోమవారం మండల పరిధిలోని తిగుల్, మునిగడప, చాట్లపల్లి, వట్టిపల్లి, మాందాపూర్, దౌలాపూర్ గ్రామాలలో ఐకేపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగూలు కేంద్రాలను గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపి ఎపిఎం నర్సయ్య, స్థానిక సర్పంచ్‌లు రజిత, బాలయ్య,ఐలయ్య, విద్యాధర్,కృష్ణ, ఎఈఓ భానుప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, పిఎసిఎస్ సిఈఓ రాములు, నాయకులు కరుణాకర్, మల్లేశం, అమరేందర్‌రెడ్డి, ఐలయ్య, వేంకటేశం, రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు వారానికి మించి పెండింగ్ పెట్టొద్దు

**కలెక్టర్ చిత్రా మిశ్రా**



ప్రజాపక్షం/కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందువల్ల ప్రజావాణి దరఖాస్తులను వారానికి మించి పెండింగ్లో ఉంచొద్దని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరించారు. 226 దరఖాస్తు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని దేశించారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇప్పటికీ వారానికి మించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులన్నీ పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో పెండింగ్లో ఉన్న పలు శాఖలను గుర్తించి వెంటనే క్లియర్ చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు సంబంధిత శాఖకు బదిలీ కావడంలో ఆలస్యమైనా ప్రజావాణి ఆన్లైన్లో దరఖాస్తులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తుపై తీసుకున్న చర్య గురించి అర్జీదారునికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లక్నోపై కోల్‌కతా 'సూపర్' విజయం

**లక్నో:** ఐపిఎల్19లో ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్, కోలకతా నైట్రైడర్స్ మధ్య లక్నోలో జరిగిన లోస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను అలరించింది. ఇరుజట్ల స్కోర్లు సమం కావడంతో ఈ సీజన్లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో కోలకతానే విజయం వరించింది. కేకేఆర్ నిర్దేశించిన 156 పరుగుల స్వల్ప ఛేదనలో లక్నో సైతం నిర్ణీత ఓవర్లలో అంతే స్కోరు (155/8) చేయడంతో మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్లో లక్నో.. నరైన్ మాయ చేయడంతో ఒక్కటంటే ఒక్కటే పరుగు చేసింది. రింకూ తొలి బంతికే ఫోర్ బాది కోల్కతాకు రెండో విజయాన్ని అందించాడు. మొదట మోహ్సిన్ ఖాన్ (5/23) పేస్కు దాసోహమైన కేకేఆర్.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 155 రన్స్ చేసింది. ప్రధాన బ్యాటర్లంతా నిరాశపరిచినా లోయరార్డర్లో రింకూ సింగ్ (51 బంతుల్లో 83 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్సు) పోరాడి ఆ జట్టును పోటీలో నిలిపాడు.



**లక్నో చేజేతులా..** వైభవ్ రెండో ఓవర్లో తొలి బంతికే ప్రమాదకర మిచెల్ మార్ష్ (2)ను ఔట్ చేసి లక్నోకు తొలి షాకివ్వగా కేకేఆర్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థికి పరుగుల రాకకు అడ్డుకట్ట వేశారు. స్పిన్ ద్వయం నరైన్ (1/23), వరుణ్ (2/33) మాయతో మార్క్రమ్ (29), పంత్ (42) వంటి హిట్టర్లు క్రీజులో ఉన్నా పది ఓవర్లకు లక్నో స్కోరు 63/1 మాత్రమే. 11వ ఓవర్లో బంతినందుకున్న గ్రీన్.. మార్క్రమ్ను ఔట్ చేయగా నరైన్, పంత్కు చెక్ పెట్టాడు. క్రీజులో నిలిచేందుకు తంటాలు పడ్డ పూరన్ (9).. వరుణ్ ఓవర్లో నిష్క్రమించగా ముకుల్ చౌదరి (1), అనుకుల్ ఓవర్లో రింకూకు క్యాచ్ ఇవ్వడంతో లక్నో ఐదో వికెట్ కోల్పోయింది. చివరి 5 ఓవర్లలో లక్నో విజయానికి 58 రన్స్ అవసరమైన దశలో త్యాగి ఓవర్లో హిమ్మత్ (19), బదోని మూడు సిక్సు బాది జెయింట్స్ను పోటీలోకి తెచ్చారు. అయితే వరుణ్ మరుసటి ఓవర్లో బదోనిని ఔట్ చేయగా వైభవ్ 19వ ఓవర్లో లిండె (8) నిష్క్రమిండంతో ఆఖరి ఓవర్లో ఆ జట్టు విజయానికి 17 పరుగులు అవసరమయ్యాయి. త్యాగి విసిరిన ఆ ఓవర్లో రెండు నోబాల్స్తో పాటు ఆఖరి బంతికి షమీ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ టై అయింది.

**మోహ్సిన్ పేస్కు దాసోహమై..**
యువ పేసర్ మోహ్సిన్ వరుస ఓవర్లలో బెంబేలెత్తించడంతో కేకేఆర్ విలవిల్లాడింది. అతడి పేస్కు టిమ్ సీఫర్ట్ డకౌట్ అవగా పేలవ ఫామ్తో సతమతమవుతున్న అజింక్యా రహానే (10), రోమన్ పావెల్ (1) వికెట్లను కోల్పోయి నైట్రైడర్స్ పీకల్లోతు కష్టాల్లో పడింది. తన మొదటి స్పెల్లో మూడు ఓవర్లు వేసిన మోహ్సిన్.. 15 పరుగులే ఇచ్చి పర్యాటక జట్టు వెన్ను విరిచాడు. ప్రిన్స్ బౌలింగ్లో రఘువంశీ (9) అబ్స్ట్రక్టింగ్ ఫీల్డ్ ఔట్ అయ్యాడు. ఈ క్రమంలో రింకూ, కామెరూన్ గ్రీన్ (34) కోల్కతాను ఆదుకునే యత్నం చేశారు. ఇద్దరూ ఐదో వికెట్కు 28 బంతుల్లోనే 42 పరుగులు జోడించి క్రీజులో కుదురుకుంటున్న సమయంలో ఇన్నింగ్స్ 11వ ఓవర్లో రెండో స్పెల్కు వచ్చిన మోహ్సిన్.. మూడు బంతుల వ్యవధిలో గ్రీన్, అనుకుల్ను ఔట్ చేసి ఐదు వికెట్ల ఘనతను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్లో అతడికి ఇదే తొలి ఫైఫర్. రమణ్దీప్ సింగ్ (6)ను లిండె వెనక్కి పంపడంతో 15 ఓవర్లకు కేకేఆర్ 93/7గా నిలిచింది. కానీ అప్పటికే 31 బంతులాడి 33 రన్స్ చేసిన రింకూ 18వ ఓవర్లో గేర్ మార్చాడు. షమీ ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన అతడు.. దిగ్వేశ్ విసిరిన ఆఖరి ఓవర్లో వరుసగా నాలుగు భారీ సిక్సర్లు బాది 26 రన్స్ పిండుకోవడంతో కోల్కతాకు పోరాడగలిగే స్కోరును సాధించింది.

# షట్లర్ల దూకుడు.. క్వార్టర్ ఫైనల్లో భారత్ !

థామస్ కప్‌లో భారత్ షట్లర్లు అదరగొట్టారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి, డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్ ద్వయం చెలరేగడంతో ఆస్ట్రేలియాపై భారత జట్టు ఘన విజయం సాధించింది. సోమవారం సెకండ్ గ్రూప్ ఏ టై మ్యాచ్‌లో ఆసీస్‌ను 5–0తో మట్టికరిపించి, క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టింది. ప్రస్తుతం గ్రూప్ ఏ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతున్న భారత్ తర్వాతి మ్యాచ్‌లో చైనాను ఢీకొట్టనుంది. ఇటీవల సూపర్ ఫామ్‌లో ఉన్న యువకెరటం ఆయుశ్ శెట్టి వరస సెట్లలో శ్రేయ్ ధాండ్‌ను చిత్తు చేశాడు. ప్రత్యర్థిని వణికించిన ఆయుశ్ 21–8, 21–6తో గెలుపొందడంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్‌లు 21–14, 21–16తో రిజ్కీ హిదాయత్, జాక్ యూను చిత్తు చేశారు. ప్రణయ్ సైతం జోరు చూపిస్తూ రిషి హోండా భూపతిపై 21–11, 21–17తో విజయం సాధించాడు.




### తొలి రెండు స్థానాల్లో

డెన్మార్క్ వేదికగా ఆద్యంతం హోరాహోరీగా జరుగుతున్న థామస్ కప్‌లో నాలుగు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. గత మ్యాచుల్లో ఆస్ట్రేలియాను 5–0తో ఓడించిన చైనా సోమవారం కెనడాపై 4–1తో గెలుపొందింది. గత సీజన్ క్వార్టర్ ఫైనల్లో చైనా చేతిలో కంగుతిన్న భారత్ ఈసారి ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని పట్టుదలతో ఉంది.

## యువతరంగం

# అప్రెంటిస్‌షిప్ ఆధారిత బిఎస్ కంప్యూటర్ సైన్స్ డిగ్రీ

భారతీయ సాంకేతిక విద్యలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని విశ్వ విశ్వానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ (వివిఐఎస్ఎం), 'బిఎస్ కంప్యూటర్ సైన్స్'లో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం 'టాలెంట్‌స్ప్రింట్' భాగస్వామ్యంతో అమలు అవుతోంది. చదువుతో పాటు రెండేళ్ల పని అనుభవాన్ని అందించడం ఈ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యం. కనీస విద్యార్హత ప్లస్ టూ లేదా ఇంటర్‌ను కనీసం 50 శాతం మార్కులతో పూర్తి చేసి ఉండాలి. టిఎస్ఇఎపిసిఇటి, ఎపిఎంసెట్, జెఇఇ, నీట్, క్లాట్, ఐపిఎంఎటి, యుజిఎటి లేదా తత్సమానమైన రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు వీవీఐఎస్ఎం–టాలెంట్‌స్ప్రింట్ నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ పరీక్షలో అర్హత తప్పనిసరి. తరగతులు ఈ ఏడాది జులై మాసంలో ప్రారంభమవుతాయి. యుజిసి ఆమోదించిన ఎఇడిపి ఫ్రేమ్‌వర్క్ కింద రూపొందించిన ఈ నాలుగేళ్ల కోర్సులో సుమారు 40 శాతం బోధన పరిశ్రమల ఆధ్వర్యంలో జరుగుతుంది. ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై ప్రాధాన్యత ఇస్తూ, గైడెడ్ ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, ఇండస్ట్రీ మెంటార్‌షిప్‌ను అనుసంధానించారు. ఒక సంవత్సరం కచ్చితమైన అప్రెంటిస్‌షిప్‌తో పాటు రెండేళ్ల పరిశ్రమ అనుభవం విద్యార్థులకు లభిస్తుంది. ఈ ఎఇడిపి నమూనా ఇంజనీరింగ్ విద్యలో 'ముందు చదువు–తర్వాత ఉద్యోగం' అనే సాంప్రదాయ విధానానికి భిన్నమైన ఫ్యూచరిస్టిక్ మోడల్. విద్యార్థులు పట్టభద్రులయ్యే సమయానికే పరిశ్రమకు సిద్ధమైన నిపుణులుగా తయారవుతారు. ఉపాధి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇది ప్రయోజనకరమైన ముందడుగు.




## యువతకు ఉపయోగపడే మెటలిజం..

ఇటీవలి కాలంలో చాలాఎక్కువ చర్చలో ఉన్న పదం 'మెంటలిజం'. ఇది అందరి జీవితాల్లోనూ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా యువతకు దీని అవసరం ఎక్కువ. మెంటలిజం అనగానే చాలామందికి ముందుగా గుర్తుకువచ్చేది మనసు చదవడం, అలౌకిక శక్తి, లేదా మంత్రతంత్రం అనే భావనలు. అయితే మెంటలిజం అసలు అర్థం ఇవి కాదు. ఇది మనిషి ఆలోచనలు, నిర్ణయాలు, భావోద్వేగాలు ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకుని, వాటిని ప్రదర్శనలో ఉపయోగించే కళ. ఇందులో మాయాజాలం కంటే మానసిక శాస్త్రం, ప్రవర్తనా శాస్త్రం, గ్రహణశక్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందువల్ల మెంటలిజం అనేది మనసు చదవ డం కాదు.. మనసు పనిచేసే విధానాన్ని ఖచ్చితంగా ఉపయోగించడం. మెంటలిజం ప్రధానంగా సైకాలజీ మీద ఆధారపడుతుంది. మనుషులు తమ నిర్ణయాలు పూర్తిగా స్వతంత్రంగా తీసుకుంటున్నామని అనుకుంటారు. కానీ వాస్తవంగా మన ఆలోచన లు ప్యాటరన్స్‌లో సాగుతాయి. ఉదాహరణకు 1 నుంచి 10 మధ్యలో ఒక సంఖ్య అనుకోండి అంటే గణాంకపరంగా ఎక్కువ మంది 7ను ఎంచుకుంటారు. ఇది యాదృచ్ఛికం కాదు.... మానవ ప్రవర్తనలోని ఒక సాధారణ ధోరణి. మెంటలిస్ట్ ఈ ధోరణులను ముందే అధ్యయనం చేసి, అంచనాలు వేస్తాడు. మెంటలిజంలో సజెషన్ కీలకం. ఒక ఆలోచనను నేరుగా చెప్పకుండా, మాటల ఎంపిక, స్వర వినియోగం, శరీర కదలికల ద్వారా ప్రేక్షకుడి మనసులో నాటడం జరుగుతుంది. దీనిని సైకాలజికల్ ప్రైమింగ్ అంటారు. ఉదాహరణకు ఎరుపు లేదా నలుపు అనుకుంటారు చాలా మంది. కానీ మీరు ఫ్రీగా ఎంచుకోండి అని చెప్పినప్పుడు, ఎక్కువ మంది ఆ రెండు రంగులలో ఒకదాన్ని ఎంచుకుంటారు. ఎంపిక స్వేచ్ఛ ఉన్నట్టు అనిపించినా, దారి ముందే సూచించడంతో, అంకంటే ముందుకు వెళ్లి ఆలోచించడానికి మనసు ఇష్టపడదు. ఈ విధంగా సూచనలు చేస్తూ, మనిషి ఆలోచనను ప్రభావితం చేయడమే మెంటలిజం.



## కోల్డ్ రీడింగ్.. బాడీ లాంగ్వేజ్

కోల్డ్ రీడింగ్ అనేది వ్యక్తి గురించి సాధారణంగా అందరికీ సరిపడే వాక్యాలను చెప్పి, అతడే తన జీవితంతో కలిపేసుకునేలా చేయడం. మీరు బలంగా కనిపిస్తారు కానీ లోపల సున్నితం గా ఆలోచించే వ్యక్తి అనే వాక్యం చాలా మందికి సరిపోతుంది. ఇది బర్నమ్ ఎఫెక్ట్‌గా ప్రసిద్ధి. ఇక శరీర భాష (బాడీ లాంగ్వేజ్) పరిశీలన కూడా కీలకం. కళ్ల కదలికలు, శ్వాస వేగం, ముఖంలో సూక్ష్మ మార్పులు మన అంతర్గత ఆలోచనలను సూచిస్తాయి. మెంటలిస్ట్ ఈ సంకేతాలను చదివి, తన అంచనాను సరిచేసుకుంటాడు. మిస్‌డైరెక్షన్ అంటే దృష్టిని ఒకచోట నిలిపి, అసలు ప్రక్రియను ఇంకోచోట నిర్వహించడం. ఇది మేజిక్‌లో ఉన్నట్టే మెంటలిజంలో కూడా ఉంటుంది. డబుల్ బైండ్ అనే పద్ధతిలో ఏ ఎంపిక చేసినా ఫలితం మెంటలిస్ట్ ప్లాన్‌కి అనుకూలంగా ఉండేలా ప్రశ్న వేస్తారు. వ్యక్తికి ఎంపిక ఉన్నట్టు అనిపించినా, ఫలితం ముందే నిర్ణయించబడింది. మేజిక్ ప్రధానంగా చేతి చాతుర్యంపై ఆధారపడుతుంది. వస్తువులు కనిపించడం లేదా మాయమవడం ద్వారా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మెంటలిజం మాత్రం ఆలోచనలపై కేంద్రీకృతమవుతుంది. ఇది ఆశ్చర్యంతో పాటు ఇది నిజమేనా? అనే అనుమాన భావనను కలిగిస్తుంది.



### మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి

త్వరిత నిర్ణయాన్ని వాయిదా వేయడం మొదటి రక్షణ. ఇప్పుడే అన్నప్పుడు తర్వాత అనడం అలవాటు చేయాలి. భావోద్వేగం పెరిగినప్పుడు ఆగాలి. ఈ ఆలోచన నిజంగా నాదేనా? అని మనమే మనల్ని ప్రశ్నించాలి. ప్రశ్నలు అడగడం, ఇతరుల అభిప్రాయం తీసుకోవడం మోసాన్ని తగ్గిస్తుంది. మెంటలిజం అనేది అలౌకిక శక్తి కాదు. ఇది మానవ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్న విజ్ఞానం. మనసు ఎలా స్పందిస్తుందో తెలుసుకోవడం శక్తి. అదే విజ్ఞానం సచేతనంగా ఉపయోగిస్తే రక్షణ; దుర్వినియోగం చేస్తే మోసం. మెంటలిజాన్ని అర్థం చేసుకున్నవాడు మాయ చేయగలడు. కానీ మెంటలిజాన్ని గుర్తించినవాడు ఆ మాయలో పడడు.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** పోరాడి సాధించుకున్నా కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు చేయాలని, ప్రపంచ కార్మికుల పండుగ రోజైన మే1న మేడే ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించుకోవాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సోమవారం చిలుకూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం డిఎన్ భవన్‌లో కస్తూరి సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1881లో అమెరికా నడిబొడ్డున చికాగో నగరంలో లక్షలాది మంది కార్మికులు ప్రాణలర్పించి రక్తం చిందించి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను హరించి వేస్తూ 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా విభజించి 12 గంటల పనిని పొడగిస్తూ కార్మికుల శ్రమను దోపిడికి తెరలేపారని మండిపడ్డారు. కార్పోరేట్ శక్తులను పెంచి పోషిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్న మతతత్వ బిజెపి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్మికులంతా వారి కుట్రలను పసిగట్టి అన్ని సంఘాలు సంఘటితమై తమ హక్కులు సాధన కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ చిలుకూరు మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్‌కె సాయిబెల్లి, కె.వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెమిడాల రాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, శిలివేరు ఆంజనేయులు, తాళ్లురి వెంకటయ్య, దొడ్డ నాగేశ్వరరావు, కస్తూరి సత్యం, అలివేలు, పెద్ద మల్లయ్య, కొడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం

సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** కార్మిక హక్కుల రక్షణకు కార్మికులు మేడే స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మే 1న నిర్వహించనున్న వేడుకలను జిల్లాలో ఘనంగా జరుపుకోవాలని ఆయన కార్మిక లోకాన్ని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో వెట్టిచాకిరి, బానిసత్వం నుండి విముక్తి కోసం, ఎనిమిది గంటల పని దినం కోరుతూ కార్మికులు వీరోచిత పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఆనాడు అమెరికా ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో వేలాది మంది కార్మకులు ప్రాణాలర్పించారని, వారి రక్తంతో తడిసిన చొక్కాయే నేడు ప్రపంచవ్యాప్తంగా ఎర్రజెండాగా కార్మక వర్గానకి స్ఫూర్తినిస్తోందన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినీరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, ఎస్.అరుణ్, షేక్ పాషా, బెజ్జంకి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

### పోరాటాలకు సిద్ధం కాకుంటే ప్రభుత్వాలు

# కార్మిక హక్కులు హరిస్తాయ్

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కాకుంటే ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం ఓమయ్య అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా హాజరై పశ్య పద్మ మాట్లాడారు. దేశవ్యాప్తంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుండి తెచ్చిన 4 లేబర్ కోడ్లతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో కార్మికులు హక్కులు లేకుండా కార్పోరేట్ శక్తుల నిర్ణయాలు అమలయ్యే కుట్ర జరుగుతుందని ధ్వజమెత్తారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రభుత్వాలు ఆమోదించిన కనీస వేతన జిఓలు, కార్మిక చట్టాల ప్రకారం కార్మిక వర్గానికి రావల్సిన కనీస వేతనాలు రాక ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులను యాజమాన్యాల కోసం పెట్టుబడిదారుల వద్ద కట్టు బానిసలుగా పని చేసే విధంగా బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ విధానాల మూలంగా కార్మికులకు సమ్మె చేసే హక్కు, 8 గంటల పని, పని భద్రత వేతనం పెంచమని హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, లేబర్ డిపార్ట్‌మెంట్ నిర్వీర్యం అవుతుందన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ఆలోచించి కార్మిక హక్కులను కాలరాయకుండా పాత 29 కార్మిక చట్టాలను అమలు పర్చాలని, నాలుగు కొత్త చట్టాలను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మే 1న పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను వివరిస్తూ బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేకవిధానాలు ఎండగాడుతూ మేడే ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 1886 మే 1న చికాగో నగరంలో జరిగిన కార్మిక ప్రాణ త్యాగ ఫలితంగానే ఎనిమిది గంటల పని విధానం అమలైందని, మళ్లీ 140 సంవత్సరాల తర్వాత పని గంటల కోసం, కనీస వేతనాల కోసం పోరాటానికి సిద్ధమయ్యే విధంగా కార్మికవర్గం మే 1న ప్రతినపూనాలని కార్మిక లోకానికి పశ్య పద్మ పిలుపునిచ్చారు. కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా మే1వ తేదీన అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్మిక అడ్డాల్లో ఎర్ర జెండాలు ఎగురవేసి ర్యాలీలు, సభలు నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూమయ్య, నాయకులు స్వరూపరాని, రఘురాం తదితరులు పాల్గొన్నారు.




### ధాన్యం కొనుగోలు కేంద్రాలు

# వెంటనే ప్రారంభించాలి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపురం మండలంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిసిఐ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న వడ్లను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసేందుకు కసరత్తు ప్రారంభించాలని, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, యువతను ఉద్యమాల్లోకి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. మేడే సందర్భంగా గ్రామగ్రామాన ఎర్రజెండాలు ఎగరవేసి కార్మికులను సంఘటితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య. కలకొండ సంజీవ, పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, మోత్య, పెంటయ్య, శ్రీను, సికిలమెట్ల రమేష్, భీమారెడ్డి పాల్గొన్నారు.



# కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మరో ఉద్యమం

ఎఐటియుసి నేతల పిలుపు

మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** మేడే స్ఫూర్తితో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. మేడే ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే పోస్టర్ కరీంనగర్‌లోని గంజ్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో గంజ్‌లో, బొమ్మకల్‌లోని సిమెంట్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో సిమెంట్ గోదాంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంజ్ ఐరన్ హమాలీ నాయకులు కొట్టే సంపత్, పెంచాల సంపత్, జక్కుల ఆగయ్య, జక్కుల రాములు, కూకట్ల సంపత్, మేకల రాజయ్య, బండారి మల్లికార్జున్, బొమ్మకల్ సిమెంట్ గోదాంలో జరిగిన కార్యక్రమంలో సిమెంట్ గోదాం హమాలి, అధ్యక్షులు జంగం తిరుపతి నాయకులు బాగోతం వీరయ్య, నన్నవేని కొమరయ్య, నన్నవేని శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, దొంగల శ్రీనివాస్, ఉప్పారపు శ్రీనివాస్, దానవేణి కొమరయ్య, జడల అయిలయ్య, బోయిని ఐలయ్య, జక్కుల ఐలయ్యపాల్గొన్నారు.

**వరంగల్ :** మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవన్ సిపిఐ కార్యాలయంలో మేడే పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, ఆఫీస్ బేరర్స్ సంఘీ ఏలేందర్, ఉప్పుల రవి, జిల్లా నాయకులు రాచర్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు



**ములుగు :** మేడే ఉత్సవాలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి ములుగు జిల్లా ఇన్‌చార్జి నరాటి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్‌లు అన్నారు. సోమవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో పోలం కొండయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మేడే ఉత్సవాలను గ్రామ గ్రామాన కార్మిక వార్డులలో ఘనంగా నిర్వహించాలని, మేడే స్ఫూర్తితో డిమాండ్ల సాధనకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పోరెడ్డి ప్రమీల, పోలం కొండయ్య, గడ్డం భారతి, కుడుముల సమ్మక్క బండారి శ్రీనివాస్, సామల రమ, వడి సారయ్య, గుంజె శ్రీనివాస్, పెద్దకాసు వినోద్, శ్యాంసుందర్, కొక్కుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.






# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

## ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/వైరా: మితిమీరిన వేగంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో చికిత్స పొందుతూ ఒకరు చనిపోయిన సంఘటన సోమవారం వైరాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వైరా పాత బస్టాండ్ సెంటర్ కాంగ్రెస్ కార్యాలయం ఎదురుగా వైరా నుండి ఖమ్మం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనదారులు మహాలక్ష్మి అమ్మ దేవాలయం నుండి రోడ్డు దాటుతున్న స్కూట్రీని వేగంగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వైరా మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన వేల్పుల చందు(16) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సహకారంతో మృతుని కళ్లను ఖమ్మం ఐ కేర్‌కు దానం చేశారు. వైరా ఎస్టీ కాలనీకి చెందిన బానోతు శ్రీను, తల్లాడ మండలం పాత పినపాక గ్రామానికి చెందిన పునుకొల్లు వివేక్‌కు తీవ్ర గాయాలు కావడంతో వివేక్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బానోతు శ్రీను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వైరా ఎస్ఐ పుప్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# కలెక్టర్‌గా దివాకర టిఎస్ బాధ్యతలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా దివాకర టిఎస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దివాకర టిఎస్ ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టిఎస్‌ను అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డిఆర్వో పద్మశ్రీ, ఆర్డివో శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు: కలెక్టర్




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఈ మేరకు నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఇంధన సరఫరాపై ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా కొరత లేదని, కాగా కొన్ని ప్రాంతాల్లో అపోహల కారణంగా గందరగోళం ఏర్పడిందన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, ముందస్తు కొనుగోళ్లపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నందున లారీలు, వరి కోంత యంత్రాలు, వ్యవసాయ యంత్రాలకు ఇంధన కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియా ద్వారా ఇంధన కొరతపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. డిజిల్, పెట్రోల్ నిల్వలు అధిక మొత్తాల్లో ఉంచుకుని బ్లాక్ మార్కెట్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎస్పి రోహిత్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం ద్వారా ఇంధన అక్రమాలపై చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. పోలీసులు, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

# పిల్లలు పెడదారి పట్టకుండా జాగ్రత్త వహించాలి: డిఎస్‌పి సతీష్‌కుమార్



ప్రజాపక్షం/పాల్వంచ : తల్లిదండ్రులు తమ పిల్లలు పెడదారి పట్టకుండా నిరంతరం జాగ్రత్త వహించాలని పాల్వంచ డిఎస్‌పి ఆర్. సతీష్‌కుమార్ అన్నారు. పాల్వంచ గ్రామీణ పోలీసులు ఆధ్వర్యంలో జగన్నాధపురంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం మహిళలు, పిల్లల భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల రోజువారీ దిన చర్యలపై నిఘా పెట్టాలన్నారు. వారు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూసుకోవాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాల పట్ల పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. దీనితో వారికి పోలీసులు తగిన సహాయ సహకారాలను అందజేసి రక్షణ కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ. సతీష్, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్, సర్పంచ్ బానోత్ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ ఎల్లుండికి వాయిదా

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : పాలేరునియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేడు నిర్వహించాల్సిన ప్రజాదర్బార్ వాయిదా పడిందని మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి హైదరాబాద్‌లో పలు అత్యవసర ప్రభుత్వ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున్న ఈనెల 29వ తేదీ నాడు నిర్వహించనున్నారన్నారు. కావున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గమనించాల్సిందిగా కోరారు.

# తప్పు దొర్లకుండా స్వీయగణన

ప్రజాపక్షం/నేలకొండపల్లి: తప్పులు దొర్లకుండా స్వీయ గణనను విజయవంతం చేయాలని నేలకొండపల్లి తహసీల్దార్ రాంప్రసాద్ సూచించారు. మండల కేంద్రం లోని స్థానిక ఉన్నత పాఠశాలలో జనగణన ఎన్యూమరేటర్ల కు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనగణనలో ఎలాంటి తప్పిదాలు లేకుండా అప్రమతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోనే మండలం ఆదర్శంగా ఉండేలా గణన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యం.యర్రయ్య, ఎంఇఒ చలపతిరావు, ఆర్ఐ మధుసూధనరావు, అల్లం రవికుమార్, ట్రైనర్స్, నాగేశ్వరరావు, రావెళ్ల అరవింద్, ప్రతినిధులు టి.వెంగళరావు, తొర్తి సురేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా నిలపాలి

## అభివృద్ధి పనులకు కలెక్టర్‌తో కలిసి మంత్రి తుమ్మల శంకుస్థాపన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పరిశుభ్ర నగరంగా ఖమ్మంను ఆదర్శంగా నిలిపేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సోమవారం ఖమ్మం కార్పొరేషన్ 16వ డివిజన్ ధంసలాపురంలో రూ.1.20 కోట్లతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరానికి విస్తృతంగా రహదారుల ఏర్పాటుతో పాటు సరిపడా తాగునీటి సరఫరా, 24 గంటలు నిరంతర విద్యుత్ అందించి పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో ఇతర కార్పొరేషన్లకు ఖమ్మంను ఆదర్శంగా నిలపాలని అం దుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. పెండింగ్‌లోఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని వ ర్గాల ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖమ్మం నగరానికి చుట్టు పక్కల పలు నేషనల్ హైవేలో అందుబాటులోకి వచ్చాయని రింగు రోడ్డు కూడా ఏర్పాటు కానుందని త్వరలో నగరానికి ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీల ఏ ర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారని ప్రజల అభ్యర్ధన మేరకు అభివృద్ధి పను లు మంజూరు చేస్తున్నారని వాటి అమలుకు అధికారులుగా వేగవంతం చేస్తామన్నారు. అనంతరం ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి నేషనల్ హైవేపై మున్నేరు రైల్వే బ్రిడ్జి వద్ద వంతెన, ఖమ్మంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పనులను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనతో పలు ప్రయోజనాలు

## డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



ప్రజాపక్షం/ ఖమ్మం : జనగణనతో పలు పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చునని ప్రతి కుటుంబం ఖచ్చితంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో స్వీయగణన కార్యక్రమంలో ఆయన తన కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ జనగణన 2027 ప్రక్రియలో భాగంగా ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేందుకు జనగణన తోడ్పడుతుందన్నారు. జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని స్వీయగణనను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

# మధుసూదన్ మృతిపట్ల సిపిఐ సంతాపం

ప్రజాపక్షం/ ఖమ్మం : సీనియర్ జర్నలిస్టు, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క పిఆర్‌వో మారబోయిన మధుసూదన్ మృతిపట్ల సిపిఐ జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. మధు ప్రజా ఉద్యమాలకు సహకరించారని ఉద్యమ వార్తలకు ప్రాధాన్యతనిచ్చారని సిపిఐ జిల్లా సమితి తెలిపింది. మధుసూదన్ మృతితో ఒక నిబద్దత కలిగిన పాత్రికేయున్ని కోల్పోయామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

## సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : చిమ్మపుడి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి గృహప్రవేశాలు చేయించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్ మాట్లాడుతూ చిమ్మపుడి గ్రామంలో 2018లో 55 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించారని అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల క్రితం లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించి పట్టాలు ఇచ్చారని కానీ అక్కడ మౌలిక వసతులు కల్పించలేదన్నారు. విద్యుత్ సౌకర్యం, తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాలు లేక లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకోలేదని అద్దె ఇండ్లలోనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇట్టి సమస్యపై మంత్రి చెప్పినా.. అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు దృష్టిసారించి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి గృహప్రవేశాలు చేయించాలన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉల్లెబోయిన విష్ణుమూర్తి, నాయకులు చంద్రమ్మ, లబ్ధిదారులు షేక్ తుఫాన్ లాల్, వాడపల్లి రమేష్, జింకల రవి, ముద్రబోయిన గోపి, సర్వేశ్వరరావు, ఓబుల సుజాత, వాణి, రజియా, పి. సుగుణ, జల్లి సరస్వతి, వాడపల్లి సరస్వతి, వాడపల్లి సునీత, నాగమణి, జింకల మమత, నారపోగు కల్పన, సంగపోంగు అనూష, అశ్వని, శ్రావణి, సచ్చు సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ

## నూతన కలెక్టర్‌ను కలిసిన ఐజెయు బృందం

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మంజిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సోమవారం బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ దివాకర ను టియుడబ్ల్యూజె (ఐజెయు) కోరింది. మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన ఐజెయు బృందం జర్నలిస్టుల అక్రిడేషన్లు, నివాస స్థలాలు ఇతర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చింది. ఖమ్మంజిల్లా రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్నదని ఇక్కడి జర్నలిస్టు సమాజం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తుందని యూనియన్ నేతలు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ జర్నలిస్టుల సూచనలు, సలహాలను తీసుకుంటామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, జిల్లా నాయకులు వనం వెంకటేశ్వర్లు, తాళ్లూరి మురళీ కృష్ణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధనాచారి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులు మోహీనుద్దీన్, సత్యనారాయణ, గోపాల్, సురేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# మధుసూదన్ మృతిపట్ల ఐజెయు సంతాపం



ప్రజాపక్షం/ ఖమ్మం : సీనియర్ జర్నలిస్టు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పిఆర్ఓ మారబోయిన మధుసూదన్ మృతిపట్ల టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర, జిల్లా కమిటీలు తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. సీనియర్ జర్నలిస్టుగా మధు పాత్రికేయ రం గంలో ఎంతో నిబద్ధతతో పనిచేశారని ఆయన మృతితో పాత్రికేయ లోకం ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగిన పాత్రికేయుడిని కోల్పోయిందన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) నల్లగొండ జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేశారని యూనియన్ పట్ల అంకిత భావంతో పని చేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఐజెయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. విరాత్ అలీ,కె. రాంనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఖమ్మం జిల్లా యూనియన్ బాధ్యులు నలజాల వెంకట్రావు, మాటేటి వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు భూపాల్, మహేందర్, హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, చారి, తదితరులు ఉన్నారు.

# ప్రజా వినతులు సత్వర పరిష్కారం

## ప్రజావాణిలో కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపుకలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొణిజర్ల గ్రామానికి చెందిన సిహెచ్ రామ లక్ష్మ ణులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కొణిజర్ల గ్రామ పంచాయతీ పాలక వర్గంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏన్కూరు గ్రామ ప్రజలు తమ గ్రామ పరిధిలో గల చెరువు కింద వరి పొలాలు కలిగిన రైతులు వర్షం వచ్చినప్పుడు చెరువు నిండి నాలుగు అడుగుల వరకు పొలాల్లో నీరు నిలిచి పంట నష్టపోతున్నామని ఏన్కూరు నుండి గార్లొడ్డు వరకు కొత్తగా పోసే రోడ్డుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న దగ్గర మోరీలు కట్టాలని, రోడ్డు పక్కన కాలువలు తీయాలని దరఖాస్తు చేశారు. కొణిజర్ల మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు రెడ్డబోయిన వెంకన్న గ్రామంలో ఉన్నటువంటి ఊరచెరువు, చీకటి చెరువులు కబ్జాకు గురవుతున్నాయని వీటిని సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర ఎస్సి కాలనీ ప్రజలు ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, పిహెచ్‌సి సబ్ సెంటర్‌ను కొత్త బిల్డింగ్ నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పాత భవనానికి షిఫ్టు చేయాలని దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వీడని మిస్టరీ

## అనుమానాస్పద స్థితిలో తండ్రీకూతుళ్ల మృతి

## అపస్మారక స్థితిలో భార్య

## హత్యా, ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు





ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఖమ్మం నగరం మామిళ్లగూడెంలోని తండ్రికూతుళ్ల మృతి మిస్టరీగా మారింది. మూడురోజుల క్రితం ఘటన జరగగా ఆదివారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ పోలీసులు, టౌన్ ఎసిపి రమణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మం డలం అనంతనగర్ గ్రామానికి చెందిన కణతాల రాము (29) ఓ డిజిటల్ మీడియాలో విలేకరిగా పనిచేస్తున్నాడు. ఇతనికి సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని గ్రామానికి చెందిన రమ్య అనే యువతితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు కణతాల దివ్యనైని (5), దీక్షిత ఉన్నారు. ఖమ్మం మామిళ్లగూడెం కరెంటు ఆఫీస్ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. అయితే గత రెండు రోజులుగా రమ్య ఫోన్ ఎత్తకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం ఖమ్మంలోని వారి ఇంటి వద్దకు వచ్చారు. ఎంతకూ తలు పు తీయకపోవడంతో సమీపంలోని సతీష్ అనే వ్యక్తిని పిలిచి అతని సహకారంతో కిటికి తెరిచి చూడగా ఇంటి నుండి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ ఎస్ఐ రమేష్ సిబ్బందితో అక్కడి చేరుకుని తలుపులు పగలగొట్టి చూడగా రాముతో పాటు పెద్దకుమార్తె దివ్యనైని రక్తపు మడుగులో పడి కనిపించారు. అక్కడే రమ్య కూడా అపస్మరక స్థితిలో ఉండగా చిన్నకూతురు తలుపు పక్కన తలకు గాయాలతో బిక్కుబిక్కుమంటూ దీనస్థితిలో కూర్చుని కనిపించింది. వెంటనే రమ్య, చిన్న కూతురును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, రాము, దివ్య మృతదేహాలను మార్చురికి తరలించారు.

**హత్యా..ఆత్మహత్యా?.. కోణంలో దర్యాప్తు..**

అయితే హత్య లేదా ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాము మృతదేహంపై గాయాలు ఉండటం, మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో రాము మూడు రోజుల క్రితమే మృతిచెందిఉంటాడని అనుమానిస్తున్నారు. కుటుంబకలహాలతో భార్య రమ్య భర్త, ఇద్దరు కూతుళ్లను హత్యచేసేందుకు యత్నించగా భర్త, పెద్దకూతురూ చనిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. రాము బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు రమ్యను ఆరా తీయగా అనారోగ్యంతో బాధపడుతూ బయటకు రావడంలేదని చెప్పి చివరికి భయంతో ఆదివారం తాను ఎలుకలు లేదా పురుగుల మందు సేవించి అత్మహత్యకు యత్నించిందని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం రమ్య కొంత కోలుకోవడంతో పోలీసులు ఆమెను విచారిస్తున్నా సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుడు సమాచారం ఇస్తోందని ఎసిపి రమణమూర్తి తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు రాము, భార్య రమ్యకు మధ్య తరచూ వివాదాలు జరుగుతుండేవని, శుక్రవారం వీరి మధ్య గొడవజరగటంతో ఈక్రమంలోనే అఘాయిత్యం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. వీరి మధ్య చిన్నచిన్న మనస్పర్థలు తప్ప ఏ ఇతర వివాదాలు లేవని తమ విచారణలో తేలిందని పోలీసులు చెబుతున్నారు. అయితే రామును రమ్య కొట్టి చంపిందా లేదా రాము ఏదైనా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడా, పెద్దకూతురిని చంపవలసిన అవసరం ఎందుకు వచ్చింది? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే పోలీసులు మాత్రం రమ్య భర్త, పిల్లలను చంపేందుకు యత్నించగా చిన్నకూతురు దాని నుంచి బయట పడిందని విషయం తెలిసే తనపై అనుమానం వస్తుందనే భయంతో రమ్య ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. రమ్య పూర్తిగా కోలుకుంటే కాని తన నుంచి అసలు విషయం బయటపెట్టే అవకాశం ఉంటుందని ప్రస్తుతం తమ విచారణకు రమ్య సహకరించడం లేదని ఎసిపి తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం మృతుడు రాము తల్లిదండ్రులు తమ కుమారుడు మృతికి రమ్య కారణమని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. త్వరలోనే మిస్టరీని ఛేదించి అసలు జరిగిన సంఘటనను వెలుగులోకి తెస్తామని పోలీసులు చెపుతున్నారు.

# సారూ.. ఈ రోడ్డును పట్టించుకోరా?

## గోతులమయంగా ఏన్కూరు- ముచ్చర్ల రోడ్డు

## తరచూ ప్రమాదాలు

## అయినా పట్టించుకోని అధికారులు





ప్రజాపక్షం/ ఖమ్మం : అనేక ఏళ్లుగా గుంటలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నా.. ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడం బాధాకరం. ఖమ్మం జిల్లాలో రద్దీగా ఉండే రోడ్లలో ఏన్కూరు నుంచి తిమ్మారావుపేట మీదుగా ముచ్చర్ల వెళ్లే రోడ్డు ఒకటి. ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ వెళ్లే ఈ రోడ్డు నిరంతరం రద్దీగా ఉంటుంది. అంతే కాకుండా మహబూబాబాద్ జిల్లాతోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ఈ రోడ్డు కలుపుతుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డుపై ప్రమాదకర స్థాయిలో గుంటలు ఏర్పడ్డాయి. అయినా ఈ రోడ్డు పునర్ నిర్మాణం పట్ల అధికారులు కనీస శ్రద్ధ కనబర్చడం లేదు. ముఖ్యంగా అడవి మద్దులపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇంత కాలం నిర్లక్ష్యంగా వదిలి వేయడమే విచిత్రంగా ఉంది. ఇప్పటికైనా స్పందించి సత్వర మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# 'మే' డే వేడుకలను జయప్రదం చేయాలి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ పిలుపు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మేడే వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ పిలుపు నిచ్చారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో 14, 15 డివిజన్లలో కార్యవర్గ సమావేశం జంగాల వలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ మే ఒకటిన శుక్రవారం జరిగే మేడే వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. 14, 15 డివిజన్లలోని అర్హులైన పేదలకు ఇండ్ల స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చ ర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, బుడిగె వెంకన్న, పగడాల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం శాఖ సహాయ కార్యదర్శి మాకబోయిన నాగేశ్వరరావు, వాకదాని వలరాజు, పి. ప్రసాద్, చాగంటి వెంకట నర్సయ్య, ఎస్‌కె రజబ్ అలీ, పోతురాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాపక్షం/సత్తుపల్లి: బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు సోమవారం సత్తుపల్లిలో నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సత్తుపల్లి 20వ వార్డులో బిఆర్ఎస్ జెం డాను మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మ హేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రాము, పాషా, ఎస్ కె. చాందపాషా, సురేష్, ఆనంద్ పాల్గొన్నారు.

## నెక్కొండలో మొక్కజొన్న రైతుల కష్టాలు



ప్రజాపక్షం/నెక్కొండ:మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుల్లో స్థలం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో పిఏసిఎస్ అధికారులు, మార్కెట్ చైర్మన్ పండించిన మొక్కజొన్న పంటను నిల్వ చేసేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో, పనికర గుట్ట సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లోని ధాన్యాన్ని ఆరబోసుకోవాలని సూచించారు. పెద్దయెత్తున పసుపు టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకుంటూ రైతులు కష్టాలు పడుతున్నారు. ఈ ఏడాది అతి వర్షాభావం కారణంగా పత్తి పంటలు పీకేసి, ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. ఫలితంగా మండలంలో మొక్కజొన్న దిగుబడి అధికంగా రావడంతో కొనుగోలు ప్రక్రియలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. మార్కెట్ యార్డుల్లో నిల్వ స్థల లేకపోవడంతో రైతులు తెచ్చిన పంట రోజులు తరబడి బహిరంగ ప్రదేశాల్లోనే ఉండిపోతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని చైర్మన్ రైతులకు మీరు సొంత ఖర్చులతో గన్నీ బస్తాలు కొనుగోలు చేసుకుంది. మొక్కలు నాణ్యత చేసుకొని బట్టలు నింపుకొని టార్పాలిన్లు కప్పి ఉంచుకోవాలని మీ గన్నీ బ్యాగుల డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తుందని చైర్మన్ హరీష్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నెక్కొండలో తక్షణమే మరో అదనపు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని, చైర్మన్ హరీష్‌రెడ్డిని కోరుతున్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి




**ప్రజాపక్షం / నర్సంపేట :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఎ.ఎస్.ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, కన్స్యూమర్ ఫోరం జిల్లా కన్వీనర్ ఎర్రబోయిన రాజశేఖర్ అన్నారు. సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజారోగ్య రక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించి ప్రజారోగ్యాన్ని రక్షించాలని రాజశేఖర్ అడిషనల్ కలెక్టర్ వై. వి గణేష్ కు వినతి పత్రం అందించారు. ఫంక్షన్ హాల్స్‌లో సిరామిక్‌ప్లేట్స్ ఏర్పాటు చేసే విధంగాచర్యలు తీసుకోవాలని, అలాగే హోటల్స్, టిఫిన్ సెంటర్స్‌లలో వేడివేడి సాంబార్ కవర్లు, ప్యాకింగ్ కవర్లు వాడకుండా తగు చర్యలుతీసుకొని, జీర్ణ సంబంధితవ్యాధులు,క్యాన్సర్ వ్యాధిబారిన పడకుండా ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ వై వి గణేష్ స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

## ధాన్యం సేకరణలో కాంగ్రెస్ వైఫల్యం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:**రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వానికి పాలనపై పట్టు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ధాన్యం, సేకరణపై కనీస ప్రణాళిక లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన ధాన్యాన్ని సేకరించాలని, లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తానని సతీష్ రెడ్డి హెచ్చరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం



**ప్రజాపక్షం/ములుగు:**ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 దరఖాస్తులు రాగా వాటిలో భూ సమస్యలు 09, ఇందిరమ్మ ఇండ్లు 10, పెన్షన్ 27, ఉపాధి కల్పన 02, ఇతర శాఖలకు సంబంధించినవి 11 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భద్రతకు ప్రాధాన్యం..
## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రజా పాలన– ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 5 వ థీమ్ ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన మొదటి రోజు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ గృహాలలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్యశ్రీ కార్డులను, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిత్యం పర్యవేక్షణ కలిగి ఉండాలని, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్‌ఓ విజయలక్ష్మి, డిడబ్ల్యుఓ రాజమణి, జెడ్‌పి సిఇఒ రామ్ రెడ్డి, డిబిసిడిఒ పుష్పలత, డిఎంహెచ్‌ఒ సాంబశివరావు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరగాలి

**రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు**
**ప్రజావాణి అర్జీని వెంటనే పరిష్కరించాలి**



**ప్రజాపక్షం/జనగామ :**ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరగాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులు, ఐకెపి, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం జనగామ మండలంలోని పెంబర్తి గ్రామంలో ఐకెపి, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పరికరాలు ఉన్నాయా..లేవా అని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేందుకు ముందు దశల్లో టోకెన్ పద్ధతిని పెట్టడం జరిగిందని, దీనిని ఆయా శాఖల అధికారులు తూ.చా తప్పక పాటించాలన్నారు. దీని ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని, తేమ శాతం వచ్చిన ధాన్యం వేగంగా కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగానే వెంటనే ట్యాగ్ చేసి మిల్లులకు ధాన్యం బస్తాలు తరలించాలన్నారు. రవాణా పరంగా ఎలాంటి ఆలస్యం కాకుండా చూడాలని, లారీల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలకు సరియైన సమయంలో వచ్చేలా పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవి ఎండల నేపథ్యంలోనూ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇచ్చిన టోకెన్‌ల ఆధారంగా కేంద్రాలను రావాలన్నారు. కేంద్రాల వారిగా తాగునీరు, నీడ వసతి కల్పించాలని, మౌళిక వసతులు ఉండేలా చూడాలన్నారు.

**రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు**

యాసంగి ధాన్యం కొనుగోలు సందర్భంగా రైతులకు ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ వెన్నాలోమ్‌తో కలిసి వ్యవసాయ, ఐకెపి, సివిల్ సప్లయ్, రవాణ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగాజరగాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎఇఒలు, సివిల్ సప్లయ్ అధికారులు, ప్రతి కొనుగోలు కేంద్రాన్ని నిరంతరం సందర్శించాలని, ధాన్యం కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయన్నది పర్యవేక్షించాలన్నారు. ఏ రోజు ధాన్యం అదే రోజుట్యాగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, సివిల్ సప్లయ్ డెంహతీరామ్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, ఇన్‌చార్జీ డిఆర్‌డిఒ నూరొద్దీన్, డిసిఎస్ఒ పావని పాల్గొన్నారు.

**ప్రజావాణిఅర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని**

ప్రజావాణి అర్జీలకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 247 మంది కలెక్టర్‌ను కలిసి తమ విజ్ఞప్తులు అందజేశారు. కొడవటూరు గ్రామానికి చెందిన పద్మ అనే మహిళ తన పెంకుటిల్లు శిథిలావస్థలో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. స్టేషన్‌ఘనపూర్ మండలం రంగరాయిగూడెం గ్రామానికి చెందిన నెలమంచ సుమలత ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేయగా పేరు రాలేదని ఇల్లు ఇప్పించాలని కోరారు. చిన్నమడూరు గ్రామానికి చెందిన సోమయ్య ఇంటి అనుమతులు, ఇంటి నెంబర్ గురించి ధరఖాస్తు చేశారు. బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన మేకల బిక్షపతి 5 ఎకరాల 15 గుంటల భూమి గతంలో సాగు కోసం దళితులకు కేటాయించిందని, ఆ భూమిని అక్రమంగా సాగు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌డిఒ గోపిరాం, వెంకన్న, డిఆర్‌డిఒ నూరొద్దీన్, మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ మల్లికార్జున్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అనంతసాగర్ క్రాస్ రోడ్డు వద్ద జంక్షన్ నిర్మాణానికి సన్నాహాలు

**పరిశీలించిన ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల**



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** హన్మకొండ కరీంనగర్ జాతీయ రహదారిపై హసన్ పర్తి మండలంలోని ఎస్సార్ కాలేజీ సమీపంలో ఉన్న అనంతసాగర్ క్రాస్ రోడ్డు వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు క్రాస్ రోడ్డును సందర్శించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హసన్ పర్తి మండలం, కరీంనగర్ జాతీయ రహదారిపై ఉన్న ఎస్సార్ కాలేజీ సమీపంలోని అనంతసాగర్ క్రాస్ రోడ్డులో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, ఈ సమస్యను వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు విజ్ఞప్తి మేరకు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ (పిఒ) అజిత్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఈరోజు అనంతసాగర్ క్రాస్ రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాంతం కరీంనగర్ నేషనల్ హైవేని ఆనుకొని ఉండటం, ఎస్సార్ కాలేజీ విద్యార్థుల రద్దీ, అనంతసాగర్ గ్రామం వైపు వెళ్లే వాహనాల కారణంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు, వాహనదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కుడా నిధులతో ఈ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి, ప్రమాదాలను అరికట్టడానికి అత్యాధునిక జంక్షన్ నిర్మించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు.నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో విద్యార్థులు, స్థానిక ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జంక్షన్ నిర్మాణానికి సంబంధించి వెంటనే డిజైన్లు రూపొందించి, పనులు ప్రారంభించాలని చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, కుడా అధికారులు పాల్గొన్నారు.

## గూడెపాడు మార్కెట్లో మక్కల కొనుగోలు జాప్యం

**జాతీయ రహదారిపై రైతుల ధర్నా**



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం గూడెంపాడు వ్యవసాయ మార్కెట్లో మొక్కలు కొనుగోలు చేయడంలో జాప్యం జరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాకా (హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్) నిర్వహించిన టెండర్లలో గుత్తేదార్ పి శ్రీనివాస్ దక్కించుకున్నారు. శ్రమ కోర్చి ఆరుకాలం కష్టపడి పండించిన పంటకు గిట్టు బాటు ధర దొరుకుతుందని ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే లాభాలు ఏమోగానీ కష్టాలు మిగులుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.. సోమవారం రోజున మక్కల కొనుగోలు పూర్తిగా స్తంభించి పోయినది. ఈ విషయంపై రైతులు అధికారులను నిలదీయగా కొనుగోలు చేసిన మక్కలను నిల్వ చేయడానికి స్థలం లేదని లారీలు రావడం లేదని కుంటి సాకులు చెప్తున్నారని రైతులు ఆవేదన వెలిబుచ్చారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేదని రైతులు 163 జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు హాక అధికారులపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. కొనుగోలు విషయంపై వివరణ కోరడానికి ప్రయత్నించిన హాకా అధికారి సుదర్శన్ రెడ్డి స్పందించడం లేదని రైతులు అంటున్నారు.. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు చేయడానికి చర్యలు చేపట్టాలని హాక అధికారులను మందలించాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేసి ధర్నా విరమింప చేశారు.

## బిఆర్ఎస్,బిజెపి నాయకులవి శవ రాజకీయాలు

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆర్‌టిసిడ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య నేపథ్యంలో బీఆర్ఎస్, బిజెపి శవ రాజకీయాలు చేశాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. రాజకీయంగా ప్రశ్నించడం సహజమని, కానీ శవ రాజకీయం చేయడం తగదని ఆయన స్పష్టం చేశారు. ఆర్‌టిసికార్మికుల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని పేర్కొన్నారు. ఇటీవల మరణించిన ఆర్‌టిసికార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న నాయకులు చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. బిజెపి నేతలు, ముఖ్యంగా బండి సంజయ్ ఆ కుటుంబానికి కనీస సహాయం కూడా చేయలేదని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఎలాంటి లాభం చేకూరలేదని అన్నారు.శవ రాజకీయం, మత రాజకీయం చేయడం బిజెపికి అలవాటైందని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితిలో ఉన్న వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని అన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం గతంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.రానున్న రోజుల్లో బిజెపిపరిస్థితి మరింత దిగజారుతుందని, "డబుల్ ఇంజన్" కాదు, ఉన్న ఇంజన్ కూడా పోతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి బిజెపి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ ఆర్‌టిసి సమ్మెపై మాట్లాడితే ప్రజలు అంగీకరించరని, గతంలో వారి పాలనలో ఆర్‌టిసి ఆస్తులు అమ్ముకున్నారని గుర్తుచేశారు. ప్రత్యర్థి పార్టీల నేతలు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నప్పటికీ అవి నిజాలు కావని, ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గత 20 ఏళ్లుగా జిల్లాను అభివృద్ధి లో వెనక్కి నెట్టిన నాయకులు మళ్లీ కపట వేషాల తో ముందుకు వస్తున్నారని హెచ్చరించారు.ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, రజాలి,మాజీ కార్పొరేటర్ అబూ బకర్, నసీం జహాన్,బంక సరళ, బంక సంపత్, తోట పవన్ స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జనగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ దాడులు



**ప్రజాపక్షం/ జనగామ:**జనగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. రాకేష్‌రెడ్డి, గౌతమ్, తహసీల్దార్ లక్ష్మణ్‌లు మూకుమ్మడిగా దాడులు గత రిజిస్టార్ చేసిన పలు రిజిస్టేషన్లకు సంబంధించిన పత్రాలను తీసుకెళ్లారు. గత రెండు రోజుల క్రితం వరకు జనగామలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ కరుణారెడ్డి ప్రభుత్వ భూములతో పాటు చనిపోయిన వారి పేర ఉన్న భూమి కూడా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణ నేపథ్యంలో విజలెన్స్, ఎన్‌ఫోర్‌మెంట్ అధికారులు సోమవారం 11 గంటల నుండి రెండు గంటల వరకు సుమారు మూడు గంటలో సోదాలు చేశారు. పలు డ్యాక్యుమెంట్ల ను పరిశీలించారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ తనిఖీ చేశారు. నాన్‌లే అవుట్ ప్లాట్లను సైతం కరుణారెడ్డి రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు కీలకమైన పత్రాలు పరిశీలించిన అధికారులు మీడియోతో సైతం ఏమి మాట్లాడలేదు. కరుణారెడ్డి ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్‌గా కేవలం పది రోజుల్లోనే వందల డాక్యుమెంట్లు చేసి లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి.

## 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం' పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల ను కల్పించే ఉద్దేశంతో రూపొందించిన 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం' ప్రచార పోస్టర్‌ను నేడు అధికారికంగా ఆవిష్కరించారు. భారతదేశంలోని టాప్ 500 అగ్రశ్రేణి కంపెనీలలో ఇంటర్న్‌షిప్ పొందేందుకు ఈ పథకం ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 9,000/ ఆర్థిక సహాయం (స్టైఫండ్) అందించబడుతుంది.**అనుభవం:**దేశంలోని ప్రముఖ కంపెనీలలో ప్రత్యక్షంగా పని చేస్తూ వాస్తవ పరిశ్రమ అనుభవాన్ని పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పూర్తి స్థాయి ఉద్యోగంలో లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. దేశవ్యాప్తంగా అనేక జిల్లాల్లో వివిధ రంగాల్లో ఈ ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.**దరఖాస్తు విధానం:**ఆసక్తి ,అర్హత కలిగిన అభ్యర్థులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరడమైనది. pminternship.mca.gov.inటోల్ ఫ్రీ నంబర్ 1800 116 090 వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. యువత తమ కెరీర్‌ను ఉన్నతంగా నిర్మించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యంత్రాంగం పిలుపునిచ్చింది. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసరావు, దేశీ రామ్ నాయక్, ఉపాధి కల్పన అధికారి రజిత, క్రీడల అధికారిజ్యోతిలతో కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించారు,

## ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఐలో చేరండి

**జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేష్**

**ప్రజాపక్షం / నల్లబెల్లి :**పేద మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కోసం యువత సిపిఐ పార్టీలో చేరాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేష్ పిలుపునిచ్చారు . సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో మామిండ్ల పెద్ద అయిలయ్య అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు . ఈ సందర్భంగా అక్కపెల్లి రమేష్ మాట్లాడుతూ కేంద్రం ,రాష్ట్రంలో ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ ,బిజెపి ,బిఆర్ఎస్ ప్రభుత్వాలు పరిపాలించిన ప్రజా సమస్యలు పరిష్కరం కాలేదని గుర్తు చేశారు . పాలకుల నిర్లక్ష్యంగా బిసి ,ఎస్‌సి ,ఎస్‌టిమైనార్టీలకు విద్య ,వైద్యం ఉద్యోగ అవకాశాలు అందకుండ చేస్తు అగ్రవర్ణాలకు ఇడబ్ల్యుస్ రిజర్వేషన్లు అవకాశం కల్పించి బిసిలకు అవకాశం దొరకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . దేశ సంపద కొద్ది మంది కార్పొరేట్లకే కట్టబెడుతున్నరని ,వ్యవసాయ రంగంలో రైతులకు అనుకులమైన విధానాలు అవలంబించక పోవడంతో పంటలకు సయైన గిట్టుబాటు ధర అందడంలేదన్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్నా జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ పంచాయితి మల్టిపర్పస్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వారికి కనీసం 26 వేల వేతనం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు .ఆఫ్ లైన్ కార్మికులను ఆన్‌లైన్‌లో అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలన్నారు .

**మండల స్థాయి కమిటి ఎన్నిక:**

సిపిఐ మండల స్థాయి కమిటీని ఎన్నుకొనగా సిపిఐ మండల పార్టీ కార్యదర్శిగా బట్టు సాంబయ్యను ఎన్నుకొనగా ,ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష ,కార్యదర్శులగా కడియాల క్రాంతికుమార్ ,మర్రి రమేష్ ,ఎఐటియుసి మండల కార్యదర్శిగా కందిక రమేష్ ,చేతివృత్తుదారుల మండల కార్యదర్శిగా ఓదెల రవి ,రైతు సంఘం మండల కార్యదర్శిగా మామిండ్ల పెద్ద అయిలయ్య ,పార్టీ కార్యదర్శిగా కనుకం సాల్మాన్ ,సహాయ కార్యదర్శిగా మర్రి రమేష్ తదితరులను ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమంలో కనకం కోర్నెల్ ,రాములు తదితరులు పాల్గొన్నారు .

## అక్రిడిటేషన్ కమిటీ నియామకాలపై కలెక్టర్‌కు సీనియర్ జర్నలిస్టు ఫిర్యాదు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జయశంకర్ భూపాలపల్లి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నియామకాల్లో పారదర్శకత పాటించలేదని ఆరోపిస్తూ సీనియర్ జర్నలిస్టు డాక్టర్ తాళ్లపల్లి వెంకట సమ్మయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్‌ను కలిసిఅక్రిడిటేషన్ కమిటీ అక్రమనియామకాన్నిరద్దు చేయాలని వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు రోజు ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను స్వయంగా కలిసి ఈ విషయంపై వినతి పత్రాన్ని అందజేశారు. పారదర్శకంగా జరగని కమిటీ నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. జిల్లాలోనే 40 సంవత్సరాలుగా పత్రికా రంగంలో సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్ట్‌నైన తనకు అక్రిడిటేషన్ కమిటీలోసభ్యుడిగా అవకాశం ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాత్రికేయుడిగా, విశేష అనుభవం కలిగిన తనను పరిగణలోకి తీసుకోకుండా నియామకాలు చేపట్టడం అన్యాయమని పేర్కొన్నారు. కమిటీలో కొందరు అనర్హులను సభ్యులుగా నియమించారని, అందులోవార్తలు రాయరాని,పిడిఎఫ్,పేపర్లు రానివారు,నిందితులకు అవకాశం కల్పించారని ఆరోపించారు. అలాంటి వారిని సభ్యులుగా ఎంపిక చేయడం ప్రశ్నార్థకమని అన్నారు. లోపభూయిష్టమైన ఆ కమిటీని రద్దు చేయకుంటే అక్రిడిటేషన్‌ఎంపికై నిజాయితీ గల జర్నలిస్టులో నష్టపోయే ప్రమాదంపొంచి ఉన్నదన్నారు. అందువల్ల ప్రస్తుతం నియమించిన కమిటీని రద్దు చేసి, పారదర్శకంగా కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని విధాల అర్హత కలిగిన తనకు సభ్యుడిగా అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ వినతి పత్రం ప్రతులను సంబంధిత అధికారులకుకూడా పంపించినట్లు సమ్మయ్య తెలిపారు.

> హీరో జగపతి బాబు సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'తో రాబోతున్నారు. ఈ చిత్రంలో లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమమిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించారు.

రీల్



## జూన్ 5న వస్తున్న 'రావు బహదూర్'

మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్'. ఈ చిత్రాన్ని ఏ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. 'రావు బహదూర్' జూన్ 5న థియేటర్‌లలోకి రానుందని నిర్మాతలు ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ రాయల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో, అధికారం, రహస్యభావం కలిసిన లుక్‌తో ఆయన ప్రెజెన్స్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఆయన పాగాలో కనిపించే చిన్న పురుగు ఒక సింబాలిక్ అంశంగా కనిపిస్తూ కథలోని లోతైన అర్థాలను సూచిస్తోంది. తీగలతో కప్పబడ్డ భారీ కోట బ్యాక్‌డ్రాప్ సినిమా మరింత క్యురియాసిటీని పెంచింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన రాగా, ఫస్ట్ సింగిల్ 'ఓ సుందరి' బాక్‌బస్టర్‌గా నిలిచింది. సత్యదేవ్, దీప థామస్‌లపై చిత్రీకరించిన ఈ మెలోడీ ఒక వింటేజ్ ప్రేమను అందంగా ప్రతిబింబిస్తోంది. కథ, దర్శకత్వం, ఎడిటింగ్ అన్నీ బాధ్యతలను స్వయంగా తీసుకున్న వెంకటేష్ మహా యూనివర్సల్ ఎమోషన్స్‌ను కలిపిన కథను అద్భుతంగా తెరకెక్కించారు. కార్తీక్ పరమార్ సినిమాటోగ్రఫీని అందించగా, స్మరణ్ సాయి సంగీతాన్ని సమకూర్చారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేశారు. సత్య దేవ్, వికాస్ ముప్పాల, దీపా థామస్, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ నటించారు. ఈ చిత్రానికి నిర్మాతలు: చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి , శరత్ చంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ధినేష్ యాదవ్ బి, డిఒపి : కార్తీక్ పర్మార్.

## 'ది బ్లాక్ గోల్డ్' షూటింగ్ పూర్తి

వెర్సటైల్ హీరోయిన్ సంయుక్త నటిస్తున్న హీరోయిన్ సెంట్రిక్ పాన్ ఇండియన్ యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్'.. యోగేష్ కె ఎంసి దర్శకత్వంలో, మాగంటి పిక్చర్స్ సహకారంతో హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ కథ, చేతిలో గన్ ఉన్నప్పటికీ చట్టాన్ని ముఖ్యంగా భావించే ఒక పోలీస్ ఆఫీసర్ చుట్టూ తిరుగుతుంది. దేశాన్ని కుదిపేసిన కోల్ సిండికేట్‌ల నేపథ్యంలో, నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఈ కథ మరింత గ్రిప్పింగ్‌గా తీర్చిదిద్దారు. రిలీజ్ చేసిన తాజా పోస్టర్‌లో సంయుక్త పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తోంది. భారీ ఇండస్ట్రియల్ మెషీన్ ముందు సన్‌గ్లాసెస్‌తో స్టైలిష్‌గా నిలబడి, చేతిలో గన్‌ను పట్టుకుని కనిపించడం ద్వారా ఆమె పాత్రలోని అగ్రెషన్ ని ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రాన్ని మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆదిలాబాద్ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్లలో చిత్రీకరించారు. మొత్తం 60కి పైగా వర్కింగ్ డేస్‌లో షూటింగ్ పూర్తిచేయడం విశేషం. ఐదు పవర్‌ఫుల్ షెడ్యూల్స్‌లో, 10కి పైగా భారీ సెట్లలో, రోజుకు 300 మందికి పైగా క్రూ పాల్గొంటూ చిత్రీకరణ జరిగింది. మేకింగ్ వీడియోలో ఈ ఎఫర్ట్ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్రంలో మురళీ శర్మ, రావు రమేష్, నాసర్, మనీష్ వాధ్వా, రాంకి, రవీంద్ర విజయ్, అడుకలం నరేన్, రవి, కృష్ణ చైతన్య, చంద్రిక రవి ముఖ్యమైన పాత్రలలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సామ్ సిఎస్ సంగీతం సమకూర్చగా, ఎ. వసంత్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. చోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో పాన్ ఇండియన్ విడుదల కానుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: సింధు మాగంటి, డిఒపి; ఎ వసంత్, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి.



## 'కామాఖ్య'లో తిరుపతిగా సముద్రఖని



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లర్ సినిమా 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీవాణీ నాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా సముద్రఖని ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ 'తిరుపతి'గా ఆయన పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని ఫస్ట్ లుక్ సూచిస్తోంది.ఈ చిత్రానికి గ్యాని మ్యూజిక్ అందించారు. రమేష్ కుశేందర్ రెడ్డి డిఒపి, వరప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వరప్రసాద్, ఆర్ట్: భూపతి యాదగిరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీహరి గౌడ్

## 'వదలా' క్రెడిట్ జగపతిబాబుదే

### దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ




హీరో జగపతి బాబు సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'తో రాబోతున్నారు. ఈ చిత్రంలో లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్ పై కిషోర్ నాయుడు చిరుమమిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించారు. సోమవారం టీజర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ హృతిక శ్రీనివాస్ ఈ చిత్రంలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రతో సర్ప్రైజ్ ఎలిమెంట్‌గా నిలుస్తోంది. ఆమె పాత్రలో దాగి ఉన్న మలుపులు కథను మరింత ఆసక్తికరంగా మార్చాయి. రవి వర్మ కూడా కీలక పాత్రలో కనిపిస్తూ కథకి మరింత బలం అందించారు.హీరో జగపతి బాబు మాట్లాడుతూ జీవితంలో అన్నీ జరిగిపోయినట్టే 'వదలా' సినిమా కూడా జరిగింది. నిర్మాత కిషోర్ , భరద్వాజతో సినిమా చేయాలని వచ్చారు. అది ఇలా 'వదలా'గా రూపుదిద్దుకుంది. ఆర్టిస్టులు, టెక్నీషియన్స్, యూనిట్ అందరూ బంగారంలాంటి వారు. ఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా అందరూ ఎంజాయ్ చేస్తూ ఒక థ్రిల్లర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాం. ఈ క్వాలిటీకి ఆయన ప్రధాన కారణం ఆయనే, బంగారంలాంటి సినిమాను మీకు అప్పగిస్తున్నాం. దీన్ని కల్తీ చేయకుండా బాగా చూడాలి. 'మనోహరం' నుంచి నా జర్నీ ఉంది. ఈ రోజుల్లో ఒక సినిమా హిట్ కావాలంటే ఒక సాలిడ్ ఎలిమెంట్ ఉండాలి. 'ఓల్డ్ మాన్ – యంగ్ గర్ల్' కాన్సెప్ట్‌తో మంచి థ్రిల్లర్‌గా ఈ సినిమాను తీర్చిదిద్దాం. ఇందులో చాలా మంచి ట్విస్టులు ఉంటాయి అన్నారు. వెంటనే పూర్తి సినిమా చూడాలనిపించింది అని చెప్పారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ సినిమాలో జగపతి బాబు ఇన్‌వాల్వ్‌మెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. స్క్రిప్ట్ స్టేజ్ నుంచి ఫైనల్ వరకు ఆయన ఎంతో సహకారం అందించారు. లయ అద్భుతంగా నటించింది. డైరెక్టర్ వంశీ సినిమాను చాలా చక్కగా తీశా డు. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను. 50 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఉన్నానంటే మీడియా, ప్రేక్షకులు ఆశీర్వదిస్తేనే ఉన్నాను. మళ్ళీ ఆదరించి ఆశీర్వదిస్తారని కోరుతున్నాను. నిర్మాత కిషోర్ నాయు డు మాట్లాడుతూ ఈ సినిమాతో నేను ఎంతో మంది మంచి మనుషులను సంపాదించుకున్నాను. హృతిక ఈ సినిమా కోసం చాలా కష్టపడింది. లయ గారు చాలా సపోర్ట్ చేశారు. జగపతిబాబు గారు ప్రొడ్యూసర్ ఫ్రెండ్లీ హీరో అని అన్నారు.

## 'ఎ ఫిల్మ్ బై గిరి ' మే 8న విడుదల



స్టార్ వుడ్ ఎంటర్‌టైన్‌మెంట్, రిసిప్ శెట్టి ఫిలిమ్స్, బ్యానర్ లో ఎమ్ అచ్చిబాబు సమర్పణలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి హీరోగా రచన ఇందిర్ హీరోయిన్‌గా నటించిన సినిమా 'ఏ ఫిల్మ్ బై గిరి' అన్నీ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ద్వారా కరణ్ అనంత్ మరియు అనిరుద్ మహేష్ దర్శకులుగా పరిచయం అవుతున్నారు, ఎన్ సందేశ్ ఈ సినిమాను నిర్మించారు. మే 8న ఏ ఫిల్మ్ బై గిరి చిత్రాన్ని భారీగా రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్స్ ఎంజి మూవీస్ ద్వారా ఎం అచ్చిబాబు రిలీజ్ చేస్తున్నారు. ఎన్.పి తాపెశ్వరి, హోన్నవలి కృష్ణ, ప్రమోద్ శెట్టి ఈ సినిమాలో ముఖ్య పాత్రల్లో నటించారు. వాసుకి వైభవ్ సంగీతం అందించిన ఈ సినిమాకు రఘునాథ్ సిఎం సినిమాటోగ్రఫీ అందించారు అలాగే భరత్ ఎంసి, ప్రదీప్ అర్ రావు ఈ మూవీకి ఎడిటర్స్.

# సర్వేపై కూలంకషంగా చర్చించేందుకు కమిటీ

### బిసి కమిషన్ నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే2024 నివేదిక, స్వతంత్ర నిపుణుల వర్కింగ్ గ్రూప్ నివేదికలపై కూలంకషంగా చర్చించేందుకు అధికారుల బృందంతో ఒక కమిటిని ఏర్పాటు చేయాలని బిసి కమిషన్ నిర్ణయించింది. కమిటి నివేదికను పరిశీలించిన అనంతరం కమిషన్ ఈ కుల సర్వే విషయంలో తమ పరిశీలనను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బి. బాల మాయ దేవి , అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మి నారాయణలు హాజరయ్యారు.

నిపుణుల నివేదికలో గంగపుత్ర, బేస్త, గూండ్ల కులాలకు సంక్షిప్త నామంగా అగ్నికుల క్షత్రియ పేరుతో వ్యవహరించడం పట్ల అభ్యంతరాలను తెలుపుతూ ఆయా కులాల ప్రతినిధులు కమిషన్‌కు నివేదించడం జరిగింది. ఈ విషయాన్ని చర్చించిన కమిషన్ మరికొన్ని ఇతర కులాల విషయంలో కూడా సంక్షిప్త పేర్లు ప్రధాన కుల పేర్లకు విరుద్ధంగా ఉండడాన్ని కమిషన్ గుర్తించింది. ఈ విషయాన్ని సరిచేయాలని ప్రభుత్వాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది. 2025లో జరిగిన గ్రామ పంచాయితి ఎన్నికలలో ఎన్నుకోబడ్డ వార్డు సభ్యులు, సర్పంచుల వివరాల సేకరణపై పంచాయితీరాజ్ కమిషనర్‌తో చర్చించాలని కమిషన్ నిర్ణయించింది. అలాగే 2వ విడతలో తమ కుల వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కుల సంఘాలు, ప్రతినిధులు కూడా తమ కులస్తుల జనాభా నమోదయ్యేటట్టుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 130 వెనుకబడిన తరగతుల కులాల నమోదు కొరకు సెన్సెస్ వారు తీసుకుంటున్న చర్యలను వివరించాలని తెలంగాణ సెన్సెస్ ఆపరేషన్స్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని కమిషన్ నిర్ణయించింది.

# దివ్యాంగుల గౌరవ ప్రతీకగా యుడిఐడి గుర్తింపు : మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'యూనిక్ డిజేబుల్ ఐడి' (యుడిఐడి) అనేది కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదని, ఇదొక దివ్యాంగుల గౌరవానికి ప్రతీకగా నిలిచే హక్కు పత్రం అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి,మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో 'యుడిఐడి' ఎవాల్యూషన్ కేంద్రాన్ని మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, ఆసుపత్రి వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి యుడిఐడి కార్డు ఒక కొత్త జీవితం వైపు దారి చూపుతుందని, దివ్యాంగుల సామాజిక గుర్తింపును బలపరుస్తుందన్నారు. ఈ పోర్టల్ ద్వారా 21 రకాల వైకల్యాలను ధృవీకరించి, ప్రతి దివ్యాంగునికి హక్కుల ఆధారిత సేవలను ప్రభుత్వం అందిస్తున్నదని, ఇప్పటి వరకు రాష్ట్రంలో సుమారు 74 వేల యుడిఐడి కార్డులను జారీ చేసిందన్నారు. దివ్యాంగుల వైకల్యాన్ని ఖచ్చితంగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 13 యుడిఐడి కేంద్రాలను ఏర్పాటు చేశామని, త్వరలో మరో ఏడు కేంద్రాలను ప్రారంభించనున్నామని తెలిపారు. మొత్తం 33 జిల్లాలకు 792 ఆధునిక వైద్య పరికరాలను పంపిణీ చేసినట్టు వివరించారు. గతంలో వైకల్యాన్ని గుర్తించే సరైన పరికరాలు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురయ్యాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆధునిక సదుపాయాలతో ఖచ్చితమైన నిర్ధారణ ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి సీతక్క తెలిపారు.

## డిసెంబరు నాటికి న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్యం

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా నూటికి నూరుశాతం దేశీయ ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేస్తుంది. వీటిల్లో వస్త్రాలు,రత్నాలు,మాణిక్యాలు,ఆభరణాలు,తోలు ఉత్పత్తులు,ఇంజనీరింగ్ వస్తువులు,శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తులు వంటివన్నీ ఉన్నాయి. భారత వాణిజ్య,పరిశ్రమలశాఖామంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య–పెట్టుబడులశాఖామంత్రి టాడ్ మెక్ క్లే ఈ ఒప్పందంపై సోమవారం న్యూఢిల్లీలో సంతకాలు చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ద్వైపాక్షిక వస్తుసేవల వాణిజ్యం రెట్టింపుస్థాయిలో ఐదు బిలియన్ డాలర్లకు చేరుతుందని రెండు దేశాల మంత్రులూ అంచనావేశారు. ఈ ఒప్పందం అమలులోకి వచ్చేలోపు న్యూజిలాండ్ పార్లమెంటు లాంఛనపూర్వకంగా ఈ ఎఫ్‌టిఎకు ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఈ ఒప్పందాన్ని ''ఒక తరంలో ఒకేసారి ఒప్పందం''గా అభివర్ణించారు. ఒప్పందంపై సంతకాలు చేసేందుకు 40 మంది ప్రతినిధుల బృందంతో న్యూజిలాండ్ మంత్రి మెక్ క్లే భారత్‌కు వచ్చారు. ఈ ద్వైపాక్షిక స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ, ఈ ఒప్పందంవల్ల మన దేశంలో రైతులు ఎంతగానో ప్రయోజనం పొందుతారని చెప్పారు. అదేవిధంగా యువకులు,మహిళలు, అంకుర సంస్థలు, సూక్ష్మ ,చిన్నమధ్యతరహా ఔత్సాహిక పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ),హస్తకళానిపుణులు,చేతివృత్తులవారు,విద్యార్థులు, నవీన ఆవిష్కరణలు చేసే కొత్తతరం ఔత్సాహికులు ఎంతగానో లబ్ధిపొందుతారని చెప్పారు. ''న్యూజిలాండ్ దేశం 20 బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి తన చిత్తశుద్ధిని ప్రకటించిందని, తదుపరి వ్యవసాయం, తయారీరంగం,నవీన ఆవిష్కరణలు,సాంకేతికతలలో ఇరు దేశాలమధ్యా సహకారం మరింతగా బలపడుతుంది, ఈ ఒప్పందంవల్ల కేవలం ఆర్థికప్రగతి మాత్రమే కాకుండా, రెండు దేశాలకు ఎంతో చలనశీలమైన భవిష్యత్తు ఉంటుంది'' అని సోషల్ మీడియా ద్వారా మోదీ ఒక పోస్టింగ్ పెట్టారు.

గడచిన కొద్ది సంవత్సరాలలో భారతదేశం 38 అభివృద్ధి చెందిన దేశాలతో కుదుర్చుకున్న తొమ్మిదవ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందమని పీయూష్ గోయల్ ప్రకటించారు. ''ఈ ఒప్పందం వల్ల ఎగుమతులకు సాధికారత లభిస్తుందని, వ్యవసాయ ఉత్పత్తులు,ఇరు దేశాలమధ్యా విద్యార్థుల రాకపోకలు,ఉపాధి అవకాశాలు,నైపుణ్యవృద్ధి,పెట్టుబడులు,సేవలు వంటి అనేక అంశాలు విస్తారంగా వృద్ధిచెందుతాయి''అని చెప్పారు. ఈ వాణిజ్య ఒప్పందంలో భాగంగా రెండో విడత భారతదేశానికి మరో 20 బిలియన్ డాలర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా లభిస్తాయి.

## గొంతు కోయడమే

(మొదటి పేజీ తరువాయి)

పతనం కానున్నాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పిస్తే తప్ప రైతులకు మద్దతు ధర అందే అవకాశమే ఉండందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇప్పటికి దేశంలోని సుమారు 45 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడే జీవనం కొనసాగిస్తున్నారని, ఇంతటి కీలక రంగానికి సంబంధించిఅత్యంత జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండానే అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం అత్యంత దారుణమన్నారు. రాష్ట్రాలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, పంటల ప్రణాళికపై ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాల స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయని, దీంతో రాష్ట్రాలు తమ పంటల ప్రణాళికను సక్రమంగా రూపొందించలేకపోవడం, రైతులకు సరైన సలహాలు ఇవ్వలేకపోతుండడంతో వ్యవసాయ విధానాల బలహీనతకు దారితీస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. మరీ ముఖ్యంగా, అమెరికా రైతులు భారీ సబ్సిడీలు పొందుతుండగా, భారత రైతులు చిన్న స్థాయి, అధిక ఖర్చులతో సాగు చేస్తున్న పరిస్థితిలో ఈ వాణిజ్య ఒప్పందం సమాన పోటీని కల్పించదన్నారు. ఇది భారత రైతులపై ఆర్థిక ఒత్తిడిని పెంచే విధంగా ఉంటుందని, అంతర్జాతీయ మార్కెట్ పోటీలో నిలబడటానికి అవసరమైన మద్దతు లేకపోవడంతో దేశీయ రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.వ్యవసాయ ప్రణాళికలో ఎరువుల సరఫరా కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, ఈ అంశంలో ఉన్న అస్పష్టత రైతుల ఆర్థిక భద్రతను తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం చేసే ఏలాంటి నిర్ణయాలనైనా రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితులో అంగీకరించబోదని, ప్రయోజనాలను కాపాడటానికి కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఆధునిక వ్యవసాయంతో ఆదాయం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలన్నారు. సాగునీటిని అందించేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆధునీక వ్యవసాయంలో రఘునాథపాలెం మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆహార భద్రత చాలా కీలక అంశంగా మారనుందన్నారు. పెరుగుతున్న జనాభా, భూసారం తగ్గడం వంటి సమస్యలు కీలకం కానున్నాయన్నారు. సరైన పరిజ్ఞానంతో వ్యవసాయం చేయగలిగితే ఎకరానికి రెండు నుంచి మూడు లక్షలు సంపాదించే అవకాశం ఉందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆచార్య జయశంకర్, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ జానయ్య మాట్లాడుతూ 2025లో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రారంభించి 1200 గ్రామాల్లో 400 మంది శాస్త్రవేత్తలు, 400 మంది అధికారులు 1.20 లక్షల మంది రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రామిరెడ్డి గోపాలరెడ్డి, ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా॥ పావని, శాస్త్రవేత్తలు, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్, ఖమ్మం డివిజన్ ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, సర్పంచ్ గాజుల కృష్ణారావు, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ మాజీ చైర్మన్లు తాతా రఘురాం, రావూరి సైదబాబు, వ్యవసాయ శాఖాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌లకు మరిన్ని అధికారాలు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేసి, తక్షణమే లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాభావం దృష్ట్యా 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య జి ప్లస్ వన్ విధానంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి కల్పించామన్నారు.

**భూ వివాదాలకు సర్వే పరిష్కారం**

భూసర్వే ద్వారానే భూవివాదాలకు శాశ్వత పరిష్కారం సాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా సర్వే మ్యాపులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ఆర్‌డిఓలకు అధికారాలు అప్పగించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా తహశీల్దార్ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నామని, ముందుగా శిధిలావస్థలో ఉన్న భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌లను మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్ట్, ఎండోమెంట్, వక్ఫ్ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను ఉమ్మడి సర్వేతో పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాసరి అనసూయ సీతక్క, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి జి.వివేక్, ప్రభుత్వ సలహా దారులు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, ఆయా జిల్లా ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతం పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com